జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | గురువారం 30 ఏప్రిల్ 2026 | సంపుటి: 19 | సంచిక: 53 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , వైశాఖ మాసము , తిథి: చతుర్దశి - 21:15:20 వరకు నక్షత్రంచిత్ర - 26:17:19 వరకు కరణంగర - 08:32:16 వరకు, వణిజ - 21:15:20 వరకు పక్షంశుక్ల యోగంవజ్ర - 20:53:48 వరకు వారం

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com


## ప్రభుత్వ పరమైన హైదరాబాద్ మెట్రో

హైదరాబాద్,ఏప్రిల్ 29(ప్రజాజ్యోతి): హైదరాబాద్ మెట్రో రైలు మొదటి దశ ప్రాజెక్టు రాష్ట్ర ప్రభుత్వ పరమైంది. ఎల్ అండ్ టీతో షేర్ల కొనుగోలు ఒప్పందం పక్రియ పూర్తయ్యింది. రూ.1,461.47 కోట్ల విలువైన వంద శాతం

మిగతా1 2లో..

## స్కాలర్‌షిప్ నిధుల సమస్యకు పరిష్కారం

**అధికారులతో సమీక్షించిన డిప్యూటీ సీఎం భట్టి**

హైదరాబాద్,ఏప్రిల్ 29(ప్రజాజ్యోతి): రాష్ట్రంలోని పేద విద్యార్థులు ఎదుర్కొంటున్న స్కాలర్‌షిప్ నిధుల సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

మిగతా 2లో..



## బెంగాల్ ఎగ్జిట్ పోల్స్‌పై భిన్నాభిప్రాయం

- కొన్నింటిలో బిజెపి హవా చాటినట్లు వెల్లడి
- మరికొన్ని పోల్స్‌లో టిఎంసిదే విజయమని ప్రకటన
- మార్పు కోరుకున్న కేరళం ప్రజానీకం
- యూడిఎఫ్‌కు అధికారం దక్కే ఛాన్స్
- పెద్దగా ప్రభావం చూపని ఎన్‌డిఎ
- తమిళనాట మళ్లీ డీఎంకేదే అధికారం
- ఎన్నికల్లో విజయ్ పార్టీ ప్రభావం స్వల్పమే
- విపక్షానికే అన్న డిఎంకే కూటమి పరిమితం
- అసోంలో బీజేపీ పార్టీ హ్యాట్రిక్ విజయం!!
- అన్ని ఎగ్జిట్ పోల్స్‌లోనూ దాదాపుగా ఇదే అంచనా
- ముఖ్యమంత్రిగా హిమంత్ బిశ్వశర్మకే ప్రజల ఓటు

న్యూఢిల్లీ,ఏప్రిల్ 29(ప్రజాజ్యోతి): పశ్చిమబెంగాల్ ప్రజలు మార్పు కోరుతూ ఓటేశారని ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నాయి, టీఎంసీ హవాకు ఈసారి గండి పడి, బీజేపీ విజయం సాధించనుందని పలు ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నాయి. చాణక్య స్ట్రాటజీస్ , మ్యాట్రిజ్, ప్రజాపోల్, పోల్ డైరీ వంటి ఎగ్జిట్‌పోల్స్ బీజేపీకి పట్టం కట్టాయి.

మిగతా 2లో..

### బెంగాల్లో ముగిసిన రెండోదశ పోలింగ్

**90శాతం దాటిన పోలింగ్ నమోదు**

**మరింత పెరిగే ఛాన్స్ ఉన్నట్లు వెల్లడి**

**మళ్లీ తమదే అధికారం అన్న మమతా బెనర్జీ**

కోల్‌కతా,ఏప్రిల్ 29(ప్రజాజ్యోతి): పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రెండో విడత పోలింగ్ ముగిసింది. 90 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. అయితే 6 గంటల లోపు క్యూలో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం ఈసీ కల్పించడంతో పోలింగ్ శాతం పెరిగే అవకాశం ఉంది. పోలింగ్ సందర్భంగా చెదురుమదురు హింసాత్మక సంఘటనలు చేటుచేసుకున్నాయి. కొన్ని చోట్ల ఈవీఎంలు మెరాయించడంతో ఓటింగ్ ఆలస్యంగా మొదలైంది. పలుచోట్ల బిజెపి, టిఎంసి కార్యకర్తలు ఘర్షణలకు దిగారు. అయితే సిఆర్‌పిఎఫ్ పోలీసులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండడంతో పెద్దగా ఘర్షణలు చోటు చేసుకోలేదు. ప్రజలు పెద్ద ఎత్తున

మిగతా 2లో..

## తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణానికి

# కార్యాచరణ

## 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే మహారాష్ట్రకు సమస్యరాదు

- ముంపు వాటిల్లితే పరిహారానికి ప్రభుత్వం సిద్ధం
- అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్
- కిషన్‌రెడ్డితో మాట్లాడి మహారాష్ట్రను ఒప్పించాలి
- ఉత్తమ్‌ను ఆదేశించిన సీఎం రేవంత్‌రెడ్డి
- ప్రాణహితపై వెనక్కి తగ్గేది లేదు
- ప్రాజెక్టు ప్రతిపాదనలు సిద్ధం చేశాం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి





హైదరాబాద్, ఏప్రిల్ 29(ప్రజాజ్యోతి): తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణ కార్యాచరణ వేగవంతం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే మహారాష్ట్రలో పెద్దగా ముంపు ప్రభావం ఉండదని సిఎం అన్నారు. ఒకవేళ ముంపు వాటిల్లితే పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ బ్యారేజ్‌పై అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రాణహిత– చేవెళ్ల ప్రాజెక్టుపై రూ.11 వేల కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. తుమ్మిడిహట్టి బ్యారేజ్ విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలంటూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి లేఖ రాయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సీఎం సూచించారు. ఇక్కడి నుంచి నీళ్లు తరలించడం సులవుగా ఉంటుందని అన్నారు. నీటి లభ్యత కూడా ఎక్కువేనని అన్నారు. అయితే ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ప్రాజెక్టు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని స్పష్టం చేశారు. తుమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించేందుకు భగీరథ ద్వారా ప్రయత్నం జరుగుతోందని

మిగతా 2లో..

## రాష్ట్రంలో జోరుగా ధాన్యం

# కొనుగోళ్లు

### 90 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం

- 141లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా
- మొత్తం 8,525 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- మిల్లులకు చేరిన 7లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం
- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ వెల్లడి





హైదరాబాద్,ఏప్రిల్ 29(ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా యాసంగి వరి ధాన్యం కొనుగోలు పక్రియ అత్యంత వేగంగా, పారదర్శకంగా సాగుతోందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ వెల్లడించారు. రైతులకు కనీస మద్దతు ధర కల్పిస్తూ, ఎక్కడా ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ఆయన స్పష్టం చేశారు. ఈ యాసంగి సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. 'ప్రభుత్వం ఈ సీజన్‌లో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తం 8,525 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, ఇప్పటికే 6,500కు పైగా కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఐకేపీ

మిగతా 12లో..

## తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదల

**మొత్తం 95.1 శాతం ఉత్తీర్ణత**

**96.26 శాతం ఉత్తీర్ణతతో ముందున్న బాలికలు**

**ఫలితాల్లో ములుగు జిల్లా ఫస్ట్.. హైదరాబాద్ లాస్ట్**



హైదరాబాద్,ఏప్రిల్29(ప్రజాజ్యోతి): తెలంగాణ పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. బుధవారం మధ్యాహ్నం ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు ఫలితాలను విడుదల చేశారు. మొత్తం 95.1 శాతం

మిగతా 2లో..

## రీజెన్సీ సిరామిక్ వ్యవస్థాపకుడు జీఎన్ నాయుడు కన్నుమూత

యానాం,ఏప్రిల్ 29(ప్రజాజ్యోతి): ప్రముఖ పారిశ్రామికవేత్త, యానాం రీజెన్సీ గ్రూపు ఆఫ్ కంపెనీస్ అధినేత డాక్టర్ జీఎన్ నాయుడు(87) కన్నుమూశారు.





అనారోగ్యం కారణంగా హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. 1983లో రీజెన్సీ సెరామిక్స్‌ను జీఎన్ నాయుడు ప్రారంభించారు. యానాంలోని రీజెన్సీ సెరామిక్స్ కంపెనీలో గతంలో భారీ

మిగతా 2లో..



## సీఎం రేవంత్‌తో కొత్త డీజీపీ ఆనంద్ భేటీ

- డీజీపీగా నియమించినందుకు కృతజ్ఞతలు
- నేడు పదవీవిరమణ చేయనున్న ప్రస్తుత డీజీపీ
- 1న బాధ్యతలు తీసుకోనున్న ఆనంద్

హైదరాబాద్,ఏప్రిల్ 29(ప్రజాజ్యోతి): తెలంగాణ నూతన డీజీపీగా నియమితులైన సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ లో భేటీ అయ్యారు. రాష్ట్ర శాంతిభద్రతల పరిరక్షణలో తనపై నమ్మకం ఉంచి డీజీపీగా బాధ్యతలు అప్పగించినందుకు సీఎంకు ఈ సందర్భంగా సీవీ ఆనంద్ కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలో నేరాల

మిగతా 12లో..

## రిటైర్డ్ ఉద్యోగులకు తీపికబురు

**బకాయిల చెల్లింపులకు వేయికోట్ల విడుదల**

**ఉత్తర్వులు జారీ చేసిన ఆర్థిక శాఖ**

హైదరాబాద్,ఏప్రిల్ 29(ప్రజాజ్యోతి): ఇటీవల కేబినేట్‌లో తీసుకున్న నిర్ణయం మేరకు తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా తొలివిడతలో బుధవారం వేయికోట్లను ఆర్థికశాఖ విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టమైన ఆదేశాల మేరకు,

మిగతా 2లో..

## అధికారం రావడం.. పోవడం

# రొటీన్ వ్యవహారం

హామీలు గుప్పించి..ప్రజలను మోసం చేస్తున్న రేవంత్

కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగం అవుతామని కేసీఆర్ ఆనాడే హెచ్చరించారు

రేవంత్‌తో నాకేమీ వ్యక్తిగత పంచాయితీ లేదు: కేటీఆర్

హైదరాబాద్,ఏప్రిల్ 29(ప్రజాజ్యోతి): అధికారం రావడం పోవడం రొటీన్‌గా జరిగే తంతు అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ ,మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. నాయకులు, ప్రభుత్వాలు మారుతుంటాయి. ప్రజల స్థితిగతులు మారుతున్నాయా లేదా అని ఆలోచించడం లేదని తెలిపారు. బుధవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన జాయినింగ్ కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. అధికారం తమకు కొత్తేం కాదని వెల్లడించారు. మొన్ననే తమ పార్టీ ఏర్పడి 25 ఏళ్లు పూర్తిచేసుకుందని గుర్తు చేశారు. తెలుగు రాష్ట్రాల్లో తెలుగుదేశం పార్టీతోపాటు బీఆర్ఎస్ మాత్రమే నిలబడ్డాయని చెప్పారు. అధికారంలోకి రాకుంటే కొంపలు అంటుకుపోతాయి

మిగతా 12లో..



## పంచాయితీ అధికారులకు పదోన్నతులు

హైదరాబాద్,ఏప్రిల్ 29(ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ అధికారుల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. గ్రామ పంచాయతీ అధికారుల పదోన్నతులకు తెలంగాణ సర్కార్ పచ్చ జెండా ఊపింది. జూనియర్ అసిస్టెంట్లు, జీపీవోలకు 60:40 నిష్పత్తిలో సీనియర్ అసిస్టెంట్ పోస్టులకు పదోన్నతులు కల్పించాలని నిర్ణయించింది. జిల్లా స్థాయిలో రొటేషన్ పద్ధతిలో ఈ పక్రియ సాగనుంది. ఈ కొత్త నిబంధనలు 2026 ఫిబ్రవరి 12 నుంచి అమలులోకి రానున్నాయి. దీనివల్ల వేలమంది అధికారులకు లబ్ధి చేకూరడమే కాకుండా, గ్రామాల్లో పాలన మరింత పటిష్టం కానుంది. అధికారులు వెంటనే ఈ పక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

## పైలట్ ప్రాజెక్టు సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

**- వీఆర్వో రాజారాం**





**నేరడిగొండ, ఏప్రిల్ 29 ప్రజాజ్యోతి :** మండలంలోని బుద్దికొండ గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పైలట్ ప్రాజెక్టు భూ సర్వే ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. బుద్దికొండ శివారులోని వ్యవసాయ భూములను అత్యాధునిక పద్ధతుల్లో కొలతలు చేసే కార్యక్రమాన్ని అధికారులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గ్రామ పరిపాలన అధికారి (వీఆర్వో) ఆడెపు రాజారాం మరియు సర్వేయర్ శంకర్ మాట్లాడుతూ.. పైలట్ ప్రాజెక్టు కింద గ్రామంలోని భూములకు పక్కాగా కొలతలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఈ సర్వే ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలతో ఈ సర్వేలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ శంకర్, గ్రామ పరిపాలన అధికారి రాజారామ్ తో పాటు లైసెన్స్‌డ్ సర్వేయర్లు అర్జున్, అవినాష్, బొర్రా నవీన్, సింగం రాజేశ్వర్ మరియు స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వేసవిలో త్రాగునీటి సమస్య

**- పట్టణంలో గల కోతుల బెడద నివారణ, మున్సిపల్ భవన నిర్మాణంపై చర్చ**
**- ఖానాపూర్ మున్సిపల్ తొలి సమావేశం హాజరైన ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్ - చైర్పర్సన్ అంకం మౌనిక**



**ఖానాపూర్ ఏప్రిల్ 29(ప్రజాజ్యోతి) :** వేసవిలో త్రాగునీటి సమస్య తీర్చేందుకు బోరు బావులు చేతిపంపులను మరమ్మత్తులతో పాటు పట్టణంలో గల కోతుల బెడద నివారణ ఖానాపూర్ మున్సిపల్ కొత్త భవన నిర్మాణం పై నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపాలిటీ తొలి సమావేశం చైర్ పర్సన్ అంకం మౌనిక అధ్యక్షతన జరగగా ముఖ్యఅతిథిగా స్థానిక శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ బుధవారం పాల్గొన్నారు ఏప్రిల్ మాసపు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరైన ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్ నిశాలువాతో ఘనంగా సన్మానించిన మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యులు ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముహమ్మద్ షోయబ్ హుస్సేన్ కౌన్సిలర్లు గొర్రె తిరుమల గంగాధర్ తాళ్లపల్లి రాజగంగన్న సాజియా బేగం జమాల్ గుమ్ముల ఆనంద్ కుమార్ మేష పోసాని నిమ్మల రమేష్ బొప్పరపు సత్యవతి బండి పెల్లి సింధుజ ప్రకాష్ గౌడ్ చిన్నం సత్యనారాయణ తొడసం ఇందిరా ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్ మున్సిపాలిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి పైపుల లీకేజీతో నీరు వృథా





**మంచిర్యాలరూరల్ ఏప్రిల్ 29 (ప్రజాజ్యోతి) :** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 19వ డివిజన్‌లోని రాళ్లపేట బ్రిడ్జ్ నుండి రంగపేటకు వెళ్లే రహదారిపై తాగునీటి పైపు పగిలి, నీరు వృథాగా పారుతోంది.ఈ సమస్య కారణంగా స్థానిక ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.పైపు పగిలిన ప్రాంతంలో నీరు రోడ్డుమీద చేరడంతో రహదారి తడిసి,రహదారి బురదమయమైంది. దీంతో వాహనదారులతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో వాహదారులకు ప్రమాదం జరిగే ఆస్కారం ఉందని స్థానికులు పేర్కొన్నారు. వేసవిలో నీటి కొరతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ఇంత పెద్ద మొత్తంలో తాగునీరు వృథా కావడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వెంటనే స్పందించి పగిలిన పైపును మరమ్మతు చేసి,నీటి వృథాను ఆపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## నగరంలో ఏవైపు చూసిన చెత్తమయం!



**మంచిర్యాలరూరల్ ఏప్రిల్ 29 (ప్రజాజ్యోతి) :** మంచిర్యాల పట్టణంలోని బైపాస్ రోడ్డు మొదలుకొని అమరవీరుల స్థూపం వరకు రోడ్డుకు ఇరువైపులా చెత్తచెదారాలతో కంపుకొడుతున్నాయి.రాత్రి సమయంలో కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు రహదారి పక్కనే చెత్తను పడేస్తుండటంతో పరిసరాలు అస్వచ్ఛంగా మారుతున్నాయి.ఈపరిస్థితి స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తోంది. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చెత్త నిర్వహణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంలో శానిటేషన్ అధికారులు విఫలం అయ్యారు.పట్టణంలోని ఏ వైపు కన్నెత్తి చూసిన ఎక్కడ పడితే అక్కడ చెత్త పేరుకుపోవడం సాధారణమైపోయింది.ముఖ్యంగా బైపాస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న రహదారికి ఇరువైపులా చెత్తతో నిండిపోయి దుర్వాసనతో బాధాకర పరిస్థితులు నెలకొన్నాయి అని స్థానికులు వాపోతున్నారు. మున్సిపల్ కార్పొరేషన్లోని శానిటేషన్ విభాగం అధికారులు అవసరమైన స్థలాల్లో చెత్త సేకరణ కోసం డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా,ఆ దిశగా తగిన చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు దారితీస్తోంది.దీనివల్ల ప్రతి డివిజన్‌లో కూడా చెత్త సమస్య మరింతగా పెరుగుతోంది.ఈ సమస్య కారణంగా స్థానిక ప్రజలు తమ ఇళ్లలో నివసించడానికే ఇబ్బంది పడుతూ,ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు.దుర్వాసన, దోమలు,వ్యాధుల ప్రమాదం పెరుగుతున్నందున ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికైనా మున్సిపల్ కార్పొరేషన్ శానిటేషన్ విభాగం అధికారులు స్పందించి,తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.చెత్త నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు,అవగాహన కార్యక్రమాల బలోపేతం,అదే విధంగా అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాటు అత్యవసరమని ప్రజలు భావిస్తున్నారు.

# కోల్ ఇండియా కోల్ పెన్షనర్స్ సమస్యలను పరిష్కరించాలి

**- కోల్ మైన్స్ పెన్షన్ స్కీమ్-1998పై ప్రధాని జోక్యం చేసుకోవాలి**
**- ప్రధాని మోడీకి వినతిపత్రం సమర్పించిన ఆల్ ఇండియా కోల్ పెన్షనర్స్ అసోసియేషన్**



**మంచిర్యాల, 29, ఏప్రిల్ (ప్రజా జ్యోతి) :** ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కోల్ ఇండియా కోల్ పెన్షనర్స్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, కోల్ మైన్స్ పెన్షన్ స్కీమ్-1998పై ప్రధాని మోడీ ప్రత్యక్ష జోక్యం చేసుకుని పెన్షన్ పెంపు చర్యలు చేపట్టాలని ఆల్ ఇండియా కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ (ఏఐసీపీఏ) ప్రతినిధులు కోరారు. ఈ మేరకు భారత ప్రధానమంత్రి కార్యాలయానికి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. కోల్ మైన్స్ పెన్షన్ స్కీమ్-1998 అమలులో ఉన్న లోపాల వల్ల లక్షలాది మంది పెన్షనర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సంఘం పేర్కొంది. 1998 నుంచి ఇప్పటివరకు పెన్షన్‌కు సరైన సవరణ జరగలేదని, కరువు భత్యం అమలు కాకపోవడం వల్ల ప్రస్తుత ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా పెన్షన్ ఉండడం లేదని వివరించింది. దాదాపు 28 సంవత్సరాలుగా పెన్షనర్లు తమ హక్కైన పెన్షన్ సవరణ కోసం ఎదురుచూస్తున్నప్పటికీ, అనేక సమావేశాలు, కమిటీలు, చర్చలు జరిగినా ఎటువంటి స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదని సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. 2026 మార్చి 12న జరిగిన ఉన్నత స్థాయి కమిటీ సమావేశం కూడా నిర్ణయాలకు రాకుండా చర్చలకే పరిమితమైందని పేర్కొన్నారు. పరిపాలనా మంత్రిత్వ శాఖ, కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్), సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్), సీఎంపీఎఫ్‌ఓ ట్రస్ట్ బోర్డు సభ్యులు సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యారని ఏఐసీపీఏ ఆరోపించింది. అనేక సంవత్సరాలుగా జరిగిన సమావేశాలు పెన్షనర్లకు ఉపశమనం కలిగించలేదని, ఇది సంస్థాగత అసమర్థతకు నిదర్శనమని పేర్కొంది. కరువు భత్యం, పెన్షన్ సవరణ వంటి కీలక అంశాలు పదేపదే వాయిదా పడుతున్నాయని, కాలపరిమితి లేకుండా కమిటీలను ఏర్పాటు చేయడం కేవలం లాంఛనంగా మారిందని విమర్శించింది. ఈ జాప్యాల వల్ల పెన్షనర్ల గౌరవం దెబ్బతింటోందని, వృద్ధాప్యంలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపింది.

ఈ నేపథ్యంలో ప్రధాని ప్రత్యక్ష జోక్యంతో సమస్యపై బాధ్యతను నిర్ధారించి, కరువు భత్యాన్ని వెంటనే అమలు చేయాలని, 1998 నుంచి పేరుకుపోయిన వ్యత్యాసాలను పరిష్కరించేలా ఒకేసారి పెన్షన్ సవరణ చేపట్టాలని డిమాండ్ చేసింది. అలాగే నిర్ణయాల అమలుకు స్పష్టమైన కాలపరిమితి నిర్ణయించి, పెన్షనర్ల ప్రతినిధులను నిర్ణయాత్మక వేదికల్లో భాగస్వామ్యం చేయాలని కోరింది. బొగ్గు రంగానికి చెందిన పెన్షనర్లు తమ జీవితాన్ని దేశ పరిశ్రమకు అంకితం చేశారని, వారి న్యాయమైన హక్కులను ఇకపై ఆలస్యం చేయడం సమంజసం కాదని ఏఐసీపీఏ కన్వీనర్ పి.కె. సింగ్ రాథోడ్ ప్రధానమంత్రిని విజ్ఞప్తి చేశారు.

# 4 లేబర్ కోడ్లను రద్దు చేసి 44 కార్మిక చట్టాలను కొనసాగించాలి

**- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు**




**మంచిర్యాల, 29, ఏప్రిల్ (ప్రజా జ్యోతి) :** మేడే ఉత్సవాలను గ్రామ గ్రామాన, కార్మిక వాడల్లో అధిక సంఖ్యలో కార్మికులు హాజరై ఘనంగా నిర్వహించా లని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు కోరారు. మంచిర్యాల గవర్నమెంట్ ఆస్పత్రిలో మేడే వాల్ పోస్టర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ధ్వజమెత్తారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, 4 లేబర్ కోడ్లుగా మార్చి కార్పొరేట్ యాజమాన్యాలకు అనుకూలంగా తయారుచేశారని విమర్శించారు. 4 కోడ్‌లను వెంటనే విరమించుకొని, సామాన్య కార్మికులకు ఉపయోగపడే 44 కార్మిక చట్టాలను యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.కనీస వేతనాలు అమలు చేయాలని, కాంట్రాక్ట్, థర్డ్ పార్టీ, అవుట్సోర్సింగ్ విధానాలకు స్వస్తి పలికి ప్రతి ఒక్కరినీ పర్మినెంట్ ఉద్యోగులుగా నియమించా లని కోరారు.ఈ కార్యక్రమంలో మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులు మధు, రాజమల్లు, ప్రశాంత్, రాకేష్, అశోక్, చంద్రయ్య, సత్తయ్య, లత, దుబ్బమ్మ, మాణిక్యలు పాల్గొన్నారు.

# 144 మంది లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ





**- మంత్రి వివేక్ వెంకటస్వామి**
**- పార్టీలో చేరికలు, ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో పాల్గొన్నారు**

**మంచిర్యాల, ఏప్రిల్ 29 (ప్రజా జ్యోతి) :** మంచిర్యాల జిల్లా చెన్నూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కోటపెల్లి, జైపూర్ మండలాలకు చెందిన 144 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ, సాధీ ముభారక్ పథకాల కింద చెక్కులను రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కూడా పాల్గొన్నారు. తర్వాత చెన్నూరు మండలం పొక్కూరు గ్రామానికి చెందిన టీఆర్ఎస్ సర్పంచ్ ఐత స్వరూప--సత్తయ్య మంత్రి వివేక్ వెంకటస్వామి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకిఆహ్వానించారు. ఇదే సందర్భంగా చెన్నూరు మండలం బావురావుపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎగుడ శేఖర్ ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో కూడా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నిరుపేదల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఇందిరమ్మ ఇళ్ల పథకం సత్ఫలితాలను ఇస్తోందని తెలిపారు. ఈ పథకం ద్వారా నిరుపేదలు సంతోషంగా ఉన్నారన్నారు. అర్హులైన ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సైకాలజిస్టుల దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశం





**మంచిర్యాల, 29, ఏప్రిల్ (ప్రజా జ్యోతి) :** తెలంగాణ సైకాలజిస్టుల రాష్ట్ర అధ్యక్షులు డా. మోత్కూరి రామచందర్ మార్గదర్శకాలు మేరకు బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ రోడ్‌లో గల "ప్రకృతిమిత్ర" కార్యాలయంలో మంచిర్యాల జిల్లా సైకాలజిస్టుల ముఖ్య బాధ్యులతో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు రంగు వేణు కుమార్ అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు బి. నారాయణ రావు, ముఖ్య సలహాదారులు గుండేటి యోగేశ్వర్, కస్తూరి పద్మ చరణ్, అలాగే వివిధ బాధ్యులు పప్పుల నాగరాజు, చిందం మొగిలి పాల్గొని పలు తీర్మానాలు చేశారు. మే నెల 5 నుంచి 10 వరకు జరిగే దశాబ్ది ఉత్సవాల కార్యక్రమాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో ఒక రోజు ప్రారంభ కార్యక్రమం, మరో రోజు "మానసిక ఆరోగ్యం.. జాగ్రత్తలు" అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.అలాగే రాష్ట్ర స్థాయిలో మే 9, 10 తేదీల్లో హైదరాబాదులో జరిగే దశాబ్ది ఉత్సవాలలో జిల్లాలోని సైకాలజిస్టులు అందరూ ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాలను విజయ వంతం చేయాలని జిల్లా సైకాలజిస్టులకు పిలుపునిచ్చారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



**సొనాల, ఏప్రిల్ 29: (ప్రజాజ్యోతి) :** సోనాల మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర మార్కుఫెడ్ వారి ఆధ్వర్యంలో పీఏసీఎస్ బోథ్ ద్వారా ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని బుధవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న రైతును ఎమ్మెల్యే సన్మానించారు. జొన్న కొనుగోలు కేంద్రాల కొరకు ప్రభుత్వాన్ని కోరుతున్నామని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే రైతులతో రోడ్డెక్కుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన ఎంపీ నగేష్



**నేరడిగొండ, ఏప్రిల్ 29 (ప్రజాజ్యోతి) :** ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని కుమారి గ్రామంలో బుధవారం నిర్వహించిన వివాహ వేడుకకు ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) నగేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామానికి చెందిన బిక్కా భూదేవి - ఆడెల్లు దంపతుల ఏకైక పుత్రిక వివాహ మహోత్సవానికి విచ్చేసిన ఆయన, నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వెంట బిజెపి నేతలు, మండల నాయకులు పాల్గొన్నారు. హాజరైన వారిలో నేరడిగొండ బిజెపి మండల కన్వీనర్ ఆకుల రాజశేఖర్, పి.వి.రమణ, బిక్క గంగాధర్‌తో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎంపీ రాకతో వివాహ వేడుకలో సందడి నెలకొంది.

## రైతులు పంట మార్పిడి పద్ధతి పాటించాలి



**లక్ష్మణ చాంద, ఏప్రిల్ 29 (ప్రజాజ్యోతి) :** మండలంలోని పీచర గ్రామంలో రోజున రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక భాగంలో బుధవారం రోజున రైతులకు యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. రైతులు యూరియాను అధికంగా వాడితే దాని వల్ల వచ్చే అనర్ధాల గురించి తెలిపారు. రైతులు పంట మార్పిడి పద్ధతి పాటించి అధిక దిగుబడి పొందాలని సైంటిస్టు జుట్టు రవీందర్ అన్నారు. ముఖ్యంగా రైతులు ఆర్గానిక్ పద్ధతిలో పంటలను పండించాలని వారికి సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తిప్పని రాజేశ్వర్, రవీందర్, పవన్, వ్యవసాయ విస్తరణాధికారి సుస్మిత, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## సాయిబాబ మందిర ప్రాంగణంలోని గోశాల ఆవులకు పశుగ్రాసం విరాళం



**లక్ష్మణచాంద, ఏప్రిల్ 29 (ప్రజా జ్యోతి) :** నిర్మల్ జిల్లా కేంద్రంలో ఉన్న గండి రామన్న సాయిబాబా ఆలయంలోని గోశాలలో ఉన్న గోవులకు ఎండాకాలం కారణంగా వాటికి మేత కరువు కావడంతో ఈ విషయాన్ని తెలుసుకున్న ఎస్.జే డబ్ల్యు హెచ్ ఆర్ సి నిర్మల్ జిల్లా చైర్మన్ అయిట్ల సుదర్శన్ బుధవారం రోజున రెండు ట్రాక్టర్ల లో ఆలయ ప్రాంగణంలోని గోశాలలో ఉన్న ఆవులకు పశుగ్రాసాన్ని విరాళంగా అందించారు.గత రోజులలో కూడా ఆవులకు ఆయన పశుగ్రాసాన్ని అందించడం జరిగింది. ఈ విషయాన్ని తెలుసుకున్న గ్రామస్తులు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గంగారెడ్డి, రాజు, శ్రీనివాస్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# రేపటి నుంచే రాష్ట్రవ్యాప్తంగా జాబ్ మేళాలు ప్రారంభం

**మంచిర్యాల, ఏప్రిల్ 29 (ప్రజాజ్యోతి) :** తెలంగాణ ప్రభుత్వం క్రీడలు ఽ యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా యువతకు విస్తృత స్థాయిలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు జాబ్ మేళాలు నిర్వహించనున్నారు. ఈ జాబ్ మేళాలు మే 1వ తేదీ నుంచి ప్రారంభమై పలు జిల్లాల్లో కొనసాగనున్నాయి. మొదటి జాబ్ మేళా మే 1న మహబూబ్‌నగర్‌లో నిర్వహించగా, మే 2న నల్గొండ, మే 4న ఖమ్మం, మే 5న కరీంనగర్ జిల్లాల్లో జరుగుతాయి. మే 6న పెద్దపల్లి, ఆదిలాబాద్ జిల్లాల్లో, మే 7న నిజామాబాద్, మే 8న సంగారెడ్డి, వరంగల్ జిల్లాల్లో జాబ్ మేళాలు నిర్వహించనున్నారు. అనంతరం మే 11న రంగారెడ్డి, మే 12న హైదరాబాద్‌లో జాబ్ మేళాలతో ఈ కార్యక్రమం ముగుస్తుంది. ఈ జాబ్ మేళాల్లో తయారీ, బ్యాంకింగ్, డిజిటల్ మీడియా, ఫైనాన్స్,

**యువతకు 20,000కు పైగా ఉద్యోగావకాశాలు**

హెల్త్‌కేర్, ఐటీ, బిజినెస్ సర్వీసెస్, కస్టమర్ సర్వీసెస్, లాజిస్టిక్స్, హాస్పిటాలిటీ వంటి విభిన్న రంగాల్లో ఉద్యోగాలు అందుబాటులో ఉంటాయి. మొత్తం 250కు పైగా కంపెనీలు పాల్గొనగా, సుమారు 20,000 మంది ఉద్యోగార్థులకు అవకాశాలు లభించనున్నాయి. ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు, ఫ్రెషర్స్ మరియు అనుభవం ఉన్న వారు అందరూ ఈ జాబ్ మేళాల్లో పాల్గొనవచ్చు. అభ్యర్థులు మొబైల్ యాప్ లేదా అధికారిక వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. నమోదు చేసిన వారికి ఎస్ఎంఎస్ లేదా ఈమెయిల్ ద్వారా ఇంటర్వ్యూ వివరాలు అందజేయబడతాయి. ఇక మే 18 నుంచి 23 వరకు "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా ఆరు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో మారథాన్, కెరీర్ అండ్ స్కిల్ డే, యూత్ లీడర్షిప్ సమ్మిట్, స్పోర్ట్స్ డే, స్వచ్ఛ తెలంగాణ కార్యక్రమాలు, ఉద్యోగ సాధన కార్యక్రమాలు ఉంటాయి. ఈ కార్యక్రమాలను ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ, ఇండస్ట్రీస్ & కామర్స్ శాఖల సహకారంతో నిర్వహించగా, టాస్క్, డీట్ మద్దతు అందిస్తున్నాయి. టెక్నాలజీ భాగస్వాములుగా సాఫ్ట్‌పాత్ టెక్నాలజీస్, వాలెరో సంస్థలు వ్యవహరిస్తున్నాయి. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని మంచిర్యాల జిల్లా యువజన మరియు క్రీడల అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్‌కు ఎస్పీ నివాళి

## కుటుంబానికి ధైర్యం – అన్ని విధాల సహాయం అందించాలని ఆదేశాలు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 29 (ప్రజా జ్యోతి బ్యూరో ): మహబూబ్‌నగర్ టూ టౌన్ పోలీస్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన కానిస్టేబుల్ గోపాల్ సింగ్‌కు జిల్లా ఎస్పీ నివాళులు అర్పించారు.

హన్వాడ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ గోపాల్ సింగ్ (పి.సి. 612) ఈ నెల 26న మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అనంతరం తలకు తీవ్ర గాయం



కావడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్, మలక్‌పేట్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 28న ఆయన మరణించారు. బుధవారం కోయిలకొండ మండలం అమ్రియా నాయక్ తండలో నిర్వహించిన అంత్యక్రియలకు జిల్లా ఎస్పీ దరావత్ జానకి హాజరై పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. 2002 బ్యాచ్‌కు చెందిన గోపాల్ సింగ్ విధి నిర్వహణలో నిబద్ధత, క్రమశిక్షణకు ప్రసిద్ధి చెందిన సిబ్బందిగా గుర్తింపు పొందారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె, కుమారుడు ఇంటర్ చదువుతుండగా, చిన్న కుమార్తె పదవ తరగతి చదువుతోంది. ఈ సందర్భంగా గోపాల్ సింగ్ కుటుంబానికి అవసరమైన అన్ని విధాల సహాయం అందించాలని ఎస్పీ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పరంగా లభించే ప్రయోజనాలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా పోలీస్ శాఖ గోపాల్ సింగ్ సేవలను స్మరించుకుంటూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించింది.

# 10వ తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో జోగులాంబ గద్వాల జిల్లాకు 29వ స్థానం

గద్వాల ఏప్రిల్ 29(ప్రజా జ్యోతి ప్రతినిధి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో



జోగులాంబ గద్వాల జిల్లా 93.93 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో 29వ,స్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 8,037 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.ఇందులో బాలురు 3,548 మంది,బాలికలు 4,001 మంది ఉత్తీర్ణత సాధించారు.బాలికలు 95.49 శాతం ఉత్తీర్ణతతో ముందంజలో ఉండగా,బాలురు 92.23 శాతం ఉత్తీర్ణత సాధించారు.మార్చి 2026లో నిర్వహించిన పదవ తరగతి పరీక్షల ఫలితాలను అభ్యర్థులు నిర్దేశిత వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు.వచ్చే విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలో ముందంజలో నిలిచేలా విద్యాశాఖ అధికారులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# సమర్థ ప్రతిపక్షమే ప్రజా సమస్యలకు పరిష్కారం

## పట్టణ సమస్యలపై బీఆర్ఎస్ కౌన్సిలర్ల చర్చ

వనపర్తి, ఏప్రిల్ 29 (ప్రజాజ్యోతి): సమర్థ ప్రతిపక్షం ఉన్నప్పుడే ప్రజల సమస్యలు సమర్థంగా పరిష్కారమవుతాయని



మాజీ మున్సిపల్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ పేర్కొన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి నివాసంలో ఆయన ఆదేశాల మేరకు బీఆర్ఎస్ కౌన్సిలర్లు, సీపీఎం కౌన్సిలర్‌లతో కలిసి గట్టు యాదవ్ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పట్టణంలో నెలకొన్న ప్రధాన సమస్యలపై విస్తృతంగా చర్చించారు. గురువారం జరగనున్న మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి సంబంధించిన ఎజెండా అంశాలను కౌన్సిలర్లకు వివరించిన గట్టు యాదవ్, పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మురళీ సాగర్, శ్రీకర్ గౌడ్, గంధం మదన్, భారతీ ప్రేమ్ నాథ్ రెడ్డి, ఏర్వ అరుణ శ్రీనివాసులు, స్వాతి హరిబాబు, శంకరమ్మ బాబు నాయక్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, ప్రధాన కార్యదర్శి గంధం పరంజ్యోతి, స్టార్ రహీమ్, మంద రాము, ఎస్. రాము పాల్గొన్నారు.

# మళ్లీ మెరిసిన కొప్పునూర్ హాస్టల్ విద్యార్థులు

## 10వ తరగతిలో 100% విజయం

చిన్నంబావి,ఏప్రిల్ 29 (ప్రజాజ్యోతి): చిన్నంబావి మండల పరిధిలోని కొప్పునూర్ ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్లో ఈ



ఏడాది జరిగిన పదవతరగతి పరీక్షల్లో నూటికి నూరుశాతం మంచి ర్యాంకుతో విజయం సాధించి గత సంవత్సరం రికార్డు నిలబెట్టారు.ఈ సందర్భంగా వసతి గృహ సంక్షేమ అధికారి రవీందర్ రెడ్డి పత్రికా ప్రకటన ద్వారా విద్యార్థులందరికి శుభాకాంక్షలు,అభినందనలు తెలియజేశారు.ఇందుకు కృషి చేసిన ట్యూటర్స్,సంబందించిన పాఠశాల ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు అన్నారు.రాబోయే విద్యాసంవత్సరంలో కొత్తగా చేరాలనుకునే 3 నుంచి 10 వ తరగతి చదివే విద్యార్థుల పేరెంట్స్ ఈ వేసవి సెలవులలోనే తమ పిల్లల కులం,ఆదాయం సర్టిఫికెట్స్ తహసీల్దార్ కార్యాలయం నుంచి తీసుకొని పెట్టుకోవాలి.వాటితో పాటు ఆధార్,,రేషన్ కార్డు జిరాక్స్ ప్రతులు,రెండు పాస్ పోర్ట్ సైజు ఫొటోస్ అవసరం అన్నారు.హాస్టల్లో చేరిన విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన అన్ని వసతులు ఉచితంగా కల్పించబడును.ఇట్టి సదవకాశన్ని విద్యార్థుల తల్లి,తండ్రులందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ప్రవేశ దరఖాస్తులు హాస్టల్లో ఉచితంగా లభిస్తాయని అన్నారు.

# పదవ తరగతి ఫలితాలు స్ఫూర్తిదాయకం : ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

## 17 మండల పరిధిలో 14 మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే టాపర్లు

## 530+ మార్కులతో మెరిసిన విద్యార్థులకు సన్మానం

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 29 (ప్రజా జ్యోతి బ్యూరో ): పదవ తరగతి ఫలితాలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మహబూబ్ నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 530కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఐఐఐటీ లక్ష్యంగా నగరంలో నిర్వహించిన శిబిరంలో పాల్గొన్న 150 మంది విద్యార్థుల్లో 40 మంది 530కు పైగా మార్కులు సాధించడం విశేషమని పేర్కొన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన అందరికీ అభినందనలు తెలియజేశారు. జిల్లాలోని 17 మండలాల్లో 14 మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే టాపర్లుగా నిలవడం గర్వకారణమని అన్నారు. ఈ విజయాల వెనుక గురువుల కృషి, తల్లిదండ్రుల సహకారం, సమాజం భాగస్వామ్యం ఉన్నాయని చెప్పారు. మార్కులు మాత్రమే విజయానికి ప్రమాణం కాదని, లక్ష్యంతో కష్టపడి ముందుకు సాగితేనే నిజమైన విజయం సాధ్యమవుతుందని సూచించారు. "నేను సాధించగలను" అనే ఆత్మవిశ్వాసంతో విద్యార్థులు క్రమశిక్షణతో



చదువుపై దృష్టి పెట్టాలని, వచ్చే 4–5 సంవత్సరాలు చదువుకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. మొబైల్ ఫోన్లు, సినిమాలు వంటి దారి తప్పించే అంశాల నుండి దూరంగా ఉండాలని సూచించారు. జిల్లాలో నిర్వహించిన శిక్షణా శిబిరాలు, కోచింగ్ కార్యక్రమాలు మంచి ఫలితాలు ఇచ్చాయని, అందులో భాగస్వాములైన గురువులు, అధికారులు, సిబ్బందిని అభినందించారు. భవిష్యత్తులో 8వ, 9వ, 10వ తరగతులకు శతశాతం కార్యక్రమాన్ని విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గురుకుల, ప్రభుత్వ పాఠశాలల ద్వారా విద్యార్థులకు సమాన అవకాశాలు



కల్పించేందుకు కృషి చేస్తున్నామని, ప్రతి గ్రామం కలిసి విద్యార్థుల అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. పాఠశాలల్లో కంప్యూటర్ సదుపాయాలు పెంచి, టెక్నాలజీ పరిజ్ఞానం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, నాయకులు వినోద్ కుమార్, సిరాజ్ ఖాద్రీ, గుండా మనోహర్, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో నీటి కొరతకు ముందస్తు చర్యలు తప్పనిసరి

**అధికారులను ఆదేశించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

**టెయిల్ ఎండ్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి**

**గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు**

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 29 (ప్రజా జ్యోతి బ్యూరో): వచ్చే మే నెలలో ఎండలు తీవ్రరూపం దాల్చనున్న నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా



ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు.

బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన జిల్లా వాటర్ అండ్ శానిటేషన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకుంటూ తరచూ సమావేశాలు నిర్వహించి నీటి సరఫరా సమస్యలను ముందుగానే గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎండాకాలంలో తాగునీటి కొరత తలెత్తకుండా అందుబాటులో ఉన్న అన్ని నీటి వనరులను పర్యవేక్షిస్తూ నిరంతర సరఫరా ఉండేలా చూడాలని చెప్పారు. మిషన్ భగీరథ ద్వారా సరఫరా ఉన్నప్పటికీ టెయిల్ ఎండ్ గ్రామాలు, ఎత్తైన ప్రాంతాల తండాలు, హాబిటేషన్లలో నీటి సమస్యలు ఉన్నట్లు గుర్తించామని, అటువంటి ప్రాంతాల్లో అవసరమైతే కొత్త బోర్లు తవ్వడం, పనిచేయని బోర్లను మరమ్మతు చేయడం, ఫ్లషింగ్ చేయడం వంటి చర్యలు తక్షణమే చేపట్టాలని సూచించారు.

నీటి వనరులు లేని ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని, గత సంవత్సరం సమస్యలు ఎదుర్కొన్న గ్రామాలను గుర్తించి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కొత్త బోర్లకు అనుమతులు అత్యవసర అవసరాలున్న ప్రాంతాలకు మాత్రమే ఇవ్వబడతాయని స్పష్టం చేశారు.

సమావేశానికి గైర్హాజరైన అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన ప్రాంతాలను ప్రత్యక్షంగా సందర్శించి స్థానిక అధికారులతో సమన్వయం పెంచాలని, తాగునీటి సమస్యలు తలెత్తే ప్రాంతాలను ముందుగానే గుర్తించి చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి అంతరాయం లేకుండా తాగునీటి సరఫరా కొనసాగేందుకు సమగ్ర ప్రణాళికతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జడ్పీ సీఈఓ ఇన్చార్జి డీపీఓ వెంకటరెడ్డి, డీఆర్డీఓ నర్సింహులు, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్, మిషన్ భగీరథ ఇన్‌ట్రా ఈఈ జయాబాయి, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# చుక్కయపల్లి మూడో వార్డులో సీసీ రోడ్లు వేశారు

## రోడ్డుకి ఇరువైపులా మట్టి వేయడం మరిచారు

కొల్లాపూర్ ఏప్రిల్ 29 ప్రజా జ్యోతి: చుక్కయపల్లి గ్రామ మూడో వార్డులో కొల్లాపూర్



నియోజక వర్గ ఎమ్మెల్యే మంత్రి జూపల్లి కృష్ణారావు సిసి రోడ్ల నిర్మాణం కోసం మరియు డ్రైనేజ్ నిర్మాణం కోసం.టి యు ఎఫ్ ఐ డి సి నిధుల ద్వారా 40 లక్షల రూపాయలు 2024 లో శాంక్షన్ చేయడం జరిగింది . అయితే వాస్తవికంగా వర్కు పట్టుకున్న కాంట్రాక్టర్ కేవలం సిసి రోడ్లు వేశాడు కానీ అది కూడా తాత్కాలికంగా కొన్ని కొన్ని చోట్ల సీసీ వేయడం మరిచాడు. ఇదిలా ఉంటే డ్రైనేజీకి శాంక్షన్ అయిన డబ్బులు ఇంతవరకు డ్రైనేజీ నిర్మాణం చేయకుండా నిర్లక్ష్యం వహించడం, అంతే కాకుండా సీసీ రోడ్లు వేసి రోడ్లకు ఇరువైపులా మట్టి వేయడం మరిచారు. సదరు కాంట్రాక్టర్ పెంట్లవెల్లి మండలానికి చెందిన కబీర్ అనే వ్యక్తి ఎందుకంటే అకాల వర్షాలకు ఒక నెల తర్వాత వర్షాకాల ప్రభావం ఉంది కాబట్టి రోడ్డుకు ఇరువైపులా మట్టి వేయనందుకు గుంతల మయంగా ఉండి అక్కడ వర్షపు నీరు నిలువ ఉండడంతో ఇండ్లు పూర్తిగా దెబ్బతింటాయని తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షులు డీకే మాదిగ వివరణ గ్రామ ప్రజలు అందించిన సమాచారం మేరకు, సదరు కాంట్రాక్టర్ ని వెంటనే రోడ్డుకు ఇరువైపులా మట్టి వేయించాలని కాలనీ ప్రజల తరపున



కాంట్రాక్టర్ కు కు తెలిపారు.

కేవలం సీసీ రోడ్లు కూడా తాత్కాలిక నిర్మాణం చేసి డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా నిర్మాణం చేయకుండా ఆపడం సరైన పద్ధతి కాదని డీకే మాదిగ కాంట్రాక్టర్లు డిమాండ్ చేశారు. ఏదీ ఏమైనా తక్షణమే కాంట్రాక్టర్ స్పందించి రోడ్డుకు ఇరువైపుల మట్టిని వెంటనే వేయించాలని కాలనీ ప్రజల తరపున కోరారు. లేనియెడల గ్రామ యువకుల సమక్షంలో ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షులు డీకే మాదిగ సదర్ కాంట్రాక్టర్ కబీర్కి వినయపూర్వకంగా విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా మంత్రి వెంటనే ఈ విషయంపై స్పందించి కాంట్రాక్టర్తో మాట్లాడి మట్టి వేయించాలని గ్రామ ప్రజలు కోరడమైనది అదేవిధంగా కొన్నిచోట్ల నిలిచిపోయిన సీసీ రోడ్లను సంపూర్ణంగా నిర్మించాలని కాలనీ ప్రజలు మంత్రిని కోరారు. అదేవిధంగా డ్రైనేజీ వ్యవస్థను వర్షాకాల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని వెంటనే డ్రైనేజీలు ప్రారంభించాలని మంత్రి కి డీకే మాదిగ విజ్ఞప్తి చేశారు.

# జిల్లా టాపర్‌తో న్యూ రిషి స్కూల్ ప్రభంజనం

## 594 మార్కులతో కార్తికేయ రెడ్డి అగ్రస్థానం

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 29 ( ప్రజా జ్యోతి బ్యూరో ): మహబూబ్‌నగర్ పట్టణంలోని న్యూ రిషి స్కూల్ పదవ తరగతి ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో గుర్తింపు పొందింది. ఈ ఏడాది ఎస్సెస్సీ పరీక్షల్లో పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధిస్తూ సత్తా చాటారు. పాఠశాలకు చెందిన బి. కార్తికేయ రెడ్డి 600



మార్కులకు గాను 594 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచి పాఠశాలకు కీర్తి తీసుకువచ్చాడు. వి. సాయికత్ 586 మార్కులు, జి. దివ్య శ్రీ 582 మార్కులు, చే. జేష్వంత్ మరియు ఎస్. సాయి కీర్తన తలా 580 మార్కులు సాధించి ప్రతిభను చాటారు. ఇతర విద్యార్థుల్లో జె. శ్రీనిధి (580), కె. అజయ్ వరధన్ రెడ్డి (576), ఎం. నవ్య శ్రీ (575), జె.కె. సౌజన (574), ఎస్. అంజనేయులు (573) మార్కులు సాధించి మంచి ఫలితాలు నమోదు చేశారు. ఈ విజయంపై పాఠశాల యాజమాన్యం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వమే ఈ విజయానికి కారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధిస్తూ మరింత ప్రతిభ కనబరచాలని పాఠశాల యాజమాన్యం ఆకాంక్షించింది.

# శాలెం ఎంబి చర్చిలో మల్టీ పర్పస్ షెడ్‌కు శంకుస్థాపన

## రూ.10 లక్షల ముడా నిధులతో నిర్మాణం పనులకు శంకుస్థాపన

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 29 (ప్రజా జ్యోతి బ్యూరో): మహబూబ్‌నగర్ నగరంలోని న్యూ ప్రేమ్ నగర్‌లోని శాలెం ఎంబి చర్చిలో మల్టీ పర్పస్ షెడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం



జరిగింది. ముడా నిధులు రూ.10 లక్షలతో చేపట్టనున్న ఈ నిర్మాణానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, షెడ్ నిర్మాణం పూర్తయిన తర్వాత చర్చికి వచ్చే భక్తులకు ఇది ఎంతో ఉపయోగకరంగా మారుతుందని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, నగర మేయర్ గుమ్మాల మమత, నాయకులు వినోద్ కుమార్, సిరాజ్ ఖాద్రీ, కార్పొరేటర్ వాణిశ్రీ ప్రశాంత్, సామ్యుల్ దాసరి, ఫాస్టర్ వరప్రసాద్, యేసు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

అచ్చంపేట ఏప్రిల్ 29, ప్రజా జ్యోతి

లింగాల మండల కేంద్రంలో ఆయా కాలనీలో ఉన్న రోడ్లపై ప్రజలు చెత్తాచెదారాన్ని వేయకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉందని లింగాల సర్పంచ్ ఈశ్వరమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్లపై చెత్తాచెదారా అని వేసిన వ్యక్తులకు శాఖపరమైన చర్యలను తీసుకుంటూ, ఆ వ్యక్తికి ఐదు వేల రూపాయల జరిమానా విధించడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఆయా కాలనీలో చెత్త వ్యక్తులపై సమాచారాన్ని తమకు అందిస్తే వారికి కూడా వెయ్యి రూపాయల అందించడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఇంటి పరిసరాల్లో చెత్తాచెదారం వెయ్యకుండా మురుగునీరు నిలువ లేకుండా తగు జాగ్రత్తలను తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. డ్రైనేజీ కాల్వల్లో కూడా చెత్తాచెదారం వెయ్యకుండా, గ్రామపంచాయతీ సిబ్బంది తమ కాలనీలోకి ట్రాక్టర్ను తీసుకువచ్చినప్పుడు అందులో చెత్తను వేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

## ధాన్యం కొనుగోలు, తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ

**అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశం**



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 29, (ప్రజా జ్యోతి) :** ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, వేసవిలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. భీమదేవరపల్లి ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జిల్లా, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యాన్ని సమీప మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని, రహదారుల పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. అలాగే ఆయిల్ పామ్ సాగు విస్తరణ, ఉపాధి హామీ పనులు, సాగునీటి కాలువల పునరుద్ధరణ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపు, గ్రామాల్లో వైద్య శిబిరాల నిర్వహణపై అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, ఎల్కతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ సంతాజీ, జడ్పీ సీఈవో శేషాద్రి, డీఆర్డీవో మేన శ్రీను, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, జిల్లా ఉద్యాన అధికారి అనసూయ, డీఈవో గిరిరాజ్ గౌడ్, ఆర్ అండ్ బీ ఈఈ సురేష్ బాబు, ఎంపీడీవో వీరేశం, తహసీల్దార్ రాజేష్, ఇతర అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ సౌత్ ఇండియా వైస్ చైర్మన్‌గా తాటికొండ లక్ష్మీనారాయణ



**దామెర, ఏప్రిల్ 29 (ప్రజాజ్యోతి) :** హనుమకొండ జిల్లా దామెర మండలం ఒగ్లాపూర్ గ్రామానికి చెందిన తాటికొండ లక్ష్మీనారాయణ హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ సౌత్ ఇండియా వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. లక్ష్మీనారాయణ ప్రస్తుతం రిటైర్డ్ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ ఇతను డ్యూటీలో ఉండగా నీతి, నిజాయితీ, నిబద్ధతగా, మంచి మనసున్న ఆఫీసరుగా పోలీస్ డిపార్ట్మెంట్లో సేవలు అందించినారు. వీరి యొక్క సేవలను గుర్తించిన హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు అయిన తర్మంగి మత్స్యరాజు బుధవారం నాడు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. వీరికి కృతజ్ఞతలు మరియు నా యొక్క పదవికి సహకరించిన నేషనల్ బోర్డ్ డైరెక్టర్ రావులపల్లి తిరుపతయ్య మరియుటీజి స్టేట్ చైర్మన్ నన్నపు సంజీవరావు లకు కృతజ్ఞతలు తెలిపారు.

## యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**– సీఐ సంతోష్**



**ఆత్మకూరు, ఏప్రిల్ 29 (ప్రజాజ్యోతి) :** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలనీ ఆత్మకూరు సీఐ సంతోష్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో భాగంగా మాలిక ద్రవ్యాల మత్తు యువత భవిత చిత్తు కార్యక్రమంలో భాగంగా సిఐ ఆర్ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో స్థానికంగా మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు సిఐ ఆర్ సంతోష్ యువతకు అవగాహన కల్పించి, యువతతో ప్రతిజ్ఞ చేయించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉందాం జీవితాన్ని కాపాడుకుందాం అంటూ మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వాడకం వల్ల ఆరోగ్యం చెడిపోవడమే కాకుండా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. మీ పరిసరాల్లో ఎవరైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నా, సేవిస్తున్నా వెంటనే మాకు సమాచారం ఇవ్వండి అని సీఐ ఆర్ సంతోష్ పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అధికారులు హామీ ఇచ్చారు. యువతకు వాలీబాల్, వాలీబాల్ నెట్ అందించి యువతతో కాసేపు క్రీడలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్, తిరుపతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ములుగు జిల్లా ప్రథమ స్థానం

- అగ్రస్థానంలో నిలవడం పట్ల మంత్రి సీతక్క హర్షం
- జిల్లా యంత్రాంగానికి, విద్యాశాఖ అధికారులకు, టీచర్లకు విద్యార్థులకు అభినందనలు తెలిపిన మంత్రి సీతక్క



**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి) :** పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ములుగు జిల్లా రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా 99.30శాతం ఉత్తీర్ణత ప్రథమ స్థానంలో నిలిచింది. పదవ తరగతి ఫలితాల్లో ములుగు జిల్లా రాష్ట్ర వ్యాప్తంగా ప్రథమ స్థానంలో నిలవడం పట్ల పంచాయతీ రాజ్,గ్రామీణ అభివృద్ధి,స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ సీతక్క హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు కష్టపడి చదివి అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులకు, వారికి మార్గనిర్దేశం చేసిన గురువులకు,అలాగే పర్యవేక్షణలో కీలక పాత్ర పోషించిన జిల్లాయంత్రాంగం, విద్యాశాఖ అధికారులకు మంత్రి సీతక్క అభినందనలు తెలిపారు. ములుగు జిల్లా 99.30 శాతం ఉత్తీర్ణత సాధించడం గర్వకారణమని అన్నారు. ఇది జిల్లా స్థాయిలో సమన్వయంతో చేసిన కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పదవ తరగతి పరీక్షల్లో మొత్తం ఉత్తీర్ణత శాతం 95.15 శాతంగా నమోదు కావడం సంతోషకరమని తెలిపారు. బాలికలు 96.26 శాతం ఉత్తీర్ణతతో ముందంజలో ఉండగా,బాలురు 94.07 శాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని అన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా 5731 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించడం విద్యా ప్రమాణాలు మెరుగు పడుతున్నాయని సూచిస్తోందని మంత్రి సీతక్క అభిప్రాయపడ్డారు. సంక్షేమ పాఠశాలల్లో 99.10 శాతం ఉత్తీర్ణత నమోదవడం ప్రభుత్వ పథకాల ఫలితమని మంత్రి తెలిపారు. పేద,వెనుక బడిన వర్గాల పిల్లలకు అందుతున్న నాణ్యమైన విద్య వల్లే పదవ తరగతి ఈ స్థాయి ఫలితాలు సాధ్యం అయ్యాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో సైతం విద్యార్థులు మరింత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని,ప్రభుత్వం విద్యా రంగం అభివృద్ధికి కట్టుబడి ఉందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

# రైతుల్ని దగా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

**మాజీ చల్లా ధర్మారెడ్డి**







**పరకాల, ఏప్రిల్ 29, (ప్రజాజ్యోతి) :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల జీవితాలతో ప్రమాదకరంగా చెలగాటమాడుతోందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బుధవారం పరకాల వ్యవసాయ మార్కెట్‌లోని మక్కల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన, రైతుల దుస్థితిని చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్ కేంద్రంలో కాంటాలు లేకపోవడం, గన్నీ సంచులు అందకపోవడం, కొనుగోళ్లు పూర్తిగా నిలిచిపోవడంతో పంటను కల్లాల్లో వేసి రోజుల తరబడి కాపలా కాయాల్సిన దుస్థితి నెలకొన్నదని రైతులు వాపోయారు. "పంట పండించేది రైతు... లాభం మాత్రం దళారులకే" అన్న పరిస్థితిని ఈ ప్రభుత్వం మరింతగా పెంచిందని ధర్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో రైతును రాజుగా గౌరవిస్తే, ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి పాలనలో రైతు బానిస స్థాయికి దిగజారిపోయాడని తీవ్ర విమర్శలు చేశారు. "రైతు భరోసా ఎక్కడ? రైతు బీమా ఎవరికి అందుతోంది? పంట కొనుగోళ్లు ఎందుకు నిలిచిపోయాయి?" అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. వ్యవసాయ రంగంపై పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న ప్రభుత్వం, రైతుల కష్టాలను పట్టించుకోకుండా కేవలం ప్రచార రాజకీయాలకు పరిమితమైందని విమర్శించారు. యూరియా కొరత, సాగునీటి సమస్య, కరెంట్ కోతలు అన్ని కలిపి రైతును తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని అన్నారు. "ఇది ప్రభుత్వం కాదు... రైతులపై భారంగా మారిన వ్యవస్థ" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ చుట్టూ తిరుగడంలో బిజీగా ఉన్న సీఎం, రైతుల కన్నీళ్లు కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా మక్కల కొనుగోలు కేంద్రాలను అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసి వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో ఆందోళనలు చేపట్టి ప్రభుత్వానికి గట్టి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కుక్క కాటుకు గురైన వారిని పరామర్శించిన వార్డ్ కౌన్సిలర్ వేముల సంధ్య సాంబయ్య గౌడ్



**నర్సంపేట ఏప్రిల్ 29 (ప్రజా జ్యోతి) :** 10 లక్షల రూపాయలతో రెండు ఆర్ఓఆర్ వాటర్ ప్లాంట్లకు సాంక్షన్ వారం రోజుల్లో ఆసుపత్రిలో త్రాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయడం జరుగుతుందని వార్డు కౌన్సిలర్ వేముల సంధ్య సాంబయ్య గౌడ్ అన్నారు. నర్సంపేట పట్టణంలోని 29వ డివిజన్‌తో పాటు వివిధ డివిజన్లకు చెందిన 16 మందిని కుక్క కరవడంతో వారికి గాయాలు కావడం వల్ల నర్సంపేట జిల్లా ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఒకరికి తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రిలో ఉన్న సుందరగిరి పుష్పనీలా ను కౌన్సిలర్ వేముల సంధ్య మాజీ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించి సమస్యను అడిగి తెలుసుకున్నారు అనంతరం ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ బి కిషన్ ను పిలిపించి వారి పరిస్థితిని తెలియజేసి మెరుగైన వైద్యం అందించాలని తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ కుక్కకాటుకు గురైన 16 మంది రాగానే వారికి కావాల్సిన టీకాలు వ్యాక్సిన్ నాలుగు రకాలుగా అందించడం జరిగిం దని 15 మందిని ఇంటికి పంపించామని ఒక పేషెంట్‌కు మాత్రం తీవ్రమైన గాయాలు కావడంతో అబ్జర్వేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నామని తెలియజేశారు. అనంతరం తాగునీటి సమస్యపై మాట్లాడుతూ పది లక్షల రూపాయల ఆర్ఓఆర్ ప్లాంట్ సాంక్షన్ అయిందని వారం రోజుల్లోపు ఆసుపత్రికి వచ్చే ప్రజలకు రోగులకు నాణ్యమైన త్రాగునీరు అందించడానికి చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాంపల్లి వెంకటేశ్వర్లు గౌడ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దండెం రతన్ కుమార్, ఎన్ ఎస్ యు ఐ అద్యక్షులు కటారి ఉత్తంకుమార్ పట్టణ కమిటీ సభ్యులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ 29వ డివిజన్ యూత్ నాయకులు జిజుల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## 34 డివిజన్‌లో పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలి

- అండర్ డక్ట్ వలన ఇళ్ళు కోల్పోయిన వారికి డబుల్ బెడ్రూమ్ మంజూరు చేయాలి
- పలు కమ్యూనిటీ హాళ్ళ నిర్మాణం చేపట్టాలి
- అండర్ బ్రిడ్జి నుండి రైల్వే స్టేషన్ వరకు సిసి రోడ్డును పూర్తి చేయాలి
- స్థానిక కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి





**వరంగల్ ఏప్రిల్ 29 ప్రజా జ్యోతి :** వరంగల్ మహా నగర పాలక సంస్థ (GWMC) పరిధిలోని 34వ డివిజన్ శివనగర్ అభివృద్ధి పనులకు సంబంధించి ప్రస్తుతం పలు అంశాలు చర్చనీయాంశంగా ఉన్నాయి. స్థానిక కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి మాట్లాడుతూ స్వర్ణ ఎలక్ట్రికల్స్ కాంట్రాక్టర్ 90 లక్షల రూపాయలతో పెండింగ్ పనులు పూర్తి చేయాలి, MIH కాంట్రాక్టర్ స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులలో భాగంగా 50 లక్షల రూపాయలతో బాక్స్ డ్రైనేజీ పనులు పూర్తి చేయాలి,కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒక్కొక్క డివిజన్ కు 30 లక్షల రూపాయల చొప్పున కేటాయించారు కేటాయించిన 30 లక్షల రూపాయలతో కాంట్రాక్టర్ గోవిందుల రమేశ్ కొంత పని మాత్రమే చేశారు మిగతా పనులు పూర్తి చేయాలి అలాగే 50 లక్షల రూపాయలు ప్రతి డివిజన్‌కు ఇవ్వడం జరిగినది ఇచ్చిన 50 లక్షల రూపాయలు ఇంతవరకు కాంట్రాక్టర్ ఎవరు అనేది ఇంతవరకు చెప్పలేదు దీనిపై కూడా వివరణ ఇవ్వాలిశివనగర్ అండర్ బ్రిడ్జి రోడ్డు నుండి రైల్వే స్టేషన్ వరకు సిసి రోడ్డును పూర్తి చేయాలి, శివనగర్ బాక్స్ డ్రైనేజ్ నిర్మాణంలో భాగంగా తొమ్మిది మంది ఇల్లులు కూలిపోవడం జరిగినది. 1.మచ్చ సుమలత, 2.పొడిశెట్టి రజిత, 3.పొడిశెట్టి రాణి, 4.పొడిశెట్టి కొమురమ్మ, 5.ఎడ్ల సుమలత, 6.ఎండి షహనాజ్, 7.అశ్విని, 8.వేంగల వెంకటేశ్వర్లు, (కవిరాజు, వేణు) 9.ఎస్ కే నజీర్, 1నుండి 7 వరకు ఉన్న క్రమసశీక్య వరకు అం దుబాటులో ఉండి మాకు నష్టం జరిగింది అని అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వంలో వున్న ఎంఎల్ఏ, మరియు జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్, దృష్టికి తీసుకపోవడం జరిగింది, నష్టపరిహారం కింద పైన ఎడుగురికీ క్రింద డబుల్ బెడ్ రూమ్ మంజూరు చేయడం జరిగి నది, పైన ఉన్న క్రమసశీక్య 8.కవిరాజు కార్పొరే టర్ దిడ్డి కుమారస్వామి పై కేసు వేయడం జరిగినది అప్పటి కమిషనర్ కి నోటీస్ పంపడం జరిగినది కావున జిల్లా మంత్రి, మరియు కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ అండర్ డక్ట్ వలన ఇళ్ళు కోల్పోయిన వారికి డబుల్ బెడ్ రూమ్‌లు మంజూరు చేసేటప్పుడు వీరికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నాను ఇట్టి కార్యక్రమం లో స్థానిక బిఆర్ఎస్ నాయకులు బిల్లా రాజు, పోలేపాక రాజు, కలకొండ అభినాష్, గోగుల ఇందిరా, సామల సుకన్య, పురుషోత్తం, సల్లకుమార్, కోడెం ప్రతాప్,ఇట్టబోయిన సంతోష్, ఇట్టబోయిన గణేశ్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన

# ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ





**నర్సంపేట ఏప్రిల్ 29(ప్రజాజ్యోతి) :** ఐ సి డి ఎస్ ,మెప్మా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నర్సంపేట మున్సిపల్ పరిధిలోని మెప్మా కార్యాలయంలో సీడీపీఓ మధురిమ అధ్యక్షతన సైబర్ క్రైమ్,బాలల రక్షణ,యువతను మాదక ద్రవ్యాల భారీ నుండి రక్షించేందుకు,యాంటీ డ్రగ్స్ నిర్మూలనకై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక పరిజ్ఞానం కోసం వాడే సెల్ ఫోన్లు సైబర్ క్రైమ్ లకు దారితీస్తున్నాయని ప్రతి తల్లిదండ్రులు వీటిపై ఎప్పటికప్పుడు అవగాహనతో ఉండి అప్రమత్తంగా ఉండాలని,పిల్లల ప్రవర్తన పట్ల ఎలాంటి మార్పు కనిపించినా వెంటనే స్పందించి పిల్లలకి అవగాహన కల్పించాలని తెలిపారు. షీ టీం,సైబర్ క్రైమ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి,కెరీర్ పై దృష్టి పెట్టాలని,మాదకద్రవ్యాలకు బానిసలైతే భవిష్యత్తు నాశనమవుతుందని తెలిపారు. గంజాయి లేదా డ్రగ్స్ విక్రయాలు,రవాణా గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మించడం కేవలం ప్రభుత్వం లేదా పోలీసుల బాధ్యత మాత్రమే కాదని,ప్రతి పౌరుడు ఇందులో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కాటన్ భాస్కర్ ఆధునిక టెక్నాలజీలో మంచిని మాత్రమే స్వీకరించాలని..చెడు వ్యసనాల వైపు దారి మళ్లొద్దని వేసవి సెలవులను విద్యార్థులు కంప్యూటర్ శిక్షణ కోసం శరీర దారుఢ్యం కోసం వినియోగించుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా సీఐ ముష్కే శ్రీనివాస మాట్లాడుతూ పిల్లలు తప్పు చేస్తున్నప్పుడు ఒంటరిగా ఉండడానికి ప్రయత్నం చేస్తారని,వారి ప్రవర్తనలో కూడా మార్పులు వస్తాయని వాటిని తల్లిదండ్రులు గమనించాలని సూచించారు. డ్రగ్స్ కు అలవాటు అయ్యే ముందు సిగరెట్లకు అలవాటు పడతారని,సిగరెట్టు అలవాటు ఉంది అనగానే తల్లిదండ్రులు అప్రమత్తం కావాలని తెలిపారు. సైబర్ క్రైమ్ అనేది ఏ రూపంలో నుండి వస్తుందో తెలియదు కావున వాటిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. సైబర్ క్రైమ్ వలన ఫోన్లలో డబ్బులు పోయినట్లయితే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ 1930 నంబర్ కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అంగన్వాడీ రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతి మాట్లాడుతూ సైబర్ క్రైమ్,డ్రగ్స్,బాలల రక్షణ సంబంధించిన అవగాహన కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకు వెళ్లే విధంగా మహిళా సంఘా లతో కలిసి అవగాహన ర్యాలీలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్సై గూడ అరుణ్ కుమార్,ఐసీడ్స్ సూపర్వైజర్ అరుణ, షీ టీం నాగభవ్య, డాక్టర్.శ్రావణ్, కౌన్సిలర్స్ శ్రీ రామోజు రోజా రాణి, పొన్నాల మనీషా, వేల్పుల శ్రీలత, ఐసీడ్స్ సూపర్వైజర్ అరుణ, అంగన్వాడి యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి,షీ టీం నుండి నాగభవ్య, మెప్మా సిఎల్ఆర్పి సుమలత, కంప్యూటర్ ఆపరేటర్ సతీష్, అంగన్వాడి ప్రాజెక్టు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గొర్రె రాధ, బత్తిని శిరీష, ఆర్‌పిలు, అంగన్వాడీ టీచర్స్, ఆశా కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

## ఈషా మన్వితకు ప్రథమ బహుమతి..



**పరకాల, ఏప్రిల్ 29, (ప్రజాజ్యోతి) :** పరకాల పట్టణం లోని అంగడి మైదానంలో హిందూ ధర్మ సమ్మేళనం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా "హిందూ సంస్కృతి భారతీయ జీవన విధానం"పై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు ఎస్సే రైటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పట్టణంలోని ఎస్ ఆర్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని శ్రీరామోజు ఈషా మన్విత ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆమెను అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, సుమారు 20మంది విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## 100 శాతం ఉత్తీర్ణతతో సత్తా చాటిన ఎంజేపి బాలికలు







**ఆత్మకూరు, ఏప్రిల్ 29 (ప్రజాజ్యోతి):** హన్మకొండ జిల్లాలోని ఆత్మకూరు మండలంలో గల మహాత్మా జ్యోతి బా పూలే పెద్దాపూర్ బాలికల పాఠశాల విద్యార్థులు చదువులో వారి సత్తాను చాటుకున్నారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా విడుదల చేసిన పదవ తరగతి ఫలితాలలో 100 శాతం మార్కులు సాధించి ఇటు పాఠశాలకు అటు తల్లిదండ్రులకు గొప్ప పేరు తెచ్చారు. అత్యధిక మార్కులతో ప్రథమ స్థానంలో అల్లే హరిత 571/600, ద్వితీయ స్థానంలో బత్తిని జ్యోత్స్న 568/600, తృతీయ స్థానంలో సాయి వైష్ణిక 566/600 మార్కులతో ముందంజలో ఉన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అనిత మరియు ఉపాధ్యాయునులు విద్యార్థులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

## ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు రావద్దు కొనుగోలు, రవాణా వేగవంతంగా జరగాలి

**– జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**జనగామ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 29 (ప్రజాజ్యోతి) :** ధాన్యం కొనుగోలు ప్రక్రియలో అధికారులు, నిర్వాహకులు బాధ్యతయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. రఘునాథ్ పల్లి మండలం కోమల్ల గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి ఆలస్యం లేకుండా టోకెన్ పద్ధతి ద్వారా వచ్చిన దాన్యాన్ని ఏ రోజూ కారోజు తేమ శాతం రాగానే కొనుగోలు జరగాలన్నారు. ఆ వెంటనే ట్యాగ్ చేసిన మిల్లులకు తరలించాలన్నారు. ఏమైన సమస్య వస్తే తమ దృష్టికి వెంటనే తీసుకరావాలని, రైతులకు ఇబ్బంది కలిగేంత వరకు చూడకూడదన్నారు. వేసవి ఎండల నేపథ్యంలో నిర్వాహకులు, రైతులు తప్పకుండ జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## ప్రతీ బంక్‌ని పర్యవేక్షించండి

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 29 (ప్రజాజ్యోతి) :** డీజిల్, పెట్రోల్ సరఫరా పైన అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ప్రజలు ఆందోళన చెందవద్దని కలెక్టర్ జిల్లా కలెక్టర్ సందీప్ కూమర్ ఝా అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హల్ లో జిల్లాలో పెట్రోలు, డీజిల్ సరఫరాపై పెట్రోలియం సంస్థల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో ఎనర్జీ కమిటీ సమన్వయ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో వివిధ పెట్రోలియం సంస్థలలో ఉన్న పెట్రోలు, డీజిల్ నిల్వల గురించిన వివరాలను అధికారులను, ఆయా సంస్థల ప్రతినిధులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తహసీల్దార్, పోలీస్, లీగల్ మెట్రాలాజి అధికారులు నిరంతరం ప్రతీ బంక్ ని తనిఖీ చేసి ఇందన నిల్వలను పరిశీలించాలన్నారు. జిల్లాలో పెట్రోలు, డీజిల్ కృతిమ కొరత సృష్టించకూడదని బాటిళ్లు, క్యాన్లలో పోయడం ద్వారా వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. పెట్రోల్ బంకుల్లో క్యూలో ఉన్న వాహనదారులకు పెట్రోల్, డీజిల్ పోయాలని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా పెట్రోలియం సంస్థల ప్రతినిధులు కూడా ఏ రోజుకు ఆరోజు ఇండెంట్ ప్రకారంగా ఇందనం సరఫరా అయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బెన్ షాలోం, ఆర్డీవో లు గోపీరామ్, వెంకన్న, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, సివిల్ సప్లై డి ఏం హతీ రామ్, లీగల్ మెట్రాలాజి అధికారి ఝాన్సీ, జిల్లా వైద్య శాఖ అధికారి మల్లికార్జున రావు, వివిధ సంక్షేమ శాఖల అధికారులు, పెట్రోలియం సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఉద్యమాల యోధుడు ఆదిరెడ్డికి ఘన నివాళి

మునగాల, ఏప్రిల్ 29 (ప్రజా జ్యోతి):
మునగాల మండలం నరసింహుల గూడెం గ్రామంలో ముదిరెడ్డి ఆదిరెడ్డి 29వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మునగాల మండల సిపిఎం పార్టీ కార్యదర్శి బుర్రి శ్రీరాములు హాజరై ఆయనకు పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరుల వారసుడిగా ఆదిరెడ్డి గారు మునగాల పరగణాలో



దళితులు, పేదలకు భూములు పంచి ప్రజా ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మహనీయుడని తెలిపారు. వ్యవసాయ కార్మికులు, పేద ప్రజల కోసం ఎర్రజెండా నాయకత్వంలో నిరంతరం కృషి చేసిన ఆయనను అరాచక శక్తులు కిరాతకంగా హత్య చేయడం తీవ్రంగా ఖండనీయమన్నారు. అరాచక శక్తులను, కిరాయి అంతకులను ఎదిరిస్తూ మునగాల పరగణ ప్రజలు, ముఖ్యంగా నరసింహుల గూడెం గ్రామ ప్రజలు ఆదిరెడ్డి గారి ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. మానవాళి మనుగడ ఉన్నంత వరకు ఆదిరెడ్డి గారు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు జూలకంటి విజయలక్ష్మి , మండల కమిటీ సభ్యులు జూలకంటి కొండారెడ్డి, సోమపంగు నర్సయ్య, సర్పంచ్ కుంచం ఇందిరా నర్సయ్య, ఉప సర్పంచ్ సీతారాములు, శాఖ కార్యదర్శులు వెంకటరెడ్డి, శేఖర్, స్వరూప, రమేష్, కాస్మల్లి పర్వీన్, రాములమ్మ, గణేష్, ఆదిరెడ్డి గారి సతీమణి చంద్రకళ, పి. అబ్రహం తదితరులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పది ఫలితాలలో ఆదర్శం..

నిడమనూరు, ఏప్రిల్ 29(ప్రజాజ్యోతి):
నిడమనూరు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు



బుధవారం ప్రకటించిన 10వ తరగతి ఫలితాలలో 100%(71/71) బి.నవ్య -553,కే.ప్రశాంతి -539 ,కే.చిన్నమయిశ్రీ -538 కే.వెంకట్ -534,స్మృతి -525లు సాధించారు. అదేవిధంగా ఆదర్శ మోడల్ స్కూల్ లో పది ఫలితాలల్లో సారి 100శాతం ఫలితాలు సాధించారు. అదేవిధంగా నాలుగు సార్లు వరుసగా 100%శాతం ఉత్తీర్ణతతో పాటు విధ్యార్థులు 100%శాతం ఫలితాలు సాధించారు. అదేవిధంగా 71మంది విధ్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మల తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మిర్యాలగూడ డివిజన్ లోని మోడల్ స్కూళ్ళలో కేవలం నిడమనూరు మోడల్ స్కూల్ విద్యార్థి మాత్రమే బి.నవ్య -553, సాధించారని ప్రిన్సిపాల్ నిర్మల పేర్కొన్నారు. అనంతరం బి.నవ్యను, విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

# పనకబండ గ్రామానికి లైన్ మెన్ ను నియమించాలి

మోత్కూరు, ఏప్రిల్ 29 )ప్రజా జ్యోతి):



మోత్కూరు మండలంలోని పనకబండ గ్రామానికి లైన్ మెన్ ను నియమించాలని ఆ గ్రామ ఉప సర్పంచ్ రాదారపు మల్లేశం ట్రాన్స్కో అధికారులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లైన్మెన్ లేకపోవడంతో గత ఆరు నెలల నుండి గ్రామంలో రైతులు చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారని తెలిపారు. రాబోయే వర్షాకాలంలో గాలి వానలకు ట్రాన్స్ఫార్మర్లు కాలిపోవడం, విద్యుత్ లైన్లు తెగిపోయే అవకాశాలు ఉన్నాయని అన్నారు. తమ గ్రామానికి లైన్మెన్ నియమిస్తే సమస్యలను త్వరితగతిన పరిష్కరించే అవకాశం ఉందన్నారు. ఇట్టి విషయమై గతంలో కూడా ట్రాన్స్కో అధికారులకు వినతిపత్రం అందించడం జరిగిందని తెలిపారు. ఇప్పటికైనా పలకబండ గ్రామానికి లైన్మెన్ నియమించి తమ గ్రామస్తుల విద్యుత్తు సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు.

# బెల్లి లలిత ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

మోత్కూరు, ఏప్రిల్ 29 (ప్రజా జ్యోతి):
తెలంగాణ గాన కోకిల, మలిదశ ఉద్యమ నాయకురాలు, బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి బెల్లి లలిత ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ



కృషి చేయాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ పిలుపుని చ్చారు. బుధవారం బెల్లి లలిత 52వ జయంతి సందర్భంగా మోత్కూరులో ఆమె చిత్ర పటానికి బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ స్వరాష్ట్ర తెలంగాణ రాష్ట్ర సాధన కోసం లలిత తన కళా రూపాలతో ప్రజలను చైతన్య పరిచిందన్నారు.1996లో భువనగిరి కేంద్రంగా దగా పడ్డ తెలంగాణ బహిరంగసభ పెట్టి గల్లి నుంచి ఢిల్లీ వరకు తెలంగాణ ఆకాంక్షను వినిపించిన బహుజన బిడ్డ బెల్లి లలిత అని ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి జిల్లా నాయకులు కలిమెల నర్సయ్య, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నోముల రమేష్ నేత, స్థానికులు లాదినేని సోమేశ్వర్, బాబురావు, గణేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల మార్పుపై వేగంగా చర్చలు

## యువతకు అవకాశాల దిశగా పార్టీ ఆలోచన

మునగాల ఏప్రిల్ 29 (ప్రజాజ్యోతి):
రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో మండల అధ్యక్షుల మార్పు అంశం ప్రాధాన్యం సంతరించుకుంటోంది. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ విషయంపై విస్తృతంగా చర్చలు జరిగినట్లు పార్టీ వర్గాల్లో సమాచారం వినిపిస్తోంది. పార్టీ బలోపేతం, గ్రామ స్థాయి నుంచి సంస్థాగత పునర్వ్యవస్థీకరణ లక్ష్యంగా ఈ నిర్ణయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా గతంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులను ఎలాగైతేఎన్నికల ద్వారా ఎంపిక చేసిన విధానాన్ని మాదిరిగా తీసుకుని, మండల అధ్యక్షుల ఎంపికలో కూడా అదే విధానం అమలు చేయాలనే ఆలోచన పార్టీ నాయకత్వంలో ఉందని ప్రచారం జరుగుతోంది. సుమారు మూడు సంవత్సరాలుగా పదవిలో కొనసాగుతున్న మండల అధ్యక్షులను మార్పు చేసి, పార్టీ కోసం కష్టపడుతున్న యువ నాయకులకు అవకాశం ఇవ్వాలని నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. గ్రామాలు, మండల స్థాయిలో పార్టీ కార్యకలా



పాలను మరింత చురుకుగా మార్చడం, కొత్త ఉత్సాహాన్ని తీసుకురావడం, యువతను ప్రోత్సహించడం ఈ చర్య వెనుక ప్రధాన ఉద్దేశ్యాలుగా కనిపిస్తున్నాయి. అలాగే పార్టీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా పనితీరు, ప్రజలతో అనుసంధానం, పార్టీ కార్యక్రమాల్లో చురుకుదనం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుని మార్పులు చేపట్టే అవకాశముందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో స్థానిక సమీకరణాలు, సామాజిక సమతౌల్యం, వర్గాల ప్రాతినిధ్యం వంటి అంశాలు కూడా కీలకంగా ఉండే అవకాశముంది. ఈ మార్పులపై ఇప్పటికే అంతర్గతంగా చర్చలు జరుగుతున్నప్పటికీ, అధికారికంగా పార్టీ నుంచి ప్రకటన ఇంకా వెలువడలేదు. అయితే రాబోయే రోజుల్లో ఈ అంశంపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని, త్వరలోనే మార్పుల ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశముందని కాంగ్రెస్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో మండల స్థాయి నాయకత్వంలో మార్పులు చోటుచేసుకుంటే, పార్టీ కార్యకలాపాల్లో కొత్త ఉత్సాహం, పోటీ వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# తిరుమలలో హాతిరామ్ బాబాజీ మఠం ఉత్తర ద్వారం వెంటనే తెరవాలి

## ఆధ్యాత్మిక వారసత్వాన్ని భవితరాలకు అందించాలి : టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడుకు ఎమ్మెల్సీ శంకర్ నాయక్ వినతి

మిర్యాలగూడ, ఏప్రిల్ 29,( ప్రజాజ్యోతి ):
తిరుమలలో హాతిరాం బాబాజీ మఠం



ఉత్తరద్వారం వెంటనే తెరవాలని చైర్మన్ బి .ఆర్ నాయుడు ను కలిసి విజ్ఞప్తి చేశారు ఎమ్మెల్సీ కేతవత్ శంకర్ నాయక్.భారతదేశం లోని సుమారు 15 కోట్ల బంజారా సమాజం ఆరాధ్య దైవంగా భావించే బాదావత్ ఆశారాం బల్నోద్ (హాతిరామ్ బాబాజీ) ఆధ్యాత్మిక వారసత్వాన్ని తరతరాలకు అందించాలనే గొప్ప సంకల్పంతో, ప్రతి బంజారా భక్తుడు శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనం అనంతరం హాతిరామ్ మఠానికి భోగ్ బండార్ సమర్పించి పూజించడం అనాదిగా కొనసాగుతున్న సంప్రదాయం.ఇటీవల దేశ ప్రధానమంత్రి హాతిరామ్ బాబాజీని బంజారా సమాజానికి చెందినవారని గుర్తించి ప్రకటించడం ఎంతో ఆనందదాయకం. ఇదే సమయంలో, హాతిరామ్ బాబాజీ మఠానికి సంబంధించిన ఉత్తర ద్వారం అనేక సంవత్సరాలుగా మూసివేయబడటం ఆందోళనకర విషయమన్నారు.ఈ ద్వారం ద్వారా భక్తులు మాత్రమే కాకుండా పూజారులు కూడా సంప్రదాయ ప్రకారం సేవలు నిర్వహించే అవకాశం ఉండేదని, ప్రస్తుతం ఉత్తర ద్వారం మూసివేయబడటం వలన భక్తులు, పూజారులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారన్నారు . అంతేకాకుండా, హాతిరామ్ మఠం నుండే ఇప్పటికీ వచ్చే ప్రసాదం తోనే శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పూజలు ప్రారంభమవుతున్నాయి అనేది విశేష మన్నారు . కాబట్టి, తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ఉన్న దాదాపు 40 లక్షల లంబాడీ బంజారా భక్తుల తరపున, అలాగే దేశవ్యాప్తంగా ఉన్న బంజారా సమాజం తరపున,ముఖ్యమంత్రి చంద్రబాబు ని వినమ్రంగా కోరుతున్నామన్నారు. హాతిరామ్ బాబాజీ మఠం ఉత్తర ద్వారాన్ని వెంటనే తిరిగి ప్రారంభించాలని కోరారు.ఇకపోతే, గత ప్రభుత్వం హాతిరామ్ బాబాజీ మఠానికి ట్రస్ట్ ఏర్పాటు చేయాలని ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలుకాలేదన్నారు . ఇప్పటికైనా మఠం ఉత్తర ద్వారం తెరవాలని, కైంకర్యాలు యధావిధిగా కొనసాగించాలని, మఠానికి ట్రస్ట్ ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన వెంట ఎక్స్ ఎంపీ సీతారాం నాయక్,ఎస్టీ సెల్ సభ్యుడు రాంబాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా టిటిడి బోర్డు చైర్మన్ బి.ఆర్. నాయుడు సానుకూలంగా స్పందించి, మే 6 లోపు జరిగే టిటిడి బోర్డు సమావేశంలో ఈ పిటిషన్‌పై చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం దేవస్థానంలో ప్రత్యేక పూజలు కూడా నిర్వహించారు. బంజారా సమాజం ఆధ్యాత్మిక భావోద్వేగాలను గౌరవిస్తూ, హాతిరామ్ బాబాజీ మఠానికి సంబంధించినసమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

# నిరుపేద యువకుని శస్త్ర చికిత్సకు మన మోత్కూర్ వాట్సాప్ గ్రూప్ చేయూత !

మోత్కూరు, ఏప్రిల్ 29 (ప్రజా జ్యోతి):
మోత్కూరు మున్సిపల్ కేంద్రానికి చెందిన కమ్యూనిస్టు నాయకుడు, ఆంధ్ర భూమి విలేకరి స్వర్గీయ కంచి నరసయ్య కుమారుడు కంచి శ్రీనాథ్ ఇటీవల హైదరాబాదులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. నిరుపేద కుటుంబానికి చెందిన కంచి నరసయ్య కుటుంబ సభ్యులు మన మోత్కూరు వాట్సాప్ గ్రూపును సంప్రదించగా దాతలు పెద్ద ఎత్తున స్పందన కనబరిచారు. దాతల నుండి సేకరించిన 53 వేల రూపాయల చెక్కును కంచి నరసయ్య కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. శ్రీనాథ్ ప్రస్తుతం హైదరాబాదులోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తమ దీనస్థితిని గమనించి వితరణ అందజేసిన మన మోత్కూరు వాట్సాప్ గ్రూపు సభ్యుల సహృదయానికి, ఔదార్యానికి కంచి నర్సయ్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో ఉన్న పేద ప్రజలను ఆదుకోవడానికి తాము ఎల్లప్పుడూ ముందుంటామని మన మోత్కూరు వాట్సాప్ గ్రూపు సభ్యులు తెలిపారు. శ్రీనాథ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న, కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న , మాజీ మున్సిపల్



కో ఆప్షన్ సభ్యులు గనగాని నర్సయ్య, మాజీ ఎంపీటీసీ జయశ్రీ, వాట్సాప్ గ్రూప్ ప్రతినిధులు ధబ్బేటి సోంబాబు, ఎడ్ల శ్రీనివాస్, మొగుల్లపల్లి సోమయ్య, గాదేనబోయిన నాగరాజు, మొరిగాల శ్రీను, కోమటి జనార్దన్, కూర్మిళ్ల రాములు, గుంటి దేవా, ఇక్కరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పది ఫలితాల్లో గ్రీన్ వుడ్ పాఠశాల విద్యార్థుల ప్రభంజనం

## 584 మార్కులతో నియోజకవర్గ టాపర్ గా రాజేశ్వరి పాఠశాలలో వంద కు వంద శాతం ఉత్తీర్ణత

హుజూర్ నగర్ ఏప్రిల్ 29:(ప్రజా జ్యోతి ):



తెలంగాణ రాష్ట్రంలో విడుదల చేసిన పదవ తరగతి ఫలితాల్లో హుజూర్ నగర్ గ్రీన్ వుడ్ స్కూల్ విద్యార్థులు సంచలన ఫలితాలు నమోదు చేశారని విద్యా సంస్థ చైర్మన్ తుమ్మా లూర్ద్ మరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రీన్ వుడ్ స్కూల్ విద్యార్థినీ రాజేశ్వరి 600 మార్కులకు గాను 584 మార్కులు సాధించి నియోజక వర్గ టాపర్ గా నిలిచిందని అన్నారు. అదే విధంగా నేహా రెడ్డి 578, సిద్ధి క 578,లోకేష్, 576,సాయి ద్విజ 576, అక్షయ 575, సాత్విక 575,వీర నరసింహారావు 575, శ్రీకర్ 575 మార్కులు, సనా సిద్ధి క 574, యామిని 571, నవ్య శ్రీ 570, సఫియా 570 మార్కులు సాధించారని తెలిపారు. తమ విద్యార్థులు 148 మంది పరీక్ష రాయిగా 148 మంది ఉత్తీర్ణత సాధించారని అన్నారు. 570 కి పైగా మార్కులు 13 మంది,550 కి పైగా 48 మంది, 500కి పైగా 112 మంది అత్యధిక మార్కులు సాధించారన్నారు. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు చైర్మన్ తుమ్మ లూర్ద్ మరెడ్డి డైరెక్టర్ సరిత, ప్రిన్సిపల్స్ కృష్ణ రావు,రాజారెడ్డి,అకడమిక్ కోర్డినేటర్ భూపాల్ రెడ్డి అభినందనలు తెలిపారు.

# పది ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన ఎంజెపి తిరుమలగిరి విద్యార్థులు

నిడమానూరు,ఏప్రిల్ 29(ప్రజాజ్యోతి ):
పదవ తరగతి ఫలితాలలో ఎం.జె.పి తిరుమలగిరి (సాగర్)వేంపాడ్ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రదర్శన



కనబరిచారు. బుధవారం విడుదలైన పది ఫలితాలలో మహాత్మ జ్యోతిభా పూలే (ఎం.జె.పి) తిరుమలగిరి (సాగర్) బాయ్స్ (వేంపాడ్) పాఠశాల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను కనబరిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ అన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజశేఖర్ మాట్లాడుతూ పాఠశాల నుండి పరీక్షకు హాజరైన 69 మంది విద్యార్థులు అందరూ ఉత్తీర్ణత సాధించి 100% ఫలితాలను నమోదు చేశారు.అదేవిధంగా 500 పైగా మార్కులు సాధించిన వారిలో 17 మంది విద్యార్థులు ఉన్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కె. రాజశేఖర్ పేర్కొన్నారు.

**ప్రతిభ కనబరిచిన విద్యార్థులు:**
ఈ ఫలితాల్లో చౌగాని యశ్వంత్ 554 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచాడు. అదేవిధంగా గుడిపాటి శ్రీరామ్ -549 మార్కులు), గుడిపాటి లోకేష్ -549 మార్కులు) ద్వితీయ స్థానంలో నిలిచి పాఠశాల కీర్తిని చాటారు.
ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కె. రాజశేఖర్ మాట్లాడుతూ, విద్యార్థుల కష్టానికి, ఉపాధ్యాయుల నిరంతర కృషి తోడవ్వడం వల్లే ఈ ఘన విజయం సాధ్యమైందని కొనియాడారు.. అదేవిధంగా విద్యార్థులను ప్రోత్సహించిన తల్లిదండ్రులకు , తోడ్పాటు అందించిన ఉపాధ్యాయ బృందానికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.
ఈ విజయం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

**కొసమెరుపు:**
బుధవారం విడుదల చేసిన పది ఫలితాల్లో ఎంజెపి తిరుమల గిరి సాగర్ (వేంపాడు) పాఠశాలలో గుడిపాటి శ్రీరాం, గుడిపాటి లోకేష్ లు ఇద్దరూ అన్నదమ్ములు....కవలలు....పది ఫలితాల్లో ఇద్దరికీ సేమ్ 549మార్కులు సాధించడంతో విద్యార్థులు తల్లిదండ్రులు, స్నేహితులు, పాఠశాల ప్రిన్సిపాల్, నాగార్జునసాగర్ నియోజకవర్గం నాయకులు, పలువురు హర్షం వ్యక్తంచేశారు.†

# పదవ తరగతి ఫలితాలలో సత్తాచాటిన జయ

కోదాడ టౌన్,ఏప్రిల్ 29 (ప్రజా జ్యోతి):
కోదాడ పట్టణంలోని జయ పాఠశాల విద్యార్థులు 10వ తరగతి ఫలితాలలో అద్భుత ప్రతిభను కనబరుస్తూ ప్రభంజనం సృష్టించారు.



బుధవారం పాఠశాల కరస్పాండెంట్ జయ వేణు గోపాల్ మాట్లాడుతూ పాఠశాల నుండి పరీక్షలకు హాజరైన మొత్తం 149 మంది విద్యార్థులూ 100% ఉత్తీర్ణత సాధించడం విశేషం.ఈ ఫలితాలలో 10 మంది విద్యార్థులు 570 పైగా మార్కులు సాధించగా, 24 మంది 560 పైగా, 48 మంది 550 పైగా మార్కులు సాధించారు. మొత్తం 124 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించి జయ పాఠశాల సత్తా చాటారు అన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిలో టి శ్రీజ రెడ్డి 593 మార్కులతో మొదటి స్థానం సాధించగా, ఎస్.కె. హీరా తన్వీర్ 588 మార్కులతో రెండవ స్థానం, ఎమ్. త్రినయని 579 మార్కులతో మూడవ స్థానంలో నిలిచారు.ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, కృషి చేసిన అధ్యాపక బృందం, సహకరించిన తల్లిదండ్రులను పాఠశాల కరస్పాండెంట్ జయవేణుగోపాల్, డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మలు, ప్రధానోపాధ్యాయులు చిలువేరు వేణు అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# తుంగతుర్తి మండలంలో పదవ తరగతిలో 99.77 ఉత్తీర్ణత

తుంగతుర్తి, ఏప్రిల్ 29, (ప్రజా జ్యోతి):
బుధవారం ప్రకటించిన పదవ తరగతి ఫలితాల్లో తుంగతుర్తి మండలంలో 99.77 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాశాఖ అధికారి బోయిన లింగయ్య తెలిపారు.బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పదవ తరగతి వార్షిక పరీక్షలకు 454 మంది విద్యార్థులు హాజరుకాగా 453 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. మండల పరిధిలోని గొట్టిపర్తి (94 శాతం) జిల్లా పరిషత్ పాఠశాల మినహా అన్ని పాఠశాలలో 100% ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.మండలంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన వెలుగు లికిత 569 మార్కులు , ద్వితీయ స్థానం మేరీ మదర్ పాఠశాలకు చెందిన షేక్ యాసిన్ 556 మార్కులు సాధించినట్లు తెలిపారు.

# ఉపాధిహామీ కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

– ఎంపీడీఓ బాల గంగాధర్



**రుద్రూర్, ఏప్రిల్ 29 (ప్రజాజ్యోతి):** ఉపాధిహామీ పనుల వద్ద ఉపాధిహామీ కూలీలకు అన్నీ సౌకర్యాలు కల్పించాలని ఎంపీడిఓ బాల గంగాధర్ సూచించారు. రుద్రూర్ మండలంలోని చిక్కడపల్లి గ్రామంలో గల చెరువు వద్ద ఉపాధిహామీ పనులను బుధవారం ఎంపిడిఓ బాల గంగాధర్, ఏపీఓ రాజేశ్వర్ లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతూ.. వేసవికాలం ఉన్నందున ఉదయం 6 గంటలకు పనులకు హాజరుకావాలని సూచించారు. అదేవిధంగా ఉపాధిహామీ పనులకు వచ్చేటప్పుడు గొడుగులను వెంట తీసుకురావాలన్నారు. గొడుగుల వలన ఎండ నుండి రక్షణ ఉంటుందని సూచించారు. అదేవిధంగా ఉపాధిహామీ పనుల వద్ద అన్నీ సౌకర్యాలు ఉండేవిధంగా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మచ్కురి రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధిహామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి





**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ) ఏప్రిల్. 29** ఇందల్వాయి మండల కేంద్రంలోని అన్సాంపల్లి సంతోష్ రెడ్డి కుమారుడి వివాహం డిచ్ పల్లి శివారులోని పిహెచ్ఆర్ గార్డెన్ లో నిర్వహించగా ఎమ్మెల్యే పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం కేఎన్ఆర్ గార్డెన్ లో జరిగిన కాంగ్రెస్ పార్టీ నాయకులు దొంతుల నారాయణ కుమారుడి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వైవాహిక జీవితం ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు అమృతాపూర్ గంగాధర్, ప్రధాన కార్యదర్శులు పొలసాని శ్రీనివాస్, భాస్కర్ రెడ్డి, ధర్పల్లి పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ బాల్ రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### నిజామాబాదు నగరంలో తెలంగాణ దివ్యాంగుల, వయోవృద్ధుల ట్రాన్స్

# జెండర్ సహకార సంస్థ ఆధ్వర్యంలో ట్రై సైకిల్, బ్యాటరీ ట్రై సైకిల్ పంపిణీ





**నిజామాబాద్ రూలర్( ప్రజా జ్యోతి) ఏప్రిల్ 29** తెలంగాణ దివ్యాంగుల, వయోవృద్ధుల మరియు ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సహకార సంస్థ ఆధ్వర్యంలో నిజామాబాద్ పట్టణంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియం ఆవరణలో విద్యార్థులు మరియు దివ్యాంగుల కోసం సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్హులైన దివ్యాంగులకు ద్విచక్ర వాహనాలు, బ్యాటరీ ట్రైసైకిళ్లు, ఆటో, వీల్‌చైర్స్‌తో ,పాటు పలు సహాయక ఉపకరణాలను అందజేశారు. ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ దివ్యాంగులు సమాజంలో వెనుకబడిన వర్గంగా కాకుండా సమాన హక్కులతో ముందుకు రావాలని ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వారికి అవసరమైన సహాయాన్ని అందించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తుందని, ఇటువంటి కార్యక్రమాలు వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ధన్ పాల్ సత్యనారాయణ, రాకేష్ రెడ్డి, కూడ చైర్మన్ కేశ వేణు, నగర మేయర్ ఉమారాణి, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రజాపాలన

- సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమానికి కొత్త దిశ
- నూతన గృహప్రవేశంలో పాల్గొని వంట సామాగ్రి అందజేసిన టీపీసీసీ స్టేట్ జనరల్ సెక్రటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి
- సొంత స్థలం లేని పేదలకు కూడా త్వరలో గృహనిర్మాణ పథకం
- ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది





**కామారెడ్డి రూరల్ ఏప్రిల్ 29 ప్రజా జ్యోతి** పేదల సొంతింటి కలను నెరవేర్చడం కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, ప్రజా పాలన ద్వారా ప్రతి నిరుపేద కుటుంబానికి గౌరవప్రదమైన జీవనం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని టీపీసీసీ స్టేట్ జనరల్ సెక్రటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. కామారెడ్డి మండలం ఇస్రోజివాడి గ్రామంలో నిర్వహించిన నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన, గృహప్రవేశం చేసిన కుటుంబాన్ని అభినందిస్తూ ఇంటి అవసరాల కోసం వంట సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా గడ్డం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని పరిపాలన సాగిస్తోందన్నారు. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఆశగా ఎదురుచూస్తున్న పేద కుటుంబాల కలలను నెరవేర్చిన ఘనత ఈ ప్రభుత్వానిదేనని కొనియాడారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ కార్యక్రమాలు కేవలం హామీలుగా కాకుండా ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తీసుకువస్తున్నాయని తెలిపారు. పేదలకు కేవలం ఇల్లు మాత్రమే కాదు, గౌరవప్రదమైన జీవనానికి అవసరమైన అన్ని సౌకర్యాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. సొంత స్థలం లేని అర్హులైన కుటుంబాలకు కూడా త్వరలో గృహనిర్మాణ పథకం ద్వారా శుభవార్త అందించనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో పేదల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటూ ప్రజల వద్దకే ప్రభుత్వం చేరుతుండటం ప్రజా పాలన ప్రత్యేకత అని అన్నారు. ప్రజల అవసరాలను అర్థం చేసుకుని సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాల ద్వారా పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని గడ్డం చంద్రశేఖర్ రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, పేదల సంక్షేమం, గృహ హక్కు కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్ర సృష్టిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జూలూరి సుధాకర్, నిమ్మ విజయకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు పంపరి లక్ష్మణ్, మున్సిపల్ కౌన్సిలర్లు గడ్డమీది మహేష్, క్రీడా అధ్యక్షులు నర్సాగౌడ్, మాజీ కౌన్సిలర్లు సలీం, పిడుగు సాయిబాబా, చింతల రవీందర్ గౌడ్, గౌరు నవీన్ కుమార్, నర్సోల్ల మహేష్, సుదర్శన్, కోటేశ్వర్, రాజశేఖర్, బండారి శ్రీకాంత్, గంగారం, మెహర్ బాబా, రాహుల్, మున్ను, శశి, వార్డు సభ్యులు ప్రణీత్, అజీస్, శంకర్, గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు, గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం -- ప్రతి ఇంటికీ అభివృద్ధి, ప్రతి కుటుంబానికీ గౌరవప్రదమైన జీవనం లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని నాయకులు స్పష్టం చేశారు.

### వేసవి సెలవుల్లో గెజిటెడ్

# ప్రధానోపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి



**కమ్మర్ పల్లి ( ప్రజాజ్యోతి ) ఏప్రిల్ 29 :** విద్యాశాఖలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియను ఈ వేసవి సెలవుల్లోనే చేపట్టాలని తెలంగాణ స్టేట్ గెజిటెడ్ హెడ్ మాస్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిలర్ చౌడారావు రాంప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం పత్రిక ప్రకటన విడుదల చేసారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చివరిసారిగా జూనియర్ లెక్చరర్లకు 2001లో, డైట్ లెక్చరర్లకు 2000లో, మండల విద్యాధికారులకు 2005లో పదోన్నతులు ఇచ్చారని, అప్పటి నుండి నేటి వరకు పదోన్నతులు లేక ఉపాధ్యాయులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**రెండు దశాబ్దాలుగా ఒకే క్యాడర్‌లో**

ఇతర ప్రభుత్వ శాఖలైన రెవెన్యూ, పంచాయతీ రాజ్ వంటి విభాగాల్లో ఉద్యోగులు 20 నుండి 25 ఏళ్ల సర్వీసులో కనీసం నాలుగు పదోన్నతులు పొందుతుంటే, విద్యాశాఖలో మాత్రం 20 ఏళ్లు దాటినా ఒకే క్యాడర్‌లో ఉండి రిటైర్ కావాల్సిన పరిస్థితి నెలకొందని ఆయన పేర్కొన్నారు. పదోన్నతులపై ఆశతో లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఎం ఏ , ఎం ఈ డి , ఎం ఫిల్, పి హెచ్ డి వంటి ఉన్నత విద్యా కోర్సులు పూర్తి చేసినా ఫలితం లేకుండా పోయిందని తెలిపారు.

**పని ఒత్తిడితో అనారోగ్యం**

రాష్ట్రంలోని డైట్ కళాశాలల్లో లెక్చరర్ల పోస్టులు ఖాళీగా ఉండటం, ఎంఈఓ పోస్టులు భర్తీ చేయకపోవడంతో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులపై అదనపు బాధ్యతలు పడుతున్నాయని రాంప్రసాద్ వివరించారు. దీనివల్ల అటు పాఠశాల పర్యవేక్షణ దెబ్బతినడమే కాకుండా, విపరీతమైన పని ఒత్తిడితో ఉపాధ్యాయులు రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

**నిరుద్యోగులకు మేలు**

2018 ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ప్రకారం ప్రస్తుతం జోనల్, మల్టీ జోనల్ విభజన పూర్తయినందున, ప్రభుత్వం వెంటనే డీఈఓ, డిప్యూటీ ఈఓ, జూనియర్ లెక్చరర్, ఎంఈఓ, డైట్ లెక్చరర్ పోస్టులకు పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. తద్వారా ఏర్పడే ఖాళీలను డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తే నిరుద్యోగులకు కూడా న్యాయం జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# గూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం మహోత్సవం

– మంత్రి సీతక్క చేతుల మీదుగా లబ్ధిదారుడి నూతన గృహప్రవేశం

– పేదల సొంతింటి కలలను నిజం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం – సంక్షేమ పథకాల అమలుపై మంత్రి ప్రశంసలు







**కామారెడ్డి రూరల్ ఏప్రిల్ 29 ప్రజా జ్యోతి** కామారెడ్డి మండలంలోని గూడెం గ్రామం అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలకు కేంద్రబిందువుగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం మహోత్సవ వాతావరణంలో అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రివర్యులు సీతక్క ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారుడి నూతన గృహంలో శుభప్రవేశం చేసి కుటుంబ సభ్యులకు ఆశీస్సులు అందజేశారు. గృహప్రవేశం అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఎన్నో నిరుపేద కుటుంబాలు సొంతింటి కలను నెరవేర్చుకుంటున్నాయని తెలిపారు. “ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం” అని స్పష్టం చేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కేవలం అభివృద్ధి కార్యక్రమం మాత్రమే కాకుండా గ్రామీణ జీవితాల్లో నూతన ఆశలు నింపే ఉద్యమమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ, కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్, గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, మండల అధ్యక్షులు గూడెం శ్రీనివాస్ రెడ్డి, గూడెం సర్పంచ్ యాదగిరి గౌడ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లోకోటి సుదర్శన్ రావు కల్లూరి భూమయ్య పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, యువజన ప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. మంత్రివర్యులకు గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలుకుతూ పూలమాలలతో సత్కరించారు. గ్రామంలో వేడుకల వాతావరణం నెలకొనగా, కొత్త ఇంటిలో అడుగుపెట్టిన లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ఆనందభాష్పాలతో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. “ఇన్నేళ్ల కల నిజమైంది... మాకు సొంతిల్లు రావడం జీవితంలో మర్చిపోలేని రోజు” అంటూ కుటుంబ సభ్యులు భావోద్వేగానికి లోనయ్యారు. కార్యక్రమం సందర్భంగా గ్రామంలో ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి మంత్రివర్యులకు అభివందనం చేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, గృహ నిర్మాణం, సంక్షేమ పథకాల అమలును వేగవంతం చేస్తోందని స్థానిక నాయకులు కొనియాడారు. అనంతరం మంత్రి సీతక్క కామారెడ్డి పట్టణంలో కొనసాగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని అధికారులతో సమీక్ష నిర్వహించారు. గూడెం గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రభుత్వం పేదల సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తోందనే విషయాన్ని మరోసారి రుజువు చేసిందని స్థానిక ప్రజలు అభిప్రాయపడ్డారు. గూడెం గ్రామంలో జరిగిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం గ్రామ చరిత్రలో గుర్తుండిపోయే వేడుకగా నిలిచిందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

### ఇందల్వాయి గండి తండ

# రహదారి విస్తరణకు ముమ్మర ఏర్పాట్లు

– సహకరించాలని సర్పంచుల విజ్ఞప్తి



**ఇందల్వాయి, ఏప్రిల్ 29, (ప్రజా జ్యోతి ):** ఇందల్వాయి ముఖద్వారం నుండి గండి తండ వరకు ఉన్న ప్రధాన రహదారికి ఇరువైపులా రాకపోకలకు ఆటంకంగా ఉన్న చెట్లు మరియు బండరాళ్లను తొలగించాలని మూడు గ్రామాల సర్పంచులు నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం వారు ఎంపీడీవో గారిని కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. వచ్చే నెల ఒకటవ తారీఖున ఆర్ అండ్ బి ( ఆర్ అండ్ బి) ఏఈ గారి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ తొలగింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. రహదారి విస్తరణ మరియు ప్రయాణీకుల భద్రత దృష్ట్యా ఈ చర్యలు చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ.. రోడ్డు పనుల వల్ల గ్రామాల మధ్య రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని, ఈ పనులకు పొలాల యజమానులు, రైతులు మరియు ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని కోరారు. పనులు జరిగే సమయంలో ఎటువంటి అవాంతరాలు కలగకుండా చూసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

# తిరుమలలో 11 ఏళ్లుగా పెళ్లిరోజు ప్రత్యేక దర్శనం

– శ్రావణి దేవేందర్ రెడ్డి భక్తి విశేషం



**బాన్సువాడ, ఏప్రిల్ 29 (ప్రజాజ్యోతి)** తిరుమల తిరుపతి దేవస్థానంలోని శ్రీ వెంకటేశ్వర స్వామివారిని ప్రతి ఏడాది తన పెళ్లిరోజు సందర్భంగా దర్శించుకునే అరుదైన ఆచారాన్ని బోర్లం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యురాలు శ్రావణి దేవేందర్ రెడ్డి గత 11 సంవత్సరాలుగా కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది కూడా బుధవారం ఉదయం 3 గంటలకు నిర్వహించే సుప్రభాత సేవలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి ఆశీర్వాదాలు పొందిన ఆమె, “ఇలా వరుసగా 11 సంవత్సరాలుగా పెళ్లిరోజునే స్వామివారి సేవలో పాల్గొనడం నా పూర్వజన్మ సుకృతం” అని భావోద్వేగంగా తెలిపారు. తన కుమారుడు త్వరగా ఆరోగ్యంగా కోలుకోవాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. సుప్రభాత సేవ దర్శనం తనకు ఎంతో ఆనందం, ఆహ్లాదం కలిగించిందని, ముఖ్యంగా ఆలయంలోని ధ్వజస్తంభ దర్శనం మహా అద్భుతంగా అనిపించిందని ఆమె పేర్కొన్నారు. అనంతరం రంగనాయక మండపంలో నిర్వహించిన వేద ఆశీర్వచన కార్యక్రమంలో పాల్గొని వేద పండితుల ఆశీర్వాదం కూడా పొందారు. ఈ దర్శనం సాధించేందుకు సహకరించిన తమ గురువు శ్రీనివాస్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమె భర్త దేవేందర్ రెడ్డి, కుమారుడు నిశాంత్ రెడ్డి, తల్లి విజయమ్మతో పాటు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు. భక్తి, ఆచారం, విశ్వాసం కలిసిన ఈ ప్రత్యేక సంప్రదాయం స్థానికంగా ఆదర్శంగా నిలుస్తోంది.

# చిన్నారులకు ఉచిత వైద్య పరీక్షలు



**రుద్రూర్, ఏప్రిల్ 29 (ప్రజాజ్యోతి):** రుద్రూర్ మండలంలోని అంగన్వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు పిల్లల వైద్య నిపుణురాలు డా. తహమీనా ఫాతిమా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా చిన్నారులకు ఎత్తు, బరువులను కొలిచారు. చిన్నారుల ఆరోగ్యం పట్ల తల్లులకు పలు సలహాలు, సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సుజాత, చిన్నారుల తల్లులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

### గజ్యా నాయక్ తండా

# చౌరస్తాలో చలివేంద్రం ఏర్పాటు



**మాచారెడ్డి ఏప్రిల్ 29.(ప్రజా జ్యోతి)** బుధవారం గజ్యా నాయక్ తండాలోని బస్టాండ్‌లో గ్రామపంచాయతీ పాలకవర్గం తరపున చలివేంద్రాన్ని సర్పంచ్ రావుల వినోద ప్రభాకర్ ప్రారంభించారు ఇట్టి కార్యక్రమంలో సెక్రెటరీ స్వామి వార్డ్ మెంబర్లు లావణ్య, రామ, ఎజాజ్, స్వామి, బాబా ఖాన్, రమేష్, జి పి సిబ్బంది కారోబార్ సతీష్, మోహన్, రాములు, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

### సర్పంచుల పోరం అధ్యక్షుడు
## రంగి కృష్ణ చేతులమీదుగా పుస్తె మెట్టెలు అందజేత



**వెల్దుర్తి (ప్రజాజ్యోతి) ఏప్రిల్ 29:** పేద కుటుంబాల వివాహాలకు సాయం చేసే ఉద్దేశ్యంతో నిరుపేద వధువులకు వెల్దుర్తి మండలం సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు రంగి కృష్ణ పుస్తె మెట్టెలు అందజేస్తూ, వారి పెళ్లిళ్లు సజావుగా జరగడానికి చేయూతను అందిస్తున్నారు. వెల్దుర్తి మండలం అరె గూడెం గ్రామంలో చాకలి భాగ్యమ్మ కూతురు మానస వివాహం సందర్భంగా పుస్తె మెట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా రంగి కృష్ణ మాట్లాడుతూ, పేద కుటుంబాల పెళ్లిళ్లకు సహాయం చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. గతంలో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించానని, భవిష్యత్తులో కూడా అవసరమైన వారికి సాయం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పల్వంచ శేఖర్, బీఆర్ఎస్ కార్యకర్తలు హనుమంత్ రెడ్డి, మైపాల్ రెడ్డి, రాజిరెడ్డి, సత్తిరెడ్డి, ఆంజనేయులు, యేసయ్య, రాజు, రమేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటోలో ఫ్యాన్.. అదిరింది డ్రైవర్ ప్లాన్.!





**నర్సాపూర్ (ప్రజాజ్యోతి)** ఎండలు మండిపోతున్న వేళ ప్రయాణికుల ఇబ్బందులను గమనించిన ఓ ఆటో డ్రైవర్ వినూత్నంగా ఆలోచించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. బుధవారం పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ పెట్రోల్ బంకు సమీపంలో నిలిపి ఉన్న ఈ ఆటో అందరినీ ఆకట్టుకుంది. వేసవి తాపం నుంచి ప్రయాణికులకు ఉపశమనం కలిగించేందుకు, వెనుక సీటులో కూర్చునే వారికి నేరుగా చల్లటి గాలి తగిలేలా ఆ డ్రైవర్ రెండు చిన్నపాటి టేబుల్ ఫ్యాన్లను అమర్చాడు. ప్రయాణం సౌకర్యవంతంగా ఉండేలా ఆటోలో అతడు చేసిన ఈ చిన్న మార్పు స్థానికులను ఆకట్టుకుంది.

## గ్రామాల సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం
### – మార్కెట్ కమిటీ చైర్మన్ ఐలాపురం కనకయ్య యాదవ్



**దౌల్తాబాద్, ఏప్రిల్ 29 (ప్రజా జ్యోతి)** గ్రామాల సమగ్ర అభివృద్ధి కాంగ్రెస్ లక్ష్యమని దౌల్తాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఐలాపురం కనకయ్య అన్నారు బుధవారం మండల పరిధిలోని కోనాపూర్ గ్రామంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. గ్రామీణాభివృద్ధి లక్ష్యంగా ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు అవసరమైన పనులను దశలవారీగా పూర్తి చేస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు, విద్యా సంస్థల అభివృద్ధి ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అందె రుక్మిణి రాజిరెడ్డి,వైస్ చైర్మన్ మద్దెల స్వామి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పడాల రాములు,ఉప సర్పంచ్ పంచమి రాజు,గణేష్ పంచమి,బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు తిప్పగౌని సత్యనారాయణ గౌడ్, బిఆర్ఎస్ గ్రామ మాజీ అధ్యక్షుడు చిటుకుల స్వామి,వార్డు సభ్యులు పంచమి రామస్వామి, పంచమి వినోద్, పంచమి శ్రీకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రైతులకు మద్దతు ధర కల్పించేందుకే కొనుగోలు కేంద్రాలు
### – మార్కెట్ కమిటీ చైర్మన్ ఐలపురం కనకయ్య



**దౌల్తాబాద్,ఏప్రిల్ 29(ప్రజా జ్యోతి )** రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర కల్పించేందుకే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని మార్కెట్ కమిటీ చైర్మన్ ఐలాపురం కనకయ్య వైస్ చైర్మన్ మద్దెల స్వామి పేర్కొన్నారు. బుధవారం దౌల్తాబాద్ మండలంలోని శేరిపల్లి బందారం, దీపాయంపల్లి గ్రామాల్లో పీఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తమ పంటలను నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి అమ్ముకోవాలని సూచించారు. మధ్యవర్తులపై ఆధారపడకుండా ఉండడం ద్వారా సరైన ధర పొందవచ్చని తెలిపారు. దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని రైతులను హెచ్చరించారు. ప్రభుత్వం రైతుల ప్రయోజనాల దృష్ట్యా కొనుగోలు కేంద్రాల ద్వారా పారదర్శకంగా ధాన్యం సేకరణ చేపడుతోందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కేంద్రాల్లో అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పడాల రాములు,సర్పంచ్ పెరుమాండ్ల నర్సింలు, మండల వ్యవసాయ అధికారి సాయి కిరణ్, పీఏఎస్ కార్యదర్శి మల్లేశం, మాచిన్ పల్లి సర్పంచ్ బొక్కల నాగరాజు, పంజ రమేష్ ,పిట్ల కనకరాజు, ఎర్రయ్య, రాజు, శీను, స్వామి, మహేందర్, శ్రీశైలం, నాగులు, కృష్ణ, కరుణాకర్, అంతయ్య తదితరులున్నారు.

## ఇబ్రహీం నగర్ పాఠశాల ప్రభంజనం







**చిన్నకోడూరు, ఏప్రిల్,29,(ప్రజా జ్యోతి)** ఇబ్రహీంనగర్ ఆదర్శ పాఠశాల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయకేతనం ఎగురవేశారు. పాఠశాలకు చెందిన విద్యార్థి సాయికిరణ్ రెడ్డి 563 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచాడు. ఆకుల శ్రీజ 559, మహార్విత 554, మీనాక్షి 551 మార్కులను సాదించారు. 29 మందికి పైగా విద్యార్థులు 500 పైగా మార్కులను సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ సతీష్ తెలిపారు. ఆదర్శ పాఠశాలలో మొత్తంగా 93 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యారు. విద్యార్థుల ఉత్తమ ఫలితాలపై పాఠశాల అధ్యాపక బృందం సంతోషం వ్యక్తం చేశారు. క్రమశిక్షణతో చదివి మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ విజయానికి ఉపాధ్యాయుల కృషితో పాటు తల్లిదండ్రుల సహకారం ఎంతో ఉందన్నారు.

## పది ఫలితాల్లో విష్ణు ప్రభంజనం.!

**నర్సాపూర్ ఏప్రిల్ 29 (ప్రజాజ్యోతి)** పదో తరగతి ఫలితాల్లో విష్ణు ఉన్నత పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ చాటారు. పరీక్షలకు హాజరైన 55 మందికి 55 మంది ఉత్తీర్ణులై వంద శాతం ఫలితాలతో పాఠశాల రికార్డు సృష్టించింది. వి. సంకీర్త్ 574 మార్కులతో టాపర్‌గా నిలవగా, వి. గౌతమ్ (569), ఎన్. సిరి (564), ఎస్. నిశాంత్ రెడ్డి (564), కే. భవ శ్రీ (563) అత్యుత్తమ మార్కులు సాధించారు. 32 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించడం విశేషం. ఈ విజయంపై ప్రాదనోపద్యాయురాలు నాగజ్యోతి, ఉప ప్రధానోపాధ్యాయులు విశ్వనాథ్ హర్షం వ్యక్తం చేస్తూ.. విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు.

### సర్కారు బడి సత్తా
## ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు







**వెల్దుర్తి (ప్రజాజ్యోతి) ఏప్రిల్ 29:** ప్రభుత్వ పాఠశాల అంటే సాధారణం అనుకునే రోజులు పోయాయి. ఇప్పుడు సర్కారు బడులే సక్సెస్‌కు కొత్త నిర్వచనం చెబుతున్నాయి. కష్టపడి చదివిన విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించి, తమ ప్రతిభతో అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. వెల్దుర్తి పి.ఎం. శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈసారి పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటారు. పది పరీక్షలకు హాజరైన 150 మంది విద్యార్థులంతా 100% ఉత్తీర్ణత సాధించడం నిజంగా గర్వించదగ్గ విషయం. మండల స్థాయిలోనే టాప్ ర్యాంకులు సాధిస్తూ గొట్టిముక్కుల అక్షయ -- 560 మార్కులతో 1వ స్థానం,శెట్టి మేఘన -- 556 మార్కులతో 2వ స్థానం,రాగుల లిప్సిక -- 553 మార్కులతో 3వ స్థానంఅదే విధంగా 42 మంది విద్యార్థులు 500కి పైగా మార్కులు సాధించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ అద్భుత ఫలితాల వెనుక విద్యార్థుల కష్టంతోపాటు, ఉపాధ్యాయుల నిబద్ధత, తల్లిదండ్రుల సహకారం అన్నీ కలిసొచ్చాయి. ముఖ్యంగా ప్రధానోపాధ్యాయులు సాంబయ్య మార్గనిర్దేశం, టీచర్ల కృషి ఈ విజయానికి బలమైన పునాది అయ్యాయి. ఇది కేవలం ఫలితం కాదు, వెల్దుర్తి పాఠశాల భవిష్యత్తు విజయాలకు నాంది, ఇలానే మరిన్ని ఉన్నతపలితాలను సాధిస్తూ ముందుకు సాగాలని ప్రధానోపాధ్యాయులు సాంబయ్య పేర్కొన్నారు.

## పది ఫలితాల్లో శత శాతం ఉత్తీర్ణత
### మండల టాపర్ గాకుకునూరుపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని





**కొండపాక ఏప్రిల్ 29 (ప్రజాజ్యోతి):-** కుకునూరు పల్లి మండలంలోని పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాధికారి బచ్చలి సత్తయ్య తెలిపారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేట్ పాఠశాలల్లో గల మొత్తం 225 విద్యార్థుల గాను మొత్తం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కుకునూరు పల్లి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న రాచకొండ అర్చన 552 మార్కులతో మండల టాపర్ గా నిలవగా చిన్న కిష్టాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన వి. రామకిరణ్ 551 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచాడు. కాగా కూకునూరుపల్లి ఉన్నత పాఠశాలలో 95 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారు. 20 మంది విద్యార్థులు 500 కు పైగా మార్కులు సాధించగా, 55 మంది విద్యార్థులు 450 పైన మార్కులు సాధించారు.

## పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రభంజనం
### – వేచరేణి విద్యార్థిని సంజనకు మండల ప్రథమ స్థానం
### – 12 పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత





**చేర్యాల, ఏప్రిల్ 29 (ప్రజాజ్యోతి):** పదవ తరగతి ఫలితాల్లో చేర్యాల మండల విద్యార్థులు ఘనవిజయం సాధించారు. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి విడుదలైన ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేటుకు దీటుగా మార్కులు సాధించి మండలానికి గర్వకారణంగా నిలిచారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుండి మొత్తం 348 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, అందులో 342 మంది ఉత్తీర్ణత సాధించారు. అందులో బాలురు 186 మంది హాజరు కాగా 182 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 162 మంది హాజరు కాగా 160 మంది ఉత్తీర్ణత సాధించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విభాగంలో వేచరేణి పాఠశాల విద్యార్థులు బి. సంజన 564 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో, బి. అంజలి 554 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు. ముస్త్యాల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి జి. నందిని 533 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచింది. మోడల్ స్కూల్ (టీజీఎంఎస్) ముస్త్యాల విద్యార్థి ఎండి. అబ్దుల్ అయాన్ 560 మార్కులతో సత్తా చాటగా,గురుకుల పాఠశాల (టీజీడబ్ల్యూఆర్ఎస్) చేర్యాల విద్యార్థి జె.రాజసింహ 547 మార్కులు, కేజీబీవీ విద్యార్థిని ఎం. శృతి 541 మార్కులు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. మండలంలోని కడవెరుగు, ముస్త్యాల, నాగపురి, చుంచనకోట, వేచరేణి, గురుజకుంట, దానంపల్లి, వీరన్నపేట, పోతిరెడ్డిపల్లి,అర్జున్ పట్ల పాఠశాలలతో పాటు టీజీఎంఎస్ ముస్త్యాల మరియు టీజీడబ్ల్యూఆర్ఎస్ చేర్యాల పాఠశాలలు 100 శాతం ఫలితాలను సాధించాయి. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, వారికి దిశానిర్దేశం చేసిన ప్రధానోపాధ్యాయులను మరియు ఉపాధ్యాయులను మండల విద్యాధికారి బి. నరేందర్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందనడానికి ఈ ఫలితాలే నిదర్శనమని ఆయన కొనియాడారు.

## పెద్దమ్మ తల్లి ఆశీర్వదించు
### గజ్వేల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్



**గజ్వేల్ ఏప్రిల్ 29 (ప్రజా జ్యోతి):** గజ్వేల్ మండలం బంగ్లా వెంకటా పూర్ గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట,ధ్వజస్తంభం ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, సర్పంచ్ నాగమణి నర్సింలుతో పాల్గొని పెద్దమ్మ తల్లి ఆశీస్సులు తీసుకోవడం జరిగింది. ప్రజలు అందరు అమ్మవారి ఆశిస్తులతో సుఖ సంతోషాలతో ఉండలని అమ్మవారిని ప్రార్థించడం జరిగింది. వారి తో పాటు బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## బాలల రక్షణ.. ఊరి బాధ్యత!



**నర్సాపూర్ ఏప్రిల్ 29 (ప్రజాజ్యోతి)** బాలల హక్కుల పరిరక్షణలో గ్రామ స్థాయి కమిటీలు చురుగ్గా వ్యవహరించాలని అధికారులు కోరారు. బుధవారం ఆవంచలో నిర్వహించిన సమావేశంలో సీఐ జాన్ రెడ్డి, ఎంపీడీవో మౌజంహుస్సేన్, ఎస్ఐ రంజిత్ రెడ్డి పాల్గొన్నారు. 18 ఏళ్ల లోపు పిల్లలందరికీ విద్యా, వికాస హక్కులు ఉంటాయని, వాటిని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ముఖ్యంగా బాల్య వివాహాలను అరికట్టాలని, మొబైల్ వ్యసనం నుంచి పిల్లలను దూరంగా ఉంచి చదువుపై ఆసక్తి కలిగించాలని సూచించారు. సర్పంచ్ స్రవంతి కరుణాకర్ మాట్లాడుతూ.. బాలల భద్రతకు తమ గ్రామం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శివకుమారి, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

### వారాహి ప్రత్యంగిరా
## శరభేశ్వర స్వామివారి ప్రతిష్ట
### మహాకుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభం



**కొండపాక ఏప్రిల్ 29 (ప్రజాజ్యోతి):-** కుకునూరుపల్లి మండల కేంద్రంలో శ్రీ వారాహి, ప్రత్యంగిరా, శరభేశ్వర స్వామివారి ప్రతిష్ట మహాకుంభాభిషేక మహోత్సవాలు మంగళవారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ప్రారంభమయ్యాయి. పాంచాహ్నిక కార్యక్రమాల్లో భాగంగా సంకల్పం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, మాతృక పూజ, పంచగవ్య ప్రాచనం వంటి పూజలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ జక్కి కృష్ణావధాని ఆధ్వర్యంలో ఆచార్యులు, ఋత్వికులు సంప్రదాయబద్ధంగా కార్యక్రమాలు నిర్వహించగా, యజ్ఞశాల ప్రవేశంతో వేడుకలు మరింత వైభవంగా సాగాయి. సాయంత్రం నవగ్రహ, మాత్రిక, యోగిని, క్షేత్రపాలక, వాస్తు దేవతల స్థాపనలు, అగ్ని ప్రతిష్ఠ, హవనాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రధాన స్థపతి తాళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దేవాలయం అద్భుత శిల్పకళతో నిర్మితమైంది. వారాహి మత ట్రస్ట్ చైర్మన్ మాతృశ్రీ మమతమ్మ మాట్లాడుతూ భక్తులందరూ విచ్చేసి అమ్మవారి అనుగ్రహం పొందాలని కోరారు. ఢిల్లీ నుంచి విచ్చేసిన డాక్టర్ జాస్తి వీరాంజనేయులు మాట్లాడుతూ దేవాలయ నిర్మాణం ప్రజల సహకారంతో జరగడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా దాతలను ఘనంగా సత్కరించారు. మూడు రోజులపాటు కొనసాగనున్న ఈ మహోత్సవాల్లో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు ఆహ్వానించారు.

### ఏడు ప్రభుత్వ ఉన్నత
## పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత
### మండల టాపర్‌గా సిర్సనగండ్ల విద్యార్థిని



**కొండపాక ఏప్రిల్ 29 (ప్రజా జ్యోతి):-** పదో తరగతి ఫలితాల్లో కొండపాక మండలంలోని ఏడు ఉన్నత పాఠశాలల విద్యార్థులు వంద ఉత్తీర్ణత సాధించిన ఎంఈఓ తెలిపారు. మండలంలోని సిరసనగండ్ల ఉన్నత పాఠశాల విద్యార్థిని సుహానా బేగం కు 572 లతో మండలంలో ఎక్కువ మార్కులు సాదించినట్టు తెలిపాడు. మండలంలోని 14 ఉన్నత పాఠశాలలకు గాను 381 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 370 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. తిమ్మారెడ్డిపల్లి, బందారం. అంకిరెడ్డిపల్లి, కొండపాక బాలికల పాఠశాల, కొండపాక కేజీబీవీ, కొండపాక మోడల్ స్కూల్ కొండపాక మహాత్మ జ్యోతిరావు పూలే బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎంఈఓ శ్రీనివాసరెడ్డి అభినందించారు.

# వికారాబాద్‌లో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు




**వికారాబాద్ ప్రతినిధి, ఏప్రిల్ 29(ప్రజా జ్యోతి):** వికారాబాద్ జిల్లాలోని కొంపల్లిలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మిషన్ వాత్సల్య పథకం కింద జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సంక్షేమ అధికారిణి బి. కృష్ణవేణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రోజురోజుకు సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా మొబైల్ ఫోన్ల ద్వారానే ఎక్కువగా నేరాలు జరుగుతున్నాయని, వ్యక్తిగత వివరాలను ఎవరికీ ఇవ్వకూడదని, అనుమానాస్పద కాల్స్ తోపాటు లింకులను దూరంగా ఉంచాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ జానయ్య, శ్రీనివాసులు మాట్లాడుతూ బ్యాంకింగ్ మోసాలు, ఓటిపి కాల్స్, సోషల్ మీడియా మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయడం లేదా cybercrime.gov.in ద్వారా ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి వరలక్ష్మి, ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాఘవీణ, కళాశాల ప్రిన్సిపల్ రవీందర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా "నశాముక్త్ భారత్" వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు.

## ఫలితాలపై కాదు, పిల్లలపై ప్రేమ చూపండి

**- ఎస్పీ స్నేహా మెహ్రా**



**వికారాబాద్ ప్రతినిధి, ఏప్రిల్ 29 (ప్రజా జ్యోతి) :** పదో తరగతి ఫలితాలు విడుదలైన సందర్భంగా విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు సంయమనంతో వ్యవహరించాలని జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా, సూచించారు. ఫలితం ఏదైనా సరే పిల్లలను ప్రేమతో ఆదరించాలని, తక్కువ మార్కులు వచ్చినా లేదా ఫెయిల్ అయినా మందలించడం, నిందించడం చేయవద్దని ఆమె అన్నారు. పదేళ్ల విద్యలో ఇది ఒక చిన్న దశ మాత్రమేనని, జీవితానికి ఇది అంతిమ పరీక్ష కాదని తల్లిదండ్రులు గుర్తించాలని సూచించారు. ఇతరులతో పోల్చి పిల్లల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయకుండా, వారికి ధైర్యం చెప్పి భవిష్యత్తుపై నమ్మకం కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు ఒత్తిడికి గురయ్యే అవకాశమున్నందున వారి ప్రవర్తనను గమనిస్తూ స్నేహపూర్వకంగా ఉండాలని పేర్కొన్నారు. ఆశించిన ఫలితాలు రాకపోతే నిరుత్సాహపడకుండా మళ్లీ ప్రయత్నించేలా ప్రోత్సహించాలని, "ఓటమి గెలుపుకు తొలి మెట్టు" అనే భావనను వారికి అర్థమయ్యేలా చేయాలని సూచించారు. ఫలితాల ప్రభావంతో విద్యార్థులు ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా కుటుంబ సభ్యులు అండగా నిలవాలని, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ వారి భవిష్యత్తుకు తోడ్పాటునందిస్తుందని ఎస్పీ తెలిపారు. విద్యార్థులు ధైర్యంగా ముందుకు సాగాలని ఆమె ఆకాంక్షించారు.

## ప్రభుత్వ కార్యాలయాలలో ప్రజా పాలన అవగాహన సదస్సు




**ఉప్పల్ ఏప్రిల్ 29 ప్రజాజ్యోతి :** మల్కాజిగిరి పోలీస్ కమీషనర్ ఆదేశానుసారం, మల్కాజిగిరి ఉమెన్ సేఫ్టీ డి.సి.పి. టీ. ఉషా రాణి సూచనల మేరకు మల్కాజిగిరి ఏ.హెచ్.టి.యు. ఉప్పల్ పి.ఎస్. వారి ఆధ్వర్యంలో ఉప్పల్ పోలీసు స్టేషన్ పరిధిలో గల జి.హెచ్.ఎం.సి ఉ ఎం.ఆర్.ఓ ఆర్.టి.ఓ ప్రభుత్వ కార్యాలయాల్లోలో ప్రజా పాలన అవగాహనా సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా మల్కాజిగిరి ఏ.హెచ్.టి.యు. యస్.ఐ. యండి. ఖలీల్ అహ్మద్, ఉప్పల్, మహిళా.యస్.ఐ. సమత, ఐ.ఏ.యస్.ఐ. వెంకట్ రెడ్డి, మహిళా ఏ.యస్.ఐ. ఎన్. మీనా కుమారి హెడ్ కానిస్టేబుల్ మురలి, కానిస్టేబుల్ బానుప్రసాద్ మహిళా కానిస్టేబుల్ రజిత ల ఆధ్వర్యంలో ఉద్యోగులని ఉదేశించి అవగాహనా సదస్సు నిర్వహించడం జరిగినది. ఈ సదస్సులో యస్.ఐ. యండి. ఖలీల్అహ్మద్ ఉద్యోగులని ఉదేశించి మాట్లాడుతూ పోష్ ఆక్ట్ 2013 కార్యాలయంలో లెంగిక వేదింపులు అసబ్యా ప్రవర్తనా అశ్లీల్ల కంటెంట్ షేర్ చేయడం లింగ వివక్ష గురించి మహిళలను మోసపూరితంగా లేదా బలవంతంగా అపహరించి బలవంతంగ వ్యభిచారం చేయించడం, చిన్నపిల్లల పై ఆగయిత్యలు బాలలను అమ్మడం, అమ్మి వారితో భిక్షాటన చేయించడం, బాలికలను వేధించడం, అవయవాల మార్పిడికి వీళ్ళను ఉపయోగించడం మహిళలకు ప్రయాణంలో టి.సేఫ్ అప్లికేషన్ ఉపయోగించడం, రోడ్డు భద్రత, మత్తు పదార్థాల వాడకం, కొత్త చట్టాలు అయిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష, భారతీయ సాక్ష్యా అధినియమ్‌లపైన అవగాహన కల్పించారు. సైబర్ బెదిరింపులు, సైబర్ మోసాలకు గురి అయితే దయల్-1930, ఉమెన్ హెల్ప్ లైన్-1091, 181, చైల్డ్ హెల్ప్ లైన్-1098/112, దయల్-100/112 నంబర్లకు దయల్ చేయాలని సూచించారు. ఈ సదస్సులో పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# కొత్లాపూర్ శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర ఉత్సవాలు ప్రారంభం




- భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తున్న పాలకమండలి
- వచ్చే నెల 15న రథోత్సవం షీడే ఉత్సావాలు
- జాతర ఉత్సవాలకు భారీగా తరలిరానున్న భక్తులు
- జాతరలో సీసీ కెమెరాల నిఘా
- ఆలయ కమిటీ చైర్మన్ ప్రవీణ్ కుమార్ రెడ్డి




**తాండూరు ఏప్రిల్ 29 ప్రజా జ్యోతి :** వికారాబాద్ జిల్లా తాండూరు మండలం కొత్లాపూర్ శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర ఉత్సవాలు వచ్చే నెల1 నుండి మే 31 వరకు జాతర ఉత్సవాలు జరుగుతాయని దేవదాయ శాఖ కార్య నిర్వాహక అధికారి శేఖర్ గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ ప్రవీణ్ కుమార్ రెడ్డి వివరించారు. ఐదు వారాలపాటు జరిగే ఈ జాతర ఉత్సవాలు మే ఒకటి పౌర్ణమి రోజు ప్రారంభమై మే 31 పౌర్ణమి నాటికి జాతర ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఇట్టి జాతర ఉత్సవంలో ప్రధాన ఘటమైన రథోత్సవం, షీడే ఉత్సవాలు మే 15న జరగనున్నట్లు నిర్వాహకులు చెప్పారు. ఈ రథోత్సవ కార్యక్రమానికి తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి,తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి తదితర ప్రముఖులు హాజరుకానున్నట్లు చెప్పారు. శుక్రవారం, మంగళవారం రోజులలో భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో రూరల్ సిఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, కరణ్ కోట్ ఎస్సై రాథోడ్ వినోద్ ల సహకారంతో ఏర్పాట్లను చేయడం జరుగుతుందని చెప్పారు. ముఖ్యంగా ఈ జాతర ఉత్సవాలకు సుదూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో ఉండే అవకాశం ఉండడంతో భక్తుల రక్షణార్థం కోసం సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. భక్తులకు మంచినీటి సౌకర్యంతో పాటు ఎలాంటి ఆటంకాలు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. అదేవిధంగా స్వచ్ఛందంగా వాలంటరీ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందని భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ ప్రాంగణంలో ఉన్న వాలంటీర్లు భక్తులకు సూచనలు ఇస్తారని తెలిపారు. కోరికలు తీర్చే కొంగుబంగారంగా కొలిచే శ్రీ రేణుక ఎల్లమ్మ మాత కు మొక్కులు తీర్చుకుని భక్తులు మేకలు కోళ్లను, అమ్మవారికి సమర్పించి ప్రత్యేక మొక్కులు తీర్చుకుంటారని గుర్తు చేశారు. అంతేకాకుండా నిత్యం అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు కొనసాగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ జాతర ఉత్సవాలకు స్థానిక గ్రామ ప్రజలతో పాటు ఆలయ కమిటీ సభ్యులు పోలీసులు సహకరించాలని కోరారు.

## పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ

# కనబర్చిన దోమ మండల విధ్యార్థులు

**విధ్యార్థులకు అభినందనలు తెలియజేసిన ఎంఈఓ వెంకట్**





**దోమ ఏప్రిల్ 29 (ప్రజాజ్యోతి) :** తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పదవ తరగతి ఫలితాల్లో వికారాబాద్ జిల్లా దోమ మండలంలో మొత్తం 10 ఉన్నత పాఠశాలలో 490 విద్యార్థులు పరీక్షలు వ్రాయగా 452 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం జరిగింది. 92.24% విధ్యార్థులు పాస్ కావడం జరిగింది.అదేవిదంగా మండలంలోని మొత్తం 10 పాఠశాలలో 5 పాఠశాలలు 100% ఉత్తీర్ణత సాధించడం జరిగింది. అవి.

1. జడ్పిహెచ్ఎస్ బొంపల్లి
2. జడ్పిహెచ్ఎస్ దోమ (బాలికల)
3. జడ్పిహెచ్ఎస్ మోత్కూర్
4. జడ్పిహెచ్ఎస్ అయినాపూర్
5. కెజిబివి దోమ

మండలశీలో మొదటి స్థానం లో జడ్పిహెచ్ఎస్ కిష్టాపూర్ పాఠశాలకు చెందిన విద్యార్థిని షేక్ ఫారేహిన్ 575మార్కులు సాధించింది.మండల రెండవ స్థానం లో జడ్పిహెచ్ఎస్ దోమ మరియు జడ్పిహెచ్ఎస్ కిష్టాపూర్ పాఠశాలలకు చెందిన ప్రేరణ 556,రాకేష్ 556,మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మరియు అందుకు కృషి చేసిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు మండల విద్యాధికారి వెంకట్ అభినందనలు తెలియజేశారు.

# భవిష్యత్ అంతా ఎలక్ట్రిక్ వాహనాలదే




- వికలాంగులకు సైతం అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రణాళికలు
- సినీ నటులు, వెల్ గ్రో కంపెనీ ఎండి లోహిత్ కుమార్

**అబ్దుల్లాపూర్ మెట్టు ఏప్రిల్ 29 (ప్రజాజ్యోతి) :** భవిష్యత్తు అంతా ఎలక్ట్రిక్ వెహికల్ దేనని,ప్రతి వ్యక్తి జీవితంలో ఎలక్ట్రిక్ వెహికల్ భాగం అవ్వాలని, త్వరలోనే అది కార్యరూపం దాల్చుతుందని ప్రముఖ సినీ నటులు,వెల్ గ్రో కంపెనీ ఎండి ఆకవరపు లోహిత్ కుమార్ అన్నారు. బుధవారం పెద్ద అంబర్పేట్ లక్ష్మారెడ్డి పాలెం విజయవాడ జాతీయ రహదారి ప్రక్కన వెల్ గ్రో షోరూంను పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ సిద్ధంకి కృష్ణారెడ్డి,షోరూం నిర్వాహకులు మల్లెపల్లి రామచంద్రారెడ్డి లతో కలిసి ముఖ్యఅతిథిగా విచ్చేసిన లోహిత్ కుమార్ ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా లోహిత్ కుమార్ మాట్లాడుతూ కస్టమర్ల నమ్మకాన్ని చూరగొంటే ఏ వ్యాపారం అయినా మూడు పువ్వులు ఆరు కాయలుగా వెలుగుతుం దన్నారు. ఇటీవల పెట్రోల్ డీజిల్ కొరత నేపథ్యంలో విసిగిపోయిన ప్రజలు తమ వాహనాలను మూలకు పడేసి ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలు వైపు ముగ్గు చూపే అవకాశం అధికంగా ఉందన్నారు. గత సంవత్సరన్నర కాలంగా ఎలక్ట్రిక్ వాహనాల పనితీరు మన్నికపై బెరీజు వేసుకొని, వ్యాపారాన్ని లాభాపేక్షతో కాకుండా విలువలతో కూడిన వ్యాపారాన్ని కష్టమర్ల నమ్మకాన్ని చూరగొనేలా ఉండాలన్నారు. వాహనాల సేల్స్ పెంచుకోవడంతో పాటు కస్టమర్ల నమ్మకాన్ని చూరగొనాలన్నారు. కస్టమర్లు ఎవరైనా ఎలక్ట్రిక్ వెహికల్, సోలార్ రామచంద్రారెడ్డి షోరూం లో నాణ్యతతో పాటుగా నమ్మకంతో కూడిన వస్తువు లభిస్తుందనే పేరు సంపాదించాలన్నారు. ఏదైనా వాహనం మనం ఎంత జాగ్రత్తగా వాడుకుంటే అంత మన్నిక ఇస్తుందని అన్నారు. నల్లగొండ జిల్లా ఫ్లోరైడ్ ఉద్యమంలో ఆ జిల్లాలో మొట్టమొదటిసారి ఫ్లోరైడ్ భూతాన్ని తరిమికొట్టేందుకు ఉద్యమాన్ని రేకెత్తించిన వ్యక్తి నల్లగొండ శ్రీనివాసులు అన్నారు. వికలాంగుల సంక్షేమం కోసం ఆయన ఎన్నో పోరాటాలు కొనసాగించి వికలాంగుల సంక్షేమం కోసం పాటుపడ్డారన్నారు. తాను చాలా కాలం నుండి ఒక విషయం గురించి ఆలోచిస్తున్నానని వికలాంగుల సోదరులకు కూడా ఎలక్ట్రిక్ వెహికల్ అందించే కార్యక్రమాన్ని చేపట్టాలని, అన్ని వ్యాపారాలు లాభాపేక్షతో చూడకూడదని,కొన్ని సందర్భాలలో మానవీయ కోణంలో ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం నిర్వాహకులు మల్లేపల్లి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ అన్ని కంపెనీలకు చెందిన కమర్షియల్ డొమెస్టిక్ సోలార్లను ఫిట్టింగ్ చేయడం జరుగుతుం దన్నారు. ఆయుష్ సర్టిఫికెట్స్ కలిగిన 70 వరకు ప్రొడక్ట్స్ తమ వద్ద ఉన్నాయన్నారు. వెల్ గ్రో కంపెనీ ఎండి లోహిత్ కుమార్ పర్యవేక్షణలో తాము మార్కెటింగ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ వెంకట్ రెడ్డి, అజారుద్దీన్, ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా అక్రిడేషన్ కమిటీ తొలి సమావేశం



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 29 (ప్రజాజ్యోతి) :** రంగారెడ్డి జిల్లా అక్రిడేషన్ కమిటీ తొలి సమావేశం బుధవారం కొంగరకలాన్‌లోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించబడింది. కమిటీ చై ర్మన్‌గా ఉన్న జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి అక్రిడేషన్ కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సమావేశంలో జిల్లా ప్రజా సంబంధాల అధికారి (డిపిఆర్ఓ)పాల్గొని, జర్నలిస్టుల అక్రిడేషన్ ప్రక్రియ, మార్గదర్శకాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు జారీ చేసే విధానం,అర్హతలు, పారదర్శకతపై సభ్యులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సమావేశం సానుకూల వాతావరణంలో సాగి, తొలి మీటింగ్ విజయవంతంగా పూర్తయ్యింది. జిల్లాలో మీడియా ప్రతినిధులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని అధికారులు తెలిపారు.

## మద్యం మత్తులో నిర్లక్ష్యంగా కారు డ్రైవింగ్

**- బైకులను ఢీకొట్టడంతో పూర్తిగా ధ్వంసం**



**అబ్దుల్లాపూర్ మెట్టు ఏప్రిల్ 29 (ప్రజాజ్యోతి) :** మద్యం మత్తులో ముగ్గురు వ్యక్తులు కారును నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంతో ద్విచక్ర వాహనాలు ధ్వంసం అయిన సంఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హయత్ నగర్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ పి.నాగరాజు గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం సాయంత్రం 7 గంటల సమయంలో హయత్ నగర్ నుండి ఇంజాపూర్ వెళ్లే దారిలో గల శ్రీ రాఘవేంద్ర టింబర్ డిపో సమీపంలో మద్యం సేవించిన ముగ్గురు వ్యక్తులు కారు( టీఎస్ 04 ఎఫ్ జి 9129) నిర్లక్ష్యంగా వేగంగా డ్రైవింగ్ చేస్తూ దుకాణాల ముందు పార్కు చేసి ఉన్న బైకులను వేగంగా ఢీకొట్టడంతో బైకులు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే హయత్ నగర్ పోలీస్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణమైన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. చట్టపరంగా తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపారు.

## పెంజర్ల శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయానికి ఆవు, దూడ అందజేత

**- దాత నల్లచెరువు తాండ దన్నాడ వెంకటేష్ యాదవ్**



**కొత్తూర్ ఏప్రిల్ 29 (ప్రజాజ్యోతి) :** కొత్తూరు మండలంలో పెంజర్ల శ్రీ స్వయంభు అనంతపద్మనాభ స్వామి ఆలయానికి మహేశ్వరం మండలం నల్లచెరువు తాండకు చెందిన దాత దన్నాడ వెంకటేష్ యాదవ్ ఆవు,దుడను ఆలయ కమిటీ చైర్మన్ బెజవాడ అనిత రెడ్డి,మాజీ జెడ్పిటిసి మామిడి శ్యాంసుందర్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో ప్రసిద్ధిగాంచిన అనంత పద్మనాభ స్వామి ఆలయానికి అందజేసినందుకు ఆయన ఎంతో సంతోషపడ్డారు. ఈ కార్యక్రమంలో పాత్లావత్ సందీప్ నాయక్,తదితరులు పాల్గొన్నారు.

# స్పెషల్ డ్రైవ్స్ ప్రత్యేక తనిఖీలు : డైరెక్టర్ షాన్ వాజ్ ఖాసిం

- ఏడాదిలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో మంచి ఫలితాలు
- ఎక్సైజ్ శాఖలో తనదైన ముద్ర వేసుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షాన్‌వాజ్ ఖాసీం..





**శేరిలింగంపల్లి,ఏప్రిల్ 29 (ప్రజాజ్యోతి) :** ఐఏఎస్,ఐపీఎస్ అధికారులు తాము పని చేసే కాలంలో తనదైన ముద్ర వేసుకోవడానికి కృషి చేస్తూ ఉంటారు.ఎక్సైజ్ శాఖలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ గా షాన్‌వాజ్ ఖాసీం ఏడాది కాలం పని చేసి బదిలీ పై వెళ్లనున్నారు. 2025 మే 1 నుంచి 30 ఏప్రిల్ 2026 వరకు ఎక్సైజ్ శాఖలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా షాన్‌వాజ్ ఖాసిం కొనసాగారు.విధుల్లో చేరిన మొదటి రోజు నుంచి నిత్యం ఉదయం 9 గంటలకు జూమ్ మీటింగ్‌లో ఎక్సైజ్ డీసీలతోనూ,ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యకలాపాలపై వాకబు చేయడంతో క్రైమ్ కంట్రోల్‌కు తగిన సూచనలు సలహాలు ఇస్తూ ఉండేవారు.మరో ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో ఉండే నాలుగు స్టేట్ టాస్క్‌ఫోర్స్ టీమ్‌లకు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయడం,నెలవారిగా వారి పనితీరుపై సూచనలు ఇవ్వడం చేస్తూ ఉండేవారు. వీటితోపాటు డ్రగ్స్ కంట్రోల్‌కు ఎన్‌డీపీఎల్ (నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్)కు అడ్డు కట్ట వేయడం, గంజాయి అమ్మకాలు, రవాణ, వినియోగంపై ప్రత్యేక శ్రద్ధతో పట్టు కోవడానికి ప్రణాళికలు వేసేవారు. ప్రతి నెలలో ఎన్‌డీపీఎల్, ఎన్‌డీపీఎస్, నాటుసారా తయారీ, విక్రయాలపై నిరంతర నిఘా పర్యవేక్షణ డైరెక్టర్‌గా చేసేవారు. వీటితోపాటు డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్‌గా కూడ షానవాజ్ ఖాసీం తనదైన ముద్ర వేసుకున్నారు. తన ఆయాంలో ఎక్సైజ్ శాఖలో ఏడాదిగా చేపట్టిన తనిఖీల నివేదికలను తయారు చేయించి విడుదల చేశారు.ఎన్‌డీపీఎస్..ఏడాదిలో ఎన్‌డీపీఎస్ కింద గంజాయి,హషీష్ అయిల్, హెరాయిన్, కొకైన్,ఎండిఎంఎ, ఎలఎస్‌డీ, ఓపీఎం 1275 కేసులను రిజిస్టర్ చేశారు.2298 మందిని అరెస్టు చేశారు.585 వాహనాలను సీజ్ చేశారు.ఎన్‌డీపీఎల్.. ఏడాదిలో 1148 కేసులు నమోదు చేసి 410 మందిని అరెస్ట్ చేసి, 1148 లీటర్ల లిక్కర్‌ను సీజ్ చేశారు.51 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.అనుమతి లేకుండా లిక్కర్ అమ్మకాలు చేపట్టిన 3910 మందిపై 4074 కేసులు నమోదు చేసి 19,492 లీటర్ల లిక్కర్‌ను,14,458 లీటర్ల బీర్లను స్వాధీనం చేసుకున్నారు.గుడుంబాపై స్పెషల్ డ్రైవ్స్..నాటు సారా తయారీ,అమ్మకాలు, రవాణపై దాడులు నిర్వహించి 15,372 కేసులు నమోదు చేశారు.3,68,838 కేజీల నల్ల బెల్లాన్ని,66,097 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా 98 కేసుల్లో 126 మందిని అరెస్టు చేసి 48 వాహనాలను స్వాధీనం చేసుకొని 109 గంజాయి మొక్కలను,428 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

ఎన్‌డీపీఎల్‌లో భాగంగా 69 మందిపై కేసులు నమ ఓదు చేసి 957 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నారు.మెదక్ నర్సపూర్‌లో రూ. 40 లక్షల విలువ చేసే 783 మద్యం బాటిళ్లను పట్టుకోవడం. సూర్యపేట్ జిల్లాలోని హుజూర్‌నగర్‌లో నకిలీ మద్యం తయారీ రాకెట్‌ను పట్టుకోవడం, రెక్టిఫైడ్ స్పిరిట్, కారు, ఇథనాల్, లెబుల్‌ను, లెబుళ్లు తయారు చేసే మిషన్లను, 31 వేల లీటర్ల మద్యాన్ని పట్టుకోవడం హైలెట్‌గా నిలిశాయి.

ఇతర రాష్ట్రాల్లో ఉన్న నిందితులను పట్టుకరావడం కూడ జరిగింది. పాల్వంచలో 16 కేజీల గంజాయి తో పాటు ఆరోపిస్తోళ్లను 40 బుల్లెట్లను స్వాధీనం చేసుకోవడం ఎక్సైజ్ చరిత్రలో తొలిసారి ఇది.షానవాస్ కాసిం అయామ్‌లోనే జరిగింది. సంతృప్తి నిచ్చింది.. షాన్‌వాజ్ ఖాసీం,ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్, హైదరాబాద్.ఒక వైపు డ్రగ్ కంట్రోల్‌లోను, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంగా ఏడాదిగా పని చేసిన కాలం సంతృప్తి నిచ్చింది.ప్రభుత్వ అదేశాల మేరకు డ్రగ్స్‌ను,గంజాయిని, నాన్‌డ్యూటి పెయిడ్ లిక్కర్‌ను అరి కట్టడంలో మంచి ఫలితాలను సాధించాం. డ్రగ్స్ కంట్రోల్,ఎక్సైజ్ శాఖలో నా అదేశాల మేరకు అందరు బాగా పని చేశారు.

## తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న కొత్తూరు మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్ కుటుంబ సభ్యులు



**కొత్తూర్ ఏప్రిల్ 29 (ప్రజా జ్యోతి) :** కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామిని కొత్తూరు మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్ బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేంకటేశ్వరుడి కృపా కటాక్షాలతో సర్పంచిగా గెలుపొందానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకొని మొక్కు తీర్చుకున్నామన్నారు. పెంజర్ల ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆ ఏడుకొండల స్వామిని కోరుకున్నానని ఆయన వెల్లడించారు.

## ఎస్ ఎస్ సి ఫలితాల్లో సిద్ధార్థ విద్యాసంస్థల విజయదుందుభి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 29 (ప్రజాజ్యోతి ): బుధవారం ప్రకటించిన పదవ తరగతి ఫలితాల్లో స్థానిక నగరంలోని సిద్ధార్థ విద్యాసంస్థల విద్యార్థులు 10వ తరగతి పరీక్షల ఫలితాలలో విజయదుందుభి మోగించారు. 452 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 100 శాతం ఉత్తీర్ణత సాధించి 592 మార్కులతో కె. విశ్వక్సేన్ జిల్లా టాపర్గా నిలిచి ప్రభంజనం సృష్టించాడు. 570 మార్కులకు పైగా 31 మంది విద్యార్థులు, 560 మార్కులకు పైగా 74 మంది విద్యార్థులు, 550 పైగా 122 మంది విద్యార్థులు



మార్కులు సాధించి సిద్ధార్థ కీర్తి పతాకాన్ని గగన వీధుల్లో మరోసారి ఎగురవేశారు. సిద్ధార్థ 30 సంవత్సరాల ప్రస్థానంలో ప్రతీ నలుగురు విద్యార్థులకు ఒక్క విద్యార్థి చొప్పున 550 పైగా మార్కులు సాధించడం గర్వకారణం. అంతేకాకుండా ఐ.ఐ.టి, నీట్ విభాగాలలో సిద్ధార్థ పాఠశాల విద్యార్థులు ముందంజలో ఉండడం విశేషనీయం. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి ఉత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులను అభినందించి, హర్షం ప్రకటించారు. ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ భవిష్యత్తులో అత్యున్నత స్థాయి అధిరోహించి, కన్న తల్లిదండ్రులకు, విద్యనేర్పిన పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు తీసుకొనిరావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డిగారు, డైరెక్టర్ స్వప్న శ్రీపాల్ రెడ్డిగారు, ఉపాధ్యాయ బృందం, మరియు తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## పదవ తరగతి ఫలితాల్లో జాన్సన్ కోరా పాఠశాల విజయ ధింధుబి

కరీంనగర్ టౌన్,ఏప్రిల్ 29( ప్రజాజ్యోతి): బుధవారం విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో నగరంలోని జాన్సన్ కోరా పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థులు 587, 581, 580, 577, 575, 570, 565, 564,





563, 558, 557, 556, 555, 554, 552, 551, 550 మార్కులు సాధిస్తూ మెరుగైన ఫలితాలు నమోదు చేశారు.ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో పాఠశాల యాజమాన్యం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించింది. పాఠశాల చైర్మన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాం రెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగల సంతోష్ రెడ్డి విద్యార్థులకు పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ ఎస్వీజేసీ విద్యా సంస్థ ఎప్పటికప్పుడు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం కృషి చేస్తుందని తెలిపారు. విద్యార్థుల విజయానికి తోడ్పడిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు"కార్యక్రమం

చొప్పదండి, ఏప్రిల్ 29 (ప్రజా జ్యోతి): చొప్పదండి మండలంలో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు " అనే కార్యక్రమం మే 1 న చొప్పదండి, మే 5న వెదురుగట్ట, మే 6 తేదీ అర్నకొండ, మే 8 న రుక్మాపూర్ గ్రామాలలో నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి మమత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు నేరుగా రైతులకు తగిన సలహాలు, సూచనలు ఇస్తారని పేర్కొన్నారు. గ్రామాలకు వచ్చి వ్యవసాయంలోమెలకువలు ,చేపట్టవలసిన శాస్త్రీయ పద్ధతుల గురించి వివరిస్తారని చెప్పారు. కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని వ్యవసాయంలో మెలకువలు తెలుసుకొని వివిధ శాస్త్ర పద్ధతులను నేర్చుకొని కార్యక్రమంను విజయవంతం చేయాలని కోరారు.

## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం ఘనంగా నిర్వహణ

ముస్తాబాద్, ఏప్రిల్ 29( ప్రజా జ్యోతి): ముస్తాబాద్ పట్టణ కేంద్రంలో మన కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం క్రింద ఆకుల నరేష్ నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటికి గృహప్రవేశం కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి విచ్చేసి గృహప్రవేశాన్ని ప్రారంభించి, లబ్ధిదారునికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## పదవ తరగతి ఫలితాల్లో పారమిత విద్యార్థుల అత్యున్నత ప్రతిభ

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 29( ప్రజాజ్యోతి ): స్థానిక పారమిత ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈ సంవత్సరం పదవ తరగతి ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచారు. తాజాగా విడుదలైన 2025–26 విద్యాసంవత్సర ఫలితాల్లో పాఠశాల




విద్యార్థులు ఎప్పటిలాగే అత్యుత్తమ ఫలితాలు సాధించి మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. పారమిత విద్యా సంస్థ స్థాపించి 30 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వచ్చిన ఈ ఫలితాలు యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థుల్లో ఆనందాన్ని నింపాయి. ఈ ఫలితాలు పారమిత యొక్క స్టేట్ బోర్డు బ్రాంచ్‌కు చెందినవిగా అధికారులు తెలిపారు. ప్రతి విద్యార్థి ప్రతిభను వెలికితీయడం సంస్థ ప్రధాన లక్ష్యమని మరోసారి నిరూపితమైంది.ఈ ఫలితాల్లో రాచమల్ల ఆధ్య, రామక కార్తికేయ తలా 583 మార్కులు సాధించగా, గట్టు సంప్రీతి 582 మార్కులతో మెరిసింది. మొత్తం 84 మంది విద్యార్థులు 90 శాతం పైగా, 173 మంది 80 శాతం పైగా, 198 మంది 70 శాతం పైగా మార్కులు సాధించారు. అలాగే 99 శాతం మంది విద్యార్థులు 60 శాతం పైగా మార్కులు సాధించి 100 శాతం ఉత్తీర్ణతను నమోదు చేశారు. సబ్జెక్ట్ వారీగా గణితం, సాంఘీక శాస్త్రం, తెలుగు విషయాల్లో 100కు 100 మార్కులు, ఆంగ్లం మరియు సామాన్య శాస్త్రంలో 99, హిందీలో 98 మార్కులు అత్యధికంగా నమోదయ్యాయి. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డా. ఇనుగంటి ప్రసాదరావు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. అలాగే పాఠశాలకు సహకరించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, అనుకర్ రావు, రస్మిత, వినోదరావు, రాకేశ్, వి.యు.యం. ప్రసాద్, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, బాలాజీ, కవిత, సమన్వయకర్త శ్రీనాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎస్ ఎస్ సి ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థుల విజయదుందుభి

కరీంనగర్ బ్యూరో,ఏప్రిల్ 29( ప్రజాజ్యోతి ) తెలంగాణ రాష్ట్ర పదవ తరగతి ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యాసంస్థల విద్యార్థులు మరోసారి అద్భుత ప్రతిభ కనబరిచి విజయదుందుభి మోగించారు. ఈ సందర్భంగా వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీ టాట్స్ ప్రాంగణంలో అభినందన సభ నిర్వహించారు.






ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా విద్యార్థులు సంచలనాత్మక ఫలితాలు సాధించడం సంస్థ విద్యా విధానానికి నిదర్శనమని అన్నారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని, తరగతి గదిలో బోధించిన అంశాలను సమగ్రంగా అర్థం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు.ఈ ఫలితాల్లో ఆర్. సాత్విక్ 589 మార్కులతో అగ్రస్థానంలో నిలవగా, ఓ. ఆద్య, టి. రాజు, బి. అక్షిత్ రెడ్డి తలా 588 మార్కులు సాధించారు. మొత్తం 1274 మంది విద్యార్థుల్లో 1026 మంది 500 పైగా మార్కులు సాధించడం విశేషం. 48 మంది విద్యార్థులు 580 పైగా, 334 మంది 560 పైగా మార్కులు సాధించారు.విద్యార్థుల విజయానికి అహర్నిశలు శ్రమించిన ఉపాధ్యాయులకు డాక్టర్ నరేందర్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే తమ పిల్లలకు నిరంతరం ప్రోత్సాహం అందిస్తున్న తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధింపజేసినందుకు నరేందర్ రెడ్డి ని తల్లిదండ్రులు ఘనంగా సత్కరించారు

## తీర్మానాలకే పరిమితమైన ప్రజా సమస్యలు

ముస్తాబాద్, ఏప్రిల్ 29( ప్రజాజ్యోతి): ముస్తాబాద్‌లో నిర్వహించిన గ్రామ సభ ఉద్రిక్తతలకు దారితీసింది. గ్రామంలోని ప్రధాన సమస్యలపై స్పష్టమైన పరిష్కారాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. సభ కొనసాగుతున్న సమయంలోనే పలువురు గ్రామస్తులు మధ్యలోనే ప్రాంగణాన్ని విడిచిపెట్టి వెళ్లిపోవడం గమనార్హం. గ్రామంలో చాలా కాలంగా కొనసాగుతున్న సమస్యలపై గ్రామస్తులు, వివిధ పార్టీల నాయకులు ప్రశ్నలు లేవనెత్తినా, ప్రతి ప్రశ్నకు “కమిటీ వేస్తాం... చర్చిస్తాం” అనే సమాధానాలకే పరిమితం కావడంతో అసంతృప్తి వెల్లువెత్తింది. ముఖ్యంగా ఇందిరమ్మ కాలనీలో అక్రమ నిర్మాణాల అంశంపై ఘాటైన చర్చ జరిగింది. దీనిపై గ్రామస్తులు స్పష్టత కోరినా, సర్పంచ్ నుంచి ఖచ్చితమైన చర్యలపై హామీ రాకపోవడం ఆగ్రహానికి దారితీసింది. ఇదే సమయంలో, కొంతమంది స్థానిక మీడియా ప్రతినిధులు కూడా కబ్జాల్లో పాల్గొన్నట్టు తన దృష్టికి వచ్చిందని సర్పంచ్ వ్యాఖ్యానించడం వివాదాస్పదంగా మారింది. అయితే ఆ విలేకరి ఎవరన్న దానిపై స్పష్టత ఇవ్వకపోవడం మరిన్ని అనుమానాలకు తావిచ్చింది. గ్రామంలోని లే–అవుట్‌ల వివరాలు, జీపీకి సమర్పించిన స్థలాల అంశంపై అడిగిన ప్రశ్నలకు కూడా సరైన సమాధానాలు రాకపోవడం ప్రజలను నిరాశకు గురి చేసింది. అంతేకాకుండా, పంచాయతీ సెక్రటరీ సమాధానం ఇవ్వడానికి లేచిన సమయంలో సర్పంచ్ అడ్డుకోవడం, ఈఓ కూర్చోవడం సభలో చర్చనీయాంశమైంది.
అధికార వ్యవహారంలో ఈ విధానం సరైంది కాదని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. సభ చివర్లో బోర్లు, మోటార్లు, తాగునీటి సమస్యలపై సర్పంచ్–ఉప సర్పంచ్ మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడం ఉద్రిక్తతను మరింత పెంచింది. మొత్తంగా, ప్రజా సమస్యలకు పరిష్కారం చూపాల్సిన గ్రామ సభ తీర్మానాలకే పరిమితమవడంతో ప్రజల్లో నిరాశ, అసహనం పెరిగినట్లు స్పష్టంగా కనిపిస్తోంది.

## సర్పంచుల అవమానంపై చర్యలకు ఉన్నతాధికారుల ఆదేశం

### టీపిసిసి ఎస్సి డిపార్ట్మెంట్ అట్రాసిటీ రాష్ట్ర ఇంచార్జ్ తిప్పారపు సంపత్

సైదాపూర్ ఏప్రిల్ 29 (ప్రజా జ్యోతి): హుజురాబాద్ మండలం సింగపూర్ గ్రామంలో



సైదాపూర్,వీణవంక రెండు మండలాల సర్పంచులకు శిక్షణ తరగతుల సందర్భంగా మహిళా, ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మైనార్టీ సర్పంచులకు జరిగిన అవమానంపై ఉన్నతాధికారులు స్పందించారు. బాధ్యులైన అధికారులపై విచారణ జరిపి, కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా కమిషన్ మరియు పంచాయతీరాజ్ కమిషనర్ కరీంనగర్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించినట్లు టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ అట్రాసిటీ రాష్ట్ర ఇన్‌చార్జ్ తిప్పారపు సంపత్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కీలక అంశాలను ప్రస్తావించారు. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న సర్పంచులను నిలబెట్టి, ప్రభుత్వ అధికారులు కుర్చీలలో కూర్చుని ఫోటోలు దిగడం వారి అహంకారానికి నిదర్శనమని, ఇది ముమ్మాటికీ రాజ్యాంగ విరుద్ధమని ఆయన మండిపడ్డారు. ఈ ఘటనపై గతంలోనే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పంచాయతీరాజ్ కమిషనర్, మహిళా కమిషన్ మరియు మానవ హక్కుల కమిషన్‌కు పక్కా సాక్ష్యాలతో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మహిళా సర్పంచులకు జరిగిన అవమానాన్ని తీవ్రంగా పరిగణించిన మహిళా కమిషన్, దీనిపై తక్షణమే నివేదిక సమర్పించాలని కరీంనగర్ కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది. పంచాయతీరాజ్ రాష్ట్ర కమిషనర్ కూడా ఈ విషయంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, పూర్తిస్థాయి



విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారని సంపత్ పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజా ప్రతినిధులకు అవమానం జరిగితే సహించేది లేదు. అధికారుల వైఖరి మార్చుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం. మహిళా, అణగారిన వర్గాల ఆత్మగౌరవాన్ని కాపాడటమే మా లక్ష్యం అని తిప్పారపు సంపత్ అన్నారు.

## పట్టణ నిరాశ్రయుల షెల్టర్‌ను సందర్శించిన మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్

కరీంనగర్ బ్యూరో,ఏప్రిల్ 29( ప్రజాజ్యోతి ): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీమతి జి. స్వరూప రాణి బుధవారం పట్టణ నిరాశ్రయుల కోసం నిర్వహిస్తున్న షెల్టర్ ఫర్ అర్బన్ హోంలెస్ ను సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె షెల్టర్‌లో అందిస్తున్న సౌకర్యాలను సమగ్రంగా పరిశీలించారు. నివాస ఏర్పాట్లు, పరిశుభ్రత, త్రాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, భద్రత వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. రాత్రి సమయంలో సుమారు 25–30 మంది



నిరాశ్రయులు అక్కడ నివసిస్తున్నట్లు గుర్తించారు.అక్కడ నివసిస్తున్న నిరాశ్రయులతో ప్రత్యక్షంగా మాట్లాడిన ప్రాజెక్ట్ డైరెక్టర్ వారి సమస్యలు, అవసరాలు, ఆరోగ్య పరిస్థితుల గురించి ఆరా తీశారు. షెల్టర్ నిర్వహణలో భాగస్వామ్యంగా ఉన్న ఎన్జీఓ ప్రతినిధులతో సమావేశమై సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని సూచించారు.నిరాశ్రయులకు సురక్షిత వాతావరణం కల్పించడం, అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు. అలాగే రాత్రి సమయంలో మరింత మంది నిరాశ్రయులను గుర్తించి షెల్టర్‌కు చేర్చేలా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు.
నగరంలో ఎవరూ వీధుల్లో నిద్రించకుండా చూడటం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆమె తెలిపారు.

## ఎస్ఎస్ఆర్ హై స్కూల్ టాపర్‌గా బుర్ర శివకారుణ్య

తిమ్మాపూర్ , ఏప్రిల్ 29 (ప్రజాజ్యోతి ): పదో తరగతి ఫలితాల్లో తిమ్మాపూర్ మండలం పర్లపెల్లి గ్రామానికి చెందిన బుర్ర శివకారుణ్య ప్రతిభ కనబరిచి ఎస్ఎస్ఆర్ హై స్కూల్ టాపర్‌గా నిలిచింది.ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు శివ కారుణ్య ను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.పాఠశాల కరెస్పాండంట్ భర్మయ్య విద్యార్థి విజయానికి తోడ్పడిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు కూడా అభినందనలు తెలిపారు.



## అన్నార్తులకు మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ అన్నదానం

వేములవాడ,ఏప్రిల్,29:ప్రజాజ్యోతి. ట్రస్టు ఆధ్వర్యంలో దాతల సహ కారంతో నిర్వ హిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా బుధవా రం రోజున లక్ష్మీ గణపతి రాజన్న భీమేశ్వర ఆలయాల వద్ద పేదల కు అన్నార్తులకు అన్నదాన కార్య క్రమం నిర్వహించడం జరిగిందని నేటిఅన్నదాత



లుగా పెళ్ళిరో జు సందర్భంగా వొడ్యాల వేణు హరిత దంపతు లు మీ ఇంట్లో జరిగే శుభకార్యాలకు ఇతరత్ర కార్యక్రమాలకు పేదలకు అన్నార్తు లకు ఒక్కపూట అన్నదానం చే యల నుకునే దాతలు ట్రస్టు స భ్యుల ను గాని ట్రస్ట్ నంబరు 92 4693 9388కు సంప్రదించాలని ట్రస్టు నిర్వాహకులు మధు మహే ష్ కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు వొడ్యాల వేణు ప్రతాప నటరాజు సగ్గు రాహుల్ పసుల శ్రీనివాస్ పిన్నింటి హనుమాండ్లు మఠం శి వ కుమార్ తదితరులు పాల్గొ న్నారు.

## విద్యార్థుల బకాయిలు చెల్లించే వరకు పోరాటం ఆపేది లేదు

చొప్పదండి, ఏప్రిల్ 29 ( ప్రజాజ్యోతి): ఫీజు రీయింబర్స్మెంట్ పెండింగ్ బకాయిలను వెంటనే రిలీజ్ చేయాలని డిగ్రీ కళాశాలల బంద్ కు పిలిపిస్తే ఉదయం ఆరు



గంటలకి అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించడం బాధాకరమని బిఆర్ఎస్ చొప్పదండి నియోజకవర్గం యువజన విభాగం ఇంచార్జ్ బంధారపు అజయ్ కుమార్ గౌడ్ అన్నారు. విద్యార్థుల కోసం పోరాటం చేస్తున్న తమను అణిచివేసే దోరణిలో ప్రవర్తించడం తగదని ,ఇప్పటికైనా విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని కోరారు. బడుగు బలహీన వర్గాలకు సంబంధించిన విద్యార్థులను చదువుకు దూరం చేయడమే లక్ష్యంగా ఈ ప్రభుత్వం పని చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వానికి నిజంగా పేద విద్యార్థుల పైన చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని, విద్యార్థులకు సంబంధించిన బకాయిలను వెంటనే కళాశాలలకు చెల్లించాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో మండల అధ్యక్షుడు యువరాజ్, పట్టణ అధ్యక్షుడు నరేష్, పెద్దెల్లి అనిల్ ఉన్నారు.

## పదవ తరగతి ఫలితాల్లో మధిర డివిజన్ స్థాయిలో సత్తా చాటిన శ్రీ భాస్కర మెమోరియల్ స్కూల్







**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** తెలంగాణ ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఎస్ ఎస్ సి 2026 ఫలితాలలో మధిర డివిజన్ (మధిర, ఎర్రుపాలెం మండలాలు) లో మీనవోలు శ్రీ భాస్కర మెమోరియల్ స్కూల్ మొదటి స్థానం లో నిలిచిందని పాఠశాల కరస్పాండెంట్ బట్ల పెనుమర్తి సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలియజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్ ఎస్ సి ఫలితాలలో శ్రీ భాస్కర మెమోరియల్ స్కూల్ 581 మార్కులతో మధిర డివిజన్ పరిధిలో మొదటి స్థానంలో నిలిచిందనీ పింగళి భువనేశ్వర్ రెడ్డి 581 తమ్మ విష్ణు ప్రియ 569 ఐలూరి ప్రియదర్శిని 562 ఎర్రంశెట్టి హాసిని 561 విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి మధిర డివిజన్ లోనే అగ్రస్థానంలో నిలిచారని. సుమారు 30 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారని మొత్తం 54 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుగా 100% ఉత్తీర్ణత సాధించారనీ ఆయన తెలియజేశారు. అత్యధిక మార్కులు సాదించిన విద్యార్థులను మండల విద్యాశాఖ అధికారి ఐ మురళీమోహన్ రావు డైరెక్టర్ వెంకటేశ్వరావు ప్రిన్సిపాల్ వై శ్రీదేవి ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు తదితరులు అభినందించారు.

## నాగులవంచ వసతి గృహంలో పదిలో ఉత్తమ ఫలితాలు



**చింతకాని ఏప్రిల్29 ప్రజాజ్యోతి ప్రతినిధి** :షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ సమీకృత బాలుర వసతి గృహం నాగులవంచలో పదవ తరగతి ఫలితాల గురించి వసతి గృహ సంక్షేమ అధికారి కొత్త వెంకటేశ్వరరావు తెలియజేశారు ఈ వసతి గృహం నుండి 15 మంది 10వ తరగతి పరీక్షలు రాయగా 15 మంది విద్యార్థులు 100% ఉత్తీర్ణులైనట్లుగా తెలియజేశారు అదేవిధంగా గత సంవత్సరం కూడా పదవ తరగతిలో 100% ఫలితాలు సాధించినట్టు తెలియజేశారు అదేవిధంగా ఈ సంవత్సరం అడ్మిషన్ల కొరకు సీతంపేట, తిరుమలాపురం, తిమ్మినేనిపాలెం గ్రామాలలో హాస్టల్ బాట కార్యక్రమం నిర్వహించినాము ఈ సందర్భంగా గ్రామాలలో ఎస్సీ ఎస్టీ, బీసీ ఓసి విద్యార్థులను మూడవ తరగతి నుండి పదవ తరగతి వరకు అడ్మిషన్లు జరుగుచున్నవి కావున తల్లిదండ్రులకు తెలియజేయునది ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత వసతి సౌకర్యాలను ఉపయోగించుకుని తమ పిల్లల ఉన్నతికి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలంటే సంక్షేమ హాస్టల్లో విద్యార్థులను చేర్పించాలని ప్రచారం నిర్వహిస్తున్నారు . ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారి కొత్త వెంకటేశ్వరరావు మరియు సిబ్బంది దిలీప్ వెంకటేశ్వర్లు మహేందర్ జయసింహ పాల్గొన్నారు

## కొత్త ఇంటికి శంకుస్థాపన చేసిన గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు

**చింతకాని ఏప్రిల్ 29ప్రజాజ్యోతి ప్రతినిధి** :మండల పరిధిలో తిర్లాపురం గ్రామంలోని బుధవారం నాడు ఐతం కాటయ్య మంగమ్మ దంపతులు నూతన ఇంటి నిర్మాణం కొరకుశంకుస్థాపన చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ చాపల మడుగు వీరబాబు హాజరై భూమి పూజ చేసి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ..., సొంత ఇల్లు అనేది ప్రతి పేదవాడి జీవితకాల స్వప్నం. ఎన్నో ఏళ్ల నిరీక్షణ తర్వాత ఆ కల నిజమవుతున్నప్పుడు, ఆనందంతో కళ్లలో నీళ్లు తిరగడం సహజం. ఈ సందర్భంగా ఇంటికి యజమానికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తిర్లాపురం ఆర్ సి ఎం చర్చి రాఫెల్ ఫాదర్, తిర్లాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు, బల్లి జయరాజు, ఐతం జోసఫ్, ఐతం సైదులు, బెల్లంకొండ కళ్యాణ్, చాపల మడుగు నాగేష్,ఐతం నాగేశ్వరావు, ఐతం సురేష్, పెద్ద మల్లయ్య, కొమ్ము సుక్కమ్మ, చాపలమడుగు మేరమ్మ, ఐతం మేరమ్మ, పుట్ట సురేష్, తాపీ మేస్త్రి, బంధువులు, మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

### యలమద్ది సీతమ్మ పార్థివదేహానికి

## నివాళులర్పించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు

– నూతి సత్యనారాయణ, మాజీ అధ్యక్షులు పువ్వాళ దుర్గాప్రసాద్

**చింతకాని ఏప్రిల్ 29ప్రజాజ్యోతి ప్రతినిధి** :మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు యలమద్ది ప్రసాద్ గారి తల్లి, జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ కార్యదర్శి కొప్పుల గోవిందరావు గారి అమ్మమ్మ. సీతమ్మ గారు మృతి చెందారు వారి పార్థివ దేహానికి నివాళులర్పించి, సానుభూతి తెలిపిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, మాజీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు మదుపల్లి భాస్కర్, మత్కేపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బందెల నాగార్జున, ఎస్కే కాసిం, జిల్లా కాంగ్రెస్ నాయకులు కన్నెబోయిన గోపి,చింతకాని సర్పంచ్ కిలారు మనోహర్, మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కూరపాటి కిషోర్,పాతర్లపాడు మాజీ ఎంపీటీసీ బొర్రా ప్రసాద్,చింతకాని యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రామకృష్ణ (ఆర్కే ) తాళ్లూరి రమేష్,సిలివేరు సైదులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## అక్షర విజయానికి అభినందన మందారాలు

– విద్య అనేది ప్రపంచాన్ని మార్చగలిగే అత్యంత శక్తివంతమైన ఆయుధం

– నెల్సన్ మండేలా



**చింతకాని ఏప్రిల్ 29ప్రజాజ్యోతి ప్రతినిధి,**:చదువు ద్వారానే గౌరవం, గుర్తింపు మరియు సమాజ మార్పు సాధ్యమని నమ్మి, ఈరోజు విడుదలైన ఎస్ ఎస్ సి ఫలితాలలో 600 మార్కులకు గాను 554 మార్కులు సాధించి మేటిగా నిలిచిన మా నాయకుడు నారపోగు నాగయ్య గారి కుమార్తె నారపోగు లోహిత సనా కి హృదయపూర్వక అభినందనలు. బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పినట్లు "చదువుకో, సమీకరించు, పోరాడు" అనే మాటలను నిజం చేస్తూ.. మధ్యలో అనారోగ్యం ఇబ్బంది పెట్టినా, శ్రీ గ్లోబల్ స్కూల్ యాజమాన్యం వారి బోధన, పర్యవేక్షణ లో పట్టు వదలని విక్రమార్కుడిలా శ్రమించి నీవు సాధించిన ఈ విజయం ఎందరికో స్ఫూర్తిదాయకం. ఒక యజ్ఞంలా నీవు గడిపిన నిద్రలేని రాత్రుల కష్టానికి తగిన ప్రతిఫలం దక్కింది. నిజంగా నీవు "తండ్రికి తగ్గ తనయురాలివి" అని నిరూపించుకున్నావు. ఇది నీ విజయ ప్రస్థానానికి ఒక అద్భుతమైన ఆరంభం మాత్రమే. నీ కృషి, పట్టుదల ద్వారా భవిష్యత్తులో మన ఊరికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని, నీ తల్లిదండ్రులు గర్వంగా తల ఎత్తుకునేలా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నాము. నీవు పొందిన ఈ మార్కులు కేవలం నీ అభివృద్ధికి మాత్రమే కాకుండా, సమాజంలో అవసరంలో ఉన్న వారికి సేవ చేసే దిశగా నిన్ను నడిపించాలని కోరుకుంటున్నాము. **విద్యతోనే ఏదైనా సాధ్యమని నిరూపించిన లోహిత సనాకు మరోసారి శుభాకాంక్షలు ఆల్ ది బెస్ట్ లోహిత సనా ఇట్లు బిఆర్ఎస్ సీతంపేట గ్రామ శాఖ**

# ఫలితం ఏదైనా బిడ్డలను అక్కున చేర్చుకోండి

– మార్కులు జీవితాన్ని శాసించలేవు

– సీనియర్ కాంగ్రెస్ నాయకులు వెంకటాపురం సర్పంచ్ బొగ్గుల గోవర్ధన్ రెడ్డి



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** తెలంగాణ ప్రభుత్వం బుధవారం పదవ తరగతి పరీక్షా ఫలితాలను విడుదల చేసిన నేపథ్యంలో విద్యార్థినీ విద్యార్థులను, తల్లిదండ్రులను ఉపాధ్యాయులను ఉద్దేశించి ఎర్రుపాలెం మండలం సీనియర్ కాంగ్రెస్ నాయకులు వెంకటాపురం సర్పంచ్ బొగ్గుల గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఫలితాలు మీ జీవిత గమనాన్ని శాసించేవి కావు, మీ సుదీర్ఘ ప్రయాణంలో ఇదొక చిన్న మలుపు మాత్రమేనని ఇటీవలి ఇంటర్మీడియట్ ఫలితాల తర్వాత కొన్ని నిండు ప్రాణాలు అర్ధాంతరంగా గాలిలో కలిసిపోవడం మమ్మల్ని తీవ్రంగా కలిచివేసింది మార్కులు తక్కువ వచ్చాయని లేదా విఫలమయ్యామని ప్రాణాలు తీసుకోవడం ఈ సమస్యకూ పరిష్కారం కాదు, అది మీ కుటుంబాలకు తీరని శోకాన్ని మాత్రమే మిగులుస్తుందనీ ఓటమి అనేది గెలుపుకు తొలిమెట్టు కావాలే తప్ప, జీవితానికి ముగింపు కాకూడదని ప్రతి విద్యార్థి గుర్తుంచుకోవాలనీ ముఖ్యంగా తల్లిదండ్రులకు మీ ఆశలను, అంచనాలను పిల్లలపై భారంగా మోపి వారిని ఒత్తిడికి గురిచేయకండనీ ఫలితం ఏదైనా సరే, మీ పిల్లలను ప్రేమగా అక్కున చేర్చుకోండి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపి మార్కుల కంటే మీ పిల్లల ప్రాణం, వారి చిరునవ్వు మీకు అత్యంత ముఖ్యం. గుర్తించి ఫలితాల తర్వాత పిల్లల ప్రవర్తనను నిశితంగా గమనించాలని వారు ఒంటరిగా ఉన్నా, మౌనంగా ఉన్నా వారి వెన్నంటి ఉండి ధైర్యం చెప్పాలని అవసరమైతే మీ పనులన్నీ పక్కన పెట్టి, ఒక రోజంతా వారితో గడిపి, వారి మనసులోని భయాన్ని పోగొట్టలని ఉపాధ్యాయులు కూడా ఈ సమయంలో విద్యార్థులతో సంభాషించి, ఫెయిల్యూర్ అనేది తాత్కాలికమేనని, భవిష్యత్తులో ఎన్నో అవకాశాలు ఉంటాయని భరోసా కల్పించాలనీ చదువులో వెనుకబడిన ఎందరో వ్యక్తులు పట్టుదలతో శ్రమించి నేడు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన స్థాయికి చేరుకున్నారన్న నిజాన్ని ఎవరూ మరువవద్దు పరీక్షల కంటే ప్రాణం గొప్పదనీ మీ వెనుక ఒక కుటుంబం ఉందని, మీ కోసం వారు తపిస్తున్నారని ఆలోచించాలని ఏ చిన్న ఆందోళన కలిగినా మీ తల్లిదండ్రులతో లేదా ఆత్మీయులతో పంచుకోవాలని ప్రతికూల ఫలితాలు వచ్చినా ధైర్యంగా ఎదుర్కొని ఉజ్వల భవిష్యత్తు వైపు అడుగులు వేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని గోవర్ధన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలపై కలెక్టర్ అంకిత్ ఆకస్మిక తనిఖీలు

– రైతులకు ఇబ్బందులు లేకుండా పారదర్శక కొనుగోలు ప్రక్రియకు ఆదేశాలు







**అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 29, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం ఆకస్మికంగా సందర్శించి, అక్కడ జరుగుతున్న కొనుగోలు ప్రక్రియను సమగ్రంగా పరిశీలించారు. కేంద్రంలో రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా స్వీకరిస్తున్నారా అనే విషయంపై ప్రత్యేకంగా దృష్టి సారించి, సంబంధిత అధికారులను వివిధ అంశాలపై ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ధాన్యంలో తేమ శాతాన్ని నిర్ధారించడానికి ఉపయోగిస్తున్న మాయిశ్చర్ కొలిచే యంత్రం పనితీరును పరిశీలించారు. తేమ శాతం నిర్ధారణలో ఎలాంటి లోపాలు లేకుండా ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా పరీక్షించి వెంటనే కొనుగోలు ప్రక్రియ కొనసాగించాలని అధికారులకు ఆదేశించారు. రైస్ మిల్లులకు ధాన్యం ట్యాగింగ్ విధానం, కొనుగోలు రిజిస్టర్ల నిర్వహణ, టోకెన్ పంపిణీ వ్యవస్థపై సమగ్ర సమాచారం సేకరించారు. టోకెన్లను సమయానికి జారీ చేసి రైతులు అనవసరంగా వేచి ఉండకుండా చూడాలని, ప్రతి రైతుకు పారదర్శకంగా సేవలు అందించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రంలో రికార్డుల నిర్వహణ ఖచ్చితంగా ఉండాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం రైతులకు మద్దతుగా చేపట్టిన ధాన్యం కొనుగోలు కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి, ప్రతి రైతు లాభపడేలా చూడటం అధికారుల బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం పెంట్ల గ్రామంలో ఇందిరమ్మ ఇల్లును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ స్వర్ణ, ఎంపిడిఓ మహాలక్ష్మి, ఎంపీఓ షబానా, మండల వ్యవసాయ అధికారి అనూష తదితరులు పాల్గొన్నారు.

## రైతుముంగిట 22 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

– పెనగడపలో ప్రారంభించిన ఎమ్మెల్యే కూనంనేని



**కొత్తగూడెం, ఏప్రిల్ 29 ( ప్రజాజ్యోతి )** నియోజకవర్గంలో రైతులకు ఊరట కలిగించేలా 22 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మంజూరయ్యాయని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. బుధవారం చుంచుపల్లి మండలం పెనగడప గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను ఐకేపీ ద్వారా కొనుగోలు చేస్తామని దళారులను నమ్మి తక్కువ ధరకు విక్రయించవద్దని సూచించారు. తూకంలో పారదర్శకత పాటించాలని తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని అధికారులకు ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, నీడ వంటి కనీస వసతులు కల్పించాలని చెల్లింపులు సకాలంలో రైతుల ఖాతాల్లో జమయ్యేలా పర్యవేక్షణ చేయాలని తెలిపారు. రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, ఎంపిడివో శుభాషిణి, తహసీల్దార్ నాగరాజు, సర్పంచ్ కారం సీతారాములు, ఉప సర్పంచ్ గోరె బాబు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళి, నాయకులు నీడలా సుధాకర్, కుంచం కుమార్, కట్ట సత్యనారాయణ, మేఘనాథం, తాజుద్దీన్, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 10 ఫలితాలలో మార్గదర్శిని ప్రభంజనం

**ఇల్లందు, ఏప్రిల్ 29, ప్రజాజ్యోతి:** రాష్ట్రవ్యాప్తంగా బుధవారం విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో పట్టణంలోని మార్గదర్శిని గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. జి.రిషిత 574/600 మార్కులు సాధించడం జరిగింది. అదేవిదంగా 30 మంది విద్యార్థులు 500 లకు పైగా మార్కులు సాధించారు. మార్గదర్శిని గ్రూప్ ఆఫ్ స్కూల్స్ లలో విద్యార్థుల పట్ల నిరంతరం శ్రద్ధ వహిస్తూ, చదువులో వెనుకబడిన వారిని ప్రోత్సహిస్తూ ముందుకు సాగడం వల్లనే అత్యుంజయ ఫలితాలు రావడానికి కారణం.



ఇంతటి ఘన విజయాన్ని సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పాఠశాల కరస్పాండెంట్ దమ్మలపాటి వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు యాదగిరి రాంబాబు, అర్వపల్లి రాధాకృష్ణ, పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు.

### భద్రాచలం త్రివేణి పాఠశాలలో

## పదవ తరగతి పరీక్ష ఫలితాల ప్రభంజనం




**భద్రాచలం టౌన్ , ఏప్రిల్ 29 , ప్రజాజ్యోతి** , త్రివేణి పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న కె.దర్శిని 579/600 మార్కులతో భద్రాచలం డివిజన్ టాప్ ప్లేస్ లో నిలిచింది. అదేవిధంగా పి. హర్షిణీప్రియ 574/600, కె.మనోహర్ రెడ్డి 572/600 , జిపిఎల్.అక్షయ 570/600 మరియు వి. సాయి సిరి 570/600 వంటి టాప్ మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. త్రివేణి పాఠశాలలో మొత్తం పదవ తరగతి విద్యార్థులు 82 మందికి గాను 51 మందికి పైగా 500 మార్కులతో విజయ డంకా మోగించారు. ఈ సందర్భంగా త్రివేణి స్కూల్ ప్రిన్సిపాల్ నిరుపమ మాట్లాడుతూ భద్రాచలం పట్టణంలోని పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో టాప్ ప్లేస్ లో నిలవటానికి సహకరించిన తల్లిదండ్రులకు మరియు బోధనా సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా ఇంత అత్యధిక శాతం మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులందరికి శుభాశీస్సులు అందించారు .త్రివేణి పాఠశాలలో ప్రతి సంవత్సరం పదవ తరగతి పరీక్ష ఫలితాలలో వారి యొక్క సత్తా చాటుతున్నందుకు ,ఈ ఘనవిజయానికి చక్కటి ప్రణాళికను రూపొందిస్తున్న యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏవో బాబురావు, వైస్ ప్రిన్సిపాల్ విమల, అకాడమిక్ ఇన్చార్జి నరేష్ ,క్యాంపస్ ఇన్చార్జి సురేష్ , సందీప్,తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థిని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజల అవసరాలతో వ్యాపారం చేస్తున్నారు

– బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్న పెట్రోల్, డీజిల్

– కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంధన సమస్యను తక్షణమే పరిష్కరించాలి

– గోకినేపల్లి ప్రభాకర్ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పాల్వంచ డివిజన్ కార్యదర్శి



**అశ్వారావుపేట, ఏప్రిల్ 29, ప్రజాజ్యోతి :** ప్రజల అత్యవసర అవసరాలను దృష్టిలో పెట్టుకోకుండా కొంతమంది వ్యాపారులు ఇంధనాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ అక్రమంగా విక్రయిస్తున్నారని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోకినేపల్లి ప్రభాకర్ ఆరోపించారు. పెట్రోల్, డీజిల్ కొరతను సృష్టించి అధిక ధరలకు అమ్ముతూ ప్రజలను దోచుకుంటున్నారని ఆయన విమర్శించారు. బుధవారం పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఇంధన లభ్యత తగ్గిపోవడంతో రైతులు, రవాణా రంగానికి చెందిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ నియంత్రణ లోపం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి ఇంధన సరఫరాను సక్రమంగా పర్యవేక్షించాలని, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే బాధ్యులపై కఠిన శిక్షలు విధించాలని కోరారు. ప్రజలకు అందుబాటులో సరైన ధరలకు పెట్రోల్, డీజిల్ అందేలా చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

### ఇంటర్లో ప్రతిభ చాటిన

## విద్యార్థినికి నగదు పురస్కారం అందజేత

శ్రీరామ లయన్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం

**భద్రాచలం టౌన్ , ఏప్రిల్ 29 , ప్రజాజ్యోతి,** భద్రాచలంకు చెందిన సత్తిబాబు, సుబ్బలక్ష్మి దంపతుల కుమార్తె జ్యోష్న ఇటీవల వెలువడిన ఇంటర్ ఫలితాల్లో 1000 మార్కులకు గాను 997 మార్కులు సాధించింది. దీంతో ఆమెను బుధవారం భద్రాచలం జీవన్ ఆసుపత్రి, శ్రీరామ లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ స్పందన రూ.10,000 నగదు పురస్కారం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్పందన మాట్లాడుతూ జ్యోష్న మంచి వైద్యురాలిగా రాణించి ఏజెన్సీ ప్రాంతంలో మంచి వైద్యం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు చల్లగుళ్ళ నాగేశ్వరరావు, కోశాధికారి భరత్‌కుమార్, సత్తిబాబు, సుబ్బలక్ష్మి, ప్రసాద్ పాల్గొన్నారు.



## ఎస్ఎస్సి ఫలితాల్లో శారద విద్యాలయం విద్యార్థుల ప్రతిభ

పరకాల, ఏప్రిల్ 29 (ప్రజాజ్యోతి)
పట్టణంలోని శారద విద్యాలయం హైస్కూల్లో 2025–2026 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఎస్.ఎస్.సి ఫలితాల్లో విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెల్లడించిన వివరాల ప్రకారం, మార్క



విగ్నేశ్వర్ 572/600 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచారు. దుస్స సిరివెన్నెల 569/600 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలవగా, పోతుగంటి సంజయ్ 567/600 మార్కులు సాధించారు. ఎండి గౌస్య సల్మా 560/600, కొంకటి రేష్వంత్ 560/600 మార్కులు, గోరంటాల రామ్ చరణ్ 559/600 సాధించి ప్రతిభ చాటుకున్నారు. మొత్తం 550 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 8 మంది ఉన్నారని తెలిపారు. అలాగే 550 పైగా మార్కులు సాధించిన వారు మొత్తం 40 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. పాఠశాల శాతం ఫలితాలు 100% నమోదు కావడం విశేషం. విద్యార్థుల విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే స్థాయి ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామని పాఠశాల యాజమాన్యం తెలిపింది.

## ముందస్తు చర్యలతో జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేదు

### కలెక్టర్ దీపక్ తివారి భరోసా

వికారాబాద్ ప్రతినిధి, ఏప్రిల్ 29(ప్రజా జ్యోతి): జిల్లాలో పెట్రోల్, డీజిల్‌కు ఎలాంటి కొరత లేదని, వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పెట్రోల్ పంపుల యాజమాన్యంతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇంధన



సరఫరా పరిస్థితి, ధరల ప్రదర్శన, వినియోగదారులకు అందిస్తున్న సేవల నాణ్యతపై సమగ్రంగా సమీక్షించారు. ఇంధన సరఫరా నిరంతరంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడా స్టాక్ లోపాలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలను స్పష్టంగా ప్రదర్శించడం, వినియోగదారులకు సరైన కొలతలతో ఇంధనం అందించడం తప్పనిసరి అని తెలిపారు. ఎటువంటి అక్రమాలు జరగకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులకు సూచించారు. అలాగే, జిల్లాలోని అన్ని పెట్రోల్ పంపుల వద్ద తహసిల్దార్, పోలీస్ సిబ్బంది కలిపి ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి నిరంతర తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. వినియోగదారులకు మర్యాదపూర్వక సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో ఎటువంటి ఇంధన కొరత లేకుండా సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ రాము నాయక్, డీఎస్ఓ సుదర్శన్, ఆర్డీవో వెంకట్ రెడ్డి, పెట్రోల్ పంపుల యజమానులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌తో కొత్త డీజీపీ ఆనంద్ భేటీ



మొదటిపేజీ తరువాయి..

నియంత్రణ, డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యం,పోలీస్ వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేసే అంశాలపై సీఎం ఈ సందర్భంగా పలు సూచనలు చేసినట్లు సమాచారం. గతంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా సమర్థవంతంగా పనిచేసిన అనుభవం ఉన్న సీవీ ఆనంద్, ఇప్పుడు రాష్ట్ర పోలీస్ బాస్ గా పగ్గాలు చేపట్టడంతో పోలీస్ శాఖలో సరికొత్త ఉత్సాహం కనిపిస్తోంది.సీఎం రేవంత్ రెడ్డి సీవీ ఆనంద్‌కు శుభాకాంక్షలు తెలుపారు. రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా విధులు నిర్వహించాలని సూచించారు. సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ (1991 బ్యాచ్)ను డీజీపీగా నియమిస్తూ సీఎస్ కే.రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుత డీజీపీ బి.శివధర్‌రెడ్డి ఏప్రిల్30న పదవీవిరమణ పొందనున్నారు. ఈ క్రమంలోనే మే 1న సీవీ ఆనంద్ నూతన డీజీపీగా బాధ్యతలు స్వీకరించనున్నారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారుల్లో సీవీ ఆనంద్ అత్యంత సీనియర్ ఐపీఎస్ అధికారి. ఇటీవలే యూపీఎస్సీ డీజీపీ పోస్టుకు అర్హులైన ఐపీఎస్‌ల జాబితాను రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం పంపిన విషయం తెలిసిందే. అందులో సీవీ ఆనంద్‌తోపాటు 1994 బ్యాచ్‌కు చెందిన వినాయక్ ప్రభాకర్ ఆప్టే, సౌమ్యామిశ్రా పేర్లు ఉన్నాయి. అయితే ఈ ముగ్గురిలో సీవీ ఆనంద్ అత్యంత సీనియర్ కావడంతో డీజీపీ హెడ్ ఆఫ్ పోలీస్ ఫోర్స్(–హెచ్‌ఓపీఎఫ్)గా నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి డీజీపీలు నియమితులైన అందరూ తొలుత ఇంచార్జి డీజీపీగాలు బాధ్యతలు నిర్వహించగా.. సీవీఆనంద్ మాత్రం పూర్తిస్థాయి డీజీపీగా నియమితులు కావడం గమనార్హం. డీజీపీగా 2028 జూన్ వరకు సీవీ ఆనంద్ కొనసాగనున్నారు.

# పది ఫలితాల్లో షైన్ విద్యార్థుల జైత్రయాత్ర

### రాష్ట్ర స్థాయిలో మెరిసిన విద్యా కుసుమాలు.. 362 మందికి 500పైగా మార్కులతో ప్రభంజనం

హనుమకొండ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 29, (ప్రజా జ్యోతి):
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించిన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో షైన్ విద్యాసంస్థల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు.
రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తూ మరోసారి తమ సత్తా చాటారు.మొత్తం 600 మార్కులకు గాను ఏ. అక్షర 588 మార్కులతో అగ్రస్థానంలో నిలిచింది. ఎల్. రేవంత్, ఎన్. అఫ్రోజ్ 586 మార్కులు, సమీరా నయీమ్ 585 మార్కులు సాధించారు.
వెలుదండి సీమ, జి. సంహిత, కే. సుమిత్ 584 మార్కులు, టి. హాసిని, ఏ. ప్రశాంతి, ఏ. సుశాంత్, సీహెచ్. సిరి 583 మార్కులు సాధించారు. వి. జాహ్నవి, మార్క శ్రీధన్ 582 మార్కులు, ఏ. హర్షిని 581 మార్కులు, పి. యతిన్, పి. హర్షిత 580 మార్కులు సాధించినట్లు విద్యాసంస్థల అధినేత మూగల కుమార్ యాదవ్ తెలిపారు.500కు పైగా




మార్కులు 362 మంది విద్యార్థులు సాధించగా, 302 మంది విద్యార్థులు 85 శాతానికి పైగా మార్కులు సాధించారు. ముఖ్యంగా గణితంలో విద్యార్థుల ప్రతిభ గర్వకారణమని నిర్వాహకులు పేర్కొన్నారు.ఐఐటీ ఫౌండేషన్, నీట్ కోచింగ్‌తో పాటు పదవ తరగతి పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని మూగల కుమార్ యాదవ్ తెలిపారు. ఇటీవల వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో కూడా రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానాలు సాధించామని అన్నారు.
ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారికి మార్గనిర్దేశం చేసిన అధ్యాపకులను అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మూగల రమ, సెక్రటరీ జక్కుల శ్రీనివాస్ యాదవ్, ఐఐటీ కోఆర్డినేటర్ మూగల రమేష్ యాదవ్, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చరిత్రతో నైపుణ్యం కలయిక: హెరిటేజ్ కలెక్షన్‌ను ఆవిష్కరించిన రాయల్ ఎన్‌ఫీల్డ్

శేరిలింగంపల్లి,ఏప్రిల్ 29 (ప్రజాజ్యోతి):
రాయల్ ఎన్‌ఫీల్డ్ నేడు తన హెరిటేజ్ కలెక్షన్‌ను




విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది.ఇది ఒక ప్రీమియం లైఫ్‌స్టైల్ దుస్తుల శ్రేణి కాగా,ఇది బ్రాండ్ 125 ఏళ్ల చరిత్రను ఆధునిక వార్డ్‌రోబ్ లోకి తీసుకువస్తుంది. కంపెనీ మోటార్‌సైక్లింగ్, మూలాల నుంచి ప్రేరణ పొందిన ఈ కలెక్షన్, ఆర్కైవల్ లోగోలు, జాగ్రత్తగా ఎంపిక చేసిన ఫ్యాబ్రిక్‌లు, బహుముఖ సిల్హౌట్‌లను మిళితం చేసి,మన్నికైన, ప్రస్తుత కాలానికి సరిపోయే దుస్తులను ఉత్పత్తి చేసి అందిస్తుంది.నగరం కోసం నిర్మించబడి,చరిత్రలో పాతుకుపోయిన హెరిటేజ్ కలెక్షన్, రాయల్ ఎన్‌ఫీల్డ్ నైపుణ్యం, ప్రయోజనం, ఆలోచనాత్మకమైన డిజైన్ తత్వాలను ప్రతిబింబిస్తుంది.మన్నిక,ఆకృతి, కదలిక కోసం కాటన్ ట్విల్స్,కాన్వాస్ మిశ్రమాలు,సాగే గుణం ఉన్న మెటీరియల్స్‌ను ఎంపిక చేశారు.తద్వారా ఈ దుస్తులు ఆధునిక పట్టణ జీవితానికి అనువుగా ఉంటూనే,బ్రాండ్ ఆచరణాత్మక స్ఫూర్తికి కట్టుబడి ఉంటాయి. సిల్హౌట్‌లు రిలాక్స్డ్ నుంచి మరింత నిర్మాణాత్మక రూపాల వరకు ఉంటాయి.ఇవి కదలిక స్వేచ్ఛను దృశ్య నిష్పత్తితో సమతుల్యం చేస్తూ, ఒక శతాబ్దపు యాంత్రిక కచ్చితత్వాన్ని రోజువారీ దుస్తులుగా మార్చుతాయి. ఈ కలెక్షన్‌లో, సహజమైన రంగుల పాలెట్ ద్వారా చారిత్రక లోగోలు సూక్ష్మంగా కనిపిస్తాయి.ఇందులో 1910 నాటి ఫిరంగి లోగో, 1893 నాటి "మేడ్ లైక్ ఎ గన్" నినాదం, 1969 నాటి సిరీస్ II ఇంటర్‌సెప్టర్ ట్యాంక్ బ్యాడ్జ్‌లను వస్త్రాలపై నేయడం, ఉబ్బెత్తుగా చెక్కడం లేదా ముద్రించడం చేశారు. ఇవి రాయల్ ఎన్‌ఫీల్డ్ యాంత్రిక ఆవిష్కరణను, మోటార్‌సైక్లింగ్ వారసత్వంతో ఒక స్పష్టమైన అనుబంధాన్ని అందిస్తాయి. ఈ సూచనలు, ఆధునిక ధారణీయతను, సౌందర్య సంయమనాన్ని పాటిస్తూనే,ఈ వస్త్రాలకు చారిత్రక సందర్భాన్ని జోడించి వాటిని సుసంపన్నం చేస్తాయి.రాయల్ ఎన్‌ఫీల్డ్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ యద్విందర్ సింగ్ గులేరియా మాట్లాడుతూ.. రాయల్ ఎన్‌ఫీల్డ్ శతాబ్దానికి పైగా వారసత్వాన్ని దుస్తుల రూపంలో తీసుకురావడమే హెరిటేజ్ కలెక్షన్.ఫ్యాబ్రిక్ ఎంపిక, సిల్హౌట్ నుంచి ఆర్కైవల్ లోగోల ఏకీకరణ వరకు ప్రతి అంశం, బ్రాండ్ డిజైన్ లాంగ్వేజ్ నుంచి నేరుగా ప్రేరణ పొందింది.ఇది సంవత్సరాల తరబడి కచ్చితత్వం,దృఢత్వం, ఆలోచనాత్మకమైన హస్తకళతో నిర్మించిన వారసత్వానికి నివాళి. ఈ వస్త్రాలు కేవలం గతానికి



ప్రతిధ్వనులు మాత్రమే కాదు.ఇవి చురుకైన, ఉద్దేశపూర్వకమైన, సమకాలీన వ్యాఖ్యానాలు. ఇవి ప్రజలు రాయల్ ఎన్‌ఫీల్డ్ వారసత్వంతో అర్థవంతమైన రీతిలో మమేకమయ్యేలా చేస్తాయి.రైడర్లు, స్టైల్ ప్రియుల కోసం ఒకేలా రూపొందించబడిన ఈ కలెక్షన్, హస్తకళను స్పష్టమైన లక్ష్యంతో మిళితం చేస్తుంది. శుద్ధమైన డిజైన్‌కు విలువ ఇచ్చే వారి కోసం వారసత్వ కథను చెప్పేలా ప్రతి డిటెయిల్‌ను జాగ్రత్తగా రూపొందించాము అని తెలిపారు.

### అధికారం రావడం.. పోవడం

# రొటీన్ వ్యవహారం

మొదటిపేజీ తరువాయి..

అనుకోవద్దని నేతలకు సూచించారు. గత ఎన్నికల సమయంలో కేసీఆర్ చిలుకకు చెప్పినట్టు చెప్పారని.. తొందరపడకండి ఆగమై ఓటు వేయకండి అని కేసీఆర్ కల్వకుర్తిలో చెప్పిన మాటలను గుర్తు చేశారు. కేసీఆర్ రైతుబంధు ఇచ్చే సమయంలో ఆయన ఇంట్లో నుంచి ఇస్తున్నారా? అని ప్రశ్నించారు.. పెద్ద రైతులకు ఎందుకు ఇస్తున్నారు అంటూ అడిగారన్నారు. ఎన్ని విమర్శలు వచ్చినా రైతుబంధు మాత్రం కేసీఆర్ ఆపకుండా ఇచ్చేవారని తెలిపారు. ఇప్పుడు పరిస్థితి ఎలా ఉందో చూడాలని ప్రజలకు సూచించారు. చాలా నియోజక వర్గాల్లో కేసీఆర్ గెలిస్తే చాలు ఈ ఎమ్మెల్యే మాకొద్దు అనుకుని తమ ఎమ్మెల్యేలను ఓడగొట్టారని కేటీఆర్ అన్నారు. అలా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఓడగొట్టడం వల్లే కేసీఆర్ సీఎం కాలేకపోయారని తెలిపారు. తర్వాత మనకు చాలా షాక్‌లు తగిలాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాం. ఆ తర్వాత కేసీఆర్‌కి రెండోసారి ఫ్రాక్చర్ జరిగింది. మన పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ మారి వెళ్లిపోయారు. ఇక రేవంత్ రెడ్డి మీద నాకు గెట్టు పంచాయతీ లేదు. ఇంకా వేరే గొడవ ఏమీ లేదు. కానీ ఇష్టం వచ్చినట్లు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన వాళ్లు జనాలను మోసం చేశారు. అన్న వస్త్రానికి పోతే ఉన్న వస్త్రం పోతుందని కేసీఆర్ చెప్పారు. కానీ మనం వినలేదు. ఎన్నికల ముందు కల్వకుర్తిలో సర్వే చేయించాం. మన ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఓడిపోతాడని క్లియర్‌గా చెప్పారు. పదేళ్లు అధికారంలో ఉన్నారు కాబట్టి అధికార మార్పిడి కావాలని చాలా మంది జనాలు భావించారని కేటీఆర్ వివరించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఓడగొట్టడం వల్లే కేసీఆర్ సీఎం కాలేకపోయారని కేటీఆర్ వెల్లడించారు.



## రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ కొరత లేదు

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,ఏప్రిల్ 29(ప్రజాజ్యోతి):
రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ కొరత ఏమాత్రం లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. పెట్రోల్ డీజిల్ కొరతపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. కొందరు పనిగట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. సోషల్ మీడియా ఇన్ ఫ్ల్యూ యెన్సర్లు విషయం తెలుసుకోకుండా తప్పుడు ప్రచారం చేయొద్దన్నారు. నేతలు, సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మి ప్రజలు గందరగోళంలో పడొద్దన్నారు. తొందరపడి పెట్రోల్,డీజిల్ ను ఇండ్లలో నిల్వ ఉంచుకోవద్దన్నారు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి. రాష్ట్రంలో ప్రజల అవసరాలకు కావాల్సినంత స్టాక్ ఉందన్నారుకేంద్ర మంత్రి కిషన్ రెడ్డి. తెలంగాణలో రోజుకు 6వేల 400 కిలో లీటర్ల పెట్రోల్ అవసరం ఉండగా.. ఈ రోజు 10వేల 300 కిల లీటర్ల పెట్రోల్ సప్లయ్ జరిగిందన్నారు. డీజిల్ 8వేల కిలో లీటర్ల అవసరం ఉండగా..19వేల 300 కిలో లీటర్ల సప్లయ్ చేశామన్నారు. అమెరికా , ఇరాన్ యుద్ధం కారణంగా పెట్రోల్ డీజిల్ దిగుమతిలో కొంత సమస్య ఏర్పడింది వాస్తవమే.. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో దేశంలోగానీ, రాష్ట్రంలో గానీ పెట్రోల్ డీజిల్ కొరత లేదన్నారు. 88 శాతం చమురు ఉత్పత్తులను ప్రపంచ దేశాలనుంచి దిగుమతి చేసుకుంటున్నాం..మనకు కావాల్సినంత స్టాక్ ఉందన్నారు కిషన్ రెడ్డి. ఒకవేళ స్టాక్ లేకపోతే పజలకు చెప్తాం.. కావాలనే ప్రతిపక్ష నేతల రేట్లు పెరుగుతాయనిప్రచారం చేస్తున్నారు వారిమాటల నమ్మొద్దన్నారు. రాహుల్ గాంధీ లాంటి ప్రతి పక్ష నేతలు రాజకీయ నేతలు చేస్తున్న పానిక్ కామెంట్లతో ప్రజలు గందరగోళానికి గురవతున్నారు. పెట్రోల్, డీజిల్ ను ఇండ్లలో స్టాక్ పెట్టుకుంటున్నారు..

### రాష్ట్రంలో జోరుగా ధాన్యం

# కొనుగోళ్లు



మొదటిపేజీ తరువాయి..

ఆధ్వర్యంలో 2,623, వివిధ సొసైటీల ద్వారా 3,278 కేంద్రాలు నడుస్తున్నాయి. సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు 6,500 లారీలను సిద్ధం చేశారు. ఇప్పటికే 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు చేరింది. ధాన్యం నిల్వ కోసం ముందస్తుగా 20 కోట్ల గన్నీ సంచులను సిద్ధంగా ఉంచారు. ఇప్పటివరకు రూ. 2,031 కోట్ల విలువైన 8.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. రైతులకు ఇప్పటికే రూ. 323 కోట్ల నగదును వారి ఖాతాల్లో జమ చేశారు. 3.46 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేయడం ద్వారా 64,779 మంది రైతులకు లబ్ది చేకూరింది.



అలాగే, 30,220 మెట్రిక్ టన్నుల సెనగ కొనుగోలు పక్రియ పూర్తయ్యిందని అన్నారు. రాష్ట్రంలో వరి ధాన్యం కొనుగోళ్లు జోరుగా కొనసాగుతున్నాయి. ఈ యాసంగి సీజన్‌లో మొత్తం 141 లక్షల మెట్రిక్ టన్నుల వరి దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అందులో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించే లక్ష్యంతో కొనుగోలు కేంద్రాలను నెలకొల్పింది. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు నిర్వహించేందుకు నిరుటి కంటే ఈసారి కేంద్రాల సంఖ్యను పెంచిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపాదించిన 8,525 కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికే 6,500కు పైగా కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఐకేపీ ఆధ్వర్యంలో 2,623 కేంద్రాలు, సొసైటీల ద్వారా 3,278 కేంద్రాలు, ఇతర సహకార సంస్థల ద్వారా 353 కేంద్రాలు పని చేస్తున్నాయి. అన్ని జిల్లాల్లో దాదాపు 43,000 మంది శిక్షణ పొందిన సిబ్బంది కొనుగోళ్లలో పాల్గొంటున్నారు. ఇప్పటివరకు మంగళవారం నాటికి సుమారు 8.50 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు పూర్తయింది. కొనుగోలు కేంద్రాలకు చేరిన ధాన్యంలో దొడ్డు, సన్న రకాలుగా విభజించి సేకరణ కొనసాగుతోంది. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 6,500 లారీలను అందుబాటులో ఉంచారు. ఇప్పటివరకు 7 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం మిల్లులకు తరలించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా ఆటోమేటెడ్ డ్రైయర్లు, క్లీనర్లు, మాయిశ్చర్ మీటర్లు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచారు. అదనంగా, సుమారు 20 కోట్ల గన్నీ సంచులు ముందుగానే నిల్వ ఉంచారు, తద్వారా కొనుగోళ్లు ఎక్కడా నిలిచిపోకుండా చర్యలు తీసుకున్నారు. రైతులకు చెల్లింపులు వేగంగా జరుగుతున్నాయి. దాదాపు రూ.2031 కోట్ల విలువైన ధాన్యం సేకరించగా.. ఇప్పటికే దాదాపు రూ.323 కోట్లు రైతులకు చెల్లించారు. వెంట వెంటనే చెల్లింపులు జరిగేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ధాన్యంతో పాటు రాష్ట్రంలో ఇతర పంటల కొనుగోళ్లు కూడా కొనసాగుతున్నాయి. ఈసారి 43.20 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న దిగుబడి అంచనాలున్నాయి. ఇప్పటివరకు 3.46 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు జరిగాయి. దాదాపు రూ.830.69 కోట్ల విలువైన కొనుగోళ్లతో 64,779 మంది రైతులు లబ్ది పొందారు. 1.25 లక్షల మెట్రిక్ టన్నుల సెనగ పంట దిగుబడి ఉంటుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇప్పటివరకు 30,220 మెట్రిక్ టన్నుల కొనుగోలు జరిగింది. దీనివల్ల 15,933 మంది రైతులు లబ్ది పొందారు. పొద్దుతిరుగుడు పంటకు 19,808 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా వేయగా, ఇప్పటివరకు 3,492 మెట్రిక్ టన్నుల కొనుగోలు పూర్తయింది. 2,512 మంది రైతుల నుంచి కొనుగోళ్లు జరిగాయి. అన్ని జిల్లాల్లో పంట ఉత్పత్తుల కొనుగోళ్లు పారదర్శకంగా, వేగంగా కొనసాగుతున్నాయి. రైతులకు కనీస మద్దతు ధర అందించటంతో పాటు సౌకర్యవంతమైన సేవలు, తక్షణ చెల్లింపులు జరిగేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967